Islam Bodhanalu
(Teachings of Islam - Telugu)

# ఇస్లాం బోధనలు

రచన
**అబుల్ ఇర్ఫాన్**

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్
ఫ్లాట్ నెం. **106**, పత్తర్‌గట్టి, హైదరాబాద్ **-2,**
ఫోన్ నెం. **66710795, 9441515414**

వెల.........................................................రూ. 30/-లు




| | |
|---|---|
| Name of the Title: | Islam Bodhanalu (Telugu) (Teachings of Islam) |
| Compilation : | **ABUL IRFAN** Hyderabad-2 |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | February, 2008 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre Sahara Complex, Pathargatti, Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, I.R.C. Graphics Sahara Complex, Pathargatti, Hyderabad-500002 |
| Printed at: | Unity Graphics Chatta Bazar, Hyderabad-500002 |
| Price: | Rs. 30/- |


# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | ప్రకృతిశాసనాలు-దైవనియమావళి | 6 |
| 2. | బుద్ధిజీవుల్లో బుద్ధిలేనివారు | 8 |
| 3. | సత్యతిరస్కారం వల్ల నష్టాలు | 10 |
| 4. | ఇస్లాంలోని ప్రయోజనాలు | 16 |
| 5. | విశ్వాసం-విధేయత | 20 |
| 6. | విశ్వాసం అంటే ఏమిటీ? | 22 |
| 7. | జ్ఞానార్జన మార్గం | 24 |
| 8. | అతీంద్రియాలపై విశ్వాసం | 25 |
| 9. | దైవదౌత్యం (ప్రవక్తృత్వం) | 26 |
| 10. | కారుచీకటిలో కాంతిరేఖ | 31 |
| 11. | ఇస్లాం స్వీకార ఒప్పందం | 40 |
| 12. | సద్వచన సారాంశం | 42 |
| 13. | మౌలిక విశ్వాసాలు | 46 |
| | ✦ దైవదూతలపై విశ్వాసం | 47 |
| | ✦ దైవగ్రంథాలపై విశ్వాసం | 50 |
| | ✦ పరలోకంపై విశ్వాసం | 54 |
| 14. | పరలోక విశ్వాసం ఆవశ్యకత | 56 |
| | ✦ ఇతర మతాల్లో పరలోకభావన | 60 |
| 15. | ఆరాధనలు | 64 |





| | | |
|---|---|---|
| | ✦ నమాజ్ (ప్రార్థన) | 67 |
| | ✦ జకాత్ (పేదల ఆర్థికహక్కు) | 70 |
| | ✦ రమజాన్ ఉపవాసాలు | 74 |
| | ✦ హజ్ యాత్ర | 80 |
| | ✦ అంతర్జాతీయ సమానత్వం | 84 |
| 16. | దుష్టశిక్షణ-శిష్టరక్షణ | 85 |
| 17. | ధర్మం(దీన్), ధర్మశాస్త్రం(షరీఅత్) | 89 |
| | ✦ ధర్మావగాహన శాస్త్రం (ఫిఖహ్) | 91 |
| | ✦ ఆధ్యాత్మికత (తసవ్వుఫ్) | 92 |
| 18. | హక్కులు-బాధ్యతలు | 95 |
| | ✦ దాసుల హక్కులు | 96 |
| | ✦ తల్లిదండ్రుల హక్కులు | 97 |
| | ✦ సంతానం హక్కులు | 99 |
| | ✦ భర్త హక్కులు | 100 |
| | ✦ భార్య హక్కులు | 102 |
| | ✦ బంధువుల హక్కులు | 104 |
| | ✦ కలసివుంటేనే కలదు సుఖం | 109 |
| | ✦ మానవ హక్కులు | 111 |

కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

# ఇస్లాం బోధనలు

ఈ సువిశాల విశ్వానికి, అందులోని సకల చరాచరాలకు సృష్టికర్త, స్వామి, ప్రభువు, పోషకుడు, పాలకుడు, పర్యవేక్షకుడు, ఆరాధ్యుడయిన దేవుడు ఒక్కడే అని విశ్వాసం రీత్యా ప్రపంచ మతాలన్నీ అంగీకరిస్తున్నాయి. అయితే ఆచరణరీత్యా అలాంటి గుణగణాలు కలిగిన ఆ దేవుడు ఒక్కడేనని ఒక్క ఇస్లాం మాత్రమే అంగీకరిస్తోంది. ఈ కారణంగానే ఇస్లాం అనుయాయు లయిన ముస్లింలు బహుదైవారాధనకు బహుదూరంగా ఉంటున్నారు.

అలాగే ప్రపంచంలోని ఇతర మతాల పేర్లన్నీ ఆయా మతాలకు చెందిన ఓ విశిష్ఠ వ్యక్తి పేరుతోనో లేదా జాతి పేరుతోనో లేదా ప్రాంతం పేరుతోనో ముడిపడి ఉన్నాయి. ఉదాహరణకు- క్రైస్తవమతం ఏసుక్రీస్తు పేరుతో, బౌద్ధమతం గౌతమ బుద్ధిడి పేరుతో, యూదమతం యూదజాతి పేరుతో, హిందూమతం హిందీభాష లేక సింధూనది పేరుతో ముడిపడి ఉన్నాయి. కాని ఇస్లాం మాత్రం వ్యక్తులు, జాతులు, ప్రాంతాల పేర్ల మీద కాకుండా దాని గుణగణాల మీద ఆధారపడి ఉంది.

ఇస్లాం పదం 'సలం' అనే ధాతువు నుండి ఉద్భవించింది. సలం అంటే విధేయత, సమర్పణ, శాంతి అని శాబ్దిక భావాలు. ఇస్లాం అన్నా అవే అర్థాలు. ఇస్లాంను విశ్వసించినవారు పైన పేర్కొన్న గుణగణాలు కలిగిన దేవునికి పూర్తిగా విధేయులై, ఆయనకు తమనుతాము సమర్పించు కొని శాంతిపొందిన వారవుతారు. ఇస్లాం పట్ల దృఢమైన విశ్వాసం కలిగిన ముస్లింలు ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటారు. శాంతిస్థాపనే వారి జీవిత ధ్యేయం. శాంతిస్థాపన కోసమే వారు నిరంతరం పోరాడుతారు. శాంతిస్థాపన కోసం వారు అవసరమైతే ధన ప్రాణాలను సైతం త్యాగం చేస్తారు.

ఇస్లాం మౌలిక గుణగణాలయిన విధేయత, సమర్పణ, శాంతి అనేవి లోకంలోని ఏఏ సృష్టితాలలో ఉంటాయో ఆయా సృష్టితాలన్నిటినీ ఇస్లాం



ముస్లింలుగానే పరిగణిస్తుంది. వివిధ సృష్టిరాసుల కార్యకలాపాల్ని పరికించి చూస్తే అవన్నీ ఓ అద్భుతమైన నియమావళికి కట్టుబడి ఉన్నాయని, ఆ నియమావళిని అవి ఏమాత్రం అతిక్రమించలేవని మనం గమనించగలం.

## 1. ప్రకృతిశాసనాలు-దైవనియమావళి

కటిక చీకటిలో జిలుగువెలుగులతో శోభాయమానంగా కన్పించే ఆకాశం వైపు చూడండి. మన భూమితో సహా అసంఖ్యాకమైన గ్రహాలు, నక్షత్రాలు తమ తమ నిర్ణీత కక్ష్యల్లో, నిర్ణీత వేగాలతో ఎంతో నియమబద్ధంగా సంచ రిస్తున్నాయి. వాటి వేగాల్లో, కక్ష్యల్లో ఏమాత్రం తేడా రాదు. పశుపక్షాదులు కూడా తమకు నిర్ణయించిన నియమావళి ప్రకారం నియమబద్ధంగా నడుచుకుంటున్నాయి. చెట్లు, చామలు, క్రిమికీటకాలు కూడా తమకు నిర్ణయించిన నియమావళి ప్రకారమే మనుగడ సాగిస్తున్నాయి.

ఈవిధంగా మన భూమి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు నిర్ణీత నియమావళి ప్రకారమే తమ విధులు నిర్వహిస్తున్నాయి. పశువులు, పక్షులు, వృక్షాలు, ఇతర సృష్టితాలు కూడా నిర్ణీత నియమావళి ప్రకారమే తమతమ భౌతికధర్మాలు నెరవేరుస్తున్నాయి. ఇలా విశ్వంలోని అణువణువూ నిర్దేశిత నిబంధనల ప్రకారమే పని చేస్తోంది. చివరికి మానవుని అవయవాలు కూడా నిర్దేశిత నిబంధనల మేరకే తమ సహజ కార్యాలు నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ ఎంతో నియమబద్ధంగా, పకడ్బందీగా తమ విధులు నిర్వహిస్తున్నాయంటే వాటి సృజనకు, కార్యనిర్వహణకు కారకుడైన అద్భుతశక్తి సంపన్నుడి ఉనికే.

ఆ అద్భుత శక్తిసంపన్నుడు, అగోచరుడు, ఆదిమధ్యాంతరహితుడయిన దేవునికే ఈ సృష్టితాలన్నీ విధేయులయి ఆయన నిర్దేశించిన శాసనాల ప్రకారం తమతమ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నాయి. అందువల్ల ఇస్లాం తన శాబ్దిక భావాలదృష్ట్యా వాటన్నిటినీ ముస్లిములుగానే పరిగణిస్తుంది. మన భూమి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, చెట్లు, రాళ్ళు, గాలి, నీరు, వెలుగు, మానవుని అవయవాలు సమస్తం ముస్లిములే. కారణం అవన్నీ దేవునికి విధేయులయి ఆయన నిర్దేశించిన శాసనాల ప్రకారం పనిచేస్తున్నాయి.

"భూమ్యాకాశాల సృజనలో, రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, సముద్రాలలో పయనిస్తూ మానవులకు ప్రయోజనం చేకూర్చే ఓడలలో, దేవుడు పైనుంచి కురిపించే వర్షపునీటిలో, తద్వారా ఆయన మృతభూమికి జీవంపోసే (పచ్చదనం చేసే) పనిలో, పుడమిపై పలువిధాల జీవరాసుల్ని విస్తరింపజేసే ఆయన సృష్టినైపుణ్యంలో, గాలుల సంచారంలో, నేలకు నింగికి మధ్య నియమబద్ధంగా సంచరించే మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని ఆస్తిత్వాన్ని, ఏకత్వాన్ని తెలిపే) అనేకనేక నిదర్శనాలు ఉన్నాయి." (ఖుర్ఆన్-2:164)

"సప్తాకాశాలు, భూమి, భూమ్యాకాశాల్లోని యావత్తు సృష్టిరాసులు ఆయన పవిత్రతను కొనియాడుతున్నాయి. ఆయన ఔన్నత్యంతో పాటు ఆయన పవిత్రతను ప్రశంసించని సృష్టిఅంటూ ఏదీలేదు. కాని అవిచేసే దైవస్మరణను మీరు గ్రహించలేరు." (ఖుర్ఆన్-17:44)

"ఆయనే (పరాత్పరుడు, పరమోన్నతుడైన) అల్లాహ్. భూమ్యాకాశాల్లోని అణువణువూ తన ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండా ఆయనకే సాష్టాంగపడుతోంది. ఉదయం, సాయంత్రం సమస్త వస్తువుల ఛాయలు కూడా ఆయనకే మోకరిల్లుతున్నాయి" (ఖుర్ఆన్-13:15).

"భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు దేవుని ముందు సాష్టాంగపడుతున్న విషయం నీవు గమనించలేదా? సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, అనేకమంది మానవులు, (దైవ)శిక్షకు అర్హులైపోయిన చాలామంది మానవులు కూడా." (ఖుర్ఆన్-22:18)

మానవుని శరీరావయవాలు కూడా దైవనియమావళికి కట్టుబడి ఉన్నాయిగనక ఇవి కూడా ముస్లిములే. మనిషి దైవనియమావళి ప్రకారం ముక్కుతో మాత్రమే వాసన చూడగలుగుతాడు, చెవులతో వాసనచూడలేడు. మనిషి చెవులతో మాత్రమే వినగలుగుతాడు, ముక్కుతో వినలేడు. కళ్ళతో మాత్రమే చూడగలుగుతాడు, నోటితో చూడలేడు. నోటితోనే తినగలుగుతాడు, కళ్ళతో తినలేడు. ఇలాగే ఇతర అవయవాలు. ఈ అవయవాలన్నీ దేవుడు నిర్దేశించిన శాసనాల ప్రకారమే తమ విధులు నిర్వహిస్తున్నాయి. ఆ శాసనాలను ఇవి ఏమాత్రం అతిక్రమించలేవు.



ఇలా మానవుడు ప్రపంచంలోని ఇతర సృష్టితాల మాదిరిగా పుట్టుకతోనే ముస్లిం అవుతాడు. అయితే మానవుడు తనకు దేవుడు ప్రపంచంలో పరీక్ష నిమిత్తం ప్రసాదించబడిన స్వేచ్ఛను దుర్వినియోగంచేస్తూ వివిధ జీవిత రంగాల్లో ఆయన నిర్దేశించిన చట్టాలను మాత్రమే ఉల్లంఘించ గల్గుతాడు. అతను సృష్టికర్తను ఆరాధించడానికి బదులు విగ్రహాలను, తోటిమానవుల్ని, ఇతర సృష్టితాలను ఆరాధిస్తాడు. దైనందిన జీవిత వ్యవహారాలలో దైవ శాసనాలకు వ్యతిరేకంగా తనకు తోచిన లేదా తోటిమానవులు సూచించిన విధానాలు పాటిస్తాడు. అంటే అతను భౌతికంగా, ప్రకృతిపరంగా ముస్లిం అయ్యాడుగాని మానసికంగా, ఆధ్యాత్మికంగా ముస్లిం కాలేకపోయాడు.

దానికి భిన్నంగా తన సృష్టికర్త, యజమాని, ప్రభువు, పోషకుడయిన నిజ దేవుడ్ని గుర్తించి ఆయన ప్రసాదించిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ జీవిత సమస్త వ్యవహారాల్లో ఆయన నిర్దేశించిన శాసనాల ప్రకారం జీవితం గడిపే మనిషి భౌతికంగా, ప్రకృతిపరంగా మాత్రమే గాకుండా మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా ముస్లిం అవుతాడు. మరో మాటలో చెప్పాలంటే అతనిప్పుడు పరిపూర్ణ ముస్లిం అయ్యాడు.

## 2. బుద్ధిజీవుల్లో బుద్ధిలేనివారు

బుద్ధిజీవులైన మానవులు ఈవిధంగా రెండు వర్గాలుగా విడిపోతారు. ఒక వర్గం- మానవులు తమకు దేవుడు ప్రసాదించిన బుద్ధిజ్ఞానాలు, విజ్ఞతా వివేచనలు, మంచీ-చెడుల విచక్షణాజ్ఞానం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు దుర్వినియోగం చేసి నిజదైవాన్ని విస్మరించి అవిశ్వాసులయిన వారు. రెండో వర్గం- మానవులు ఈ బుద్ధిజ్ఞానాలు, విజ్ఞతావివేచనలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సద్వినియోగం చేసుకొని నిజదైవాన్ని గుర్తించి విశ్వాసులయిన వారు.

మొదటి వర్గానికి చెందిన మానవుడ్ని ఇస్లాం పరిభాషలో కాఫిర్ అంటారు. కాఫిర్ పదం కుఫర్ అనే ధాతువు నుండి పుట్టింది. కుఫర్ అంటే దాచడం, తిరస్కరించడం అని శాబ్దిక భావాలున్నాయి. దీని ప్రకారం కాఫిర్ అంటే వాస్తవాన్ని దాచినవాడు, యదార్థాన్ని మరుగుపరచినవాడు, సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించినవాడు. అంటే అవిశ్వాసి, సత్యతిరస్కారి అని అర్థం.

మానవుని అంతరాత్మ సత్యాన్ని సహజంగానే అంగీకరిస్తుంది. కాని అతను అనేక కారణాలవల్ల అంతరాత్మ ప్రబోధనను నొక్కిపట్టి సత్యాన్ని తిరస్కరిస్తాడు; బహిర్గతం చేయకుండా దాచేస్తాడు.

ఈ వర్గం మనిషి వాస్తవానికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉంటాడు. తన శరీరంలోని ప్రతి అవయవం, తన చుట్టూ ఉండే పరిసరాలు, విశ్వంలోని చరాచరాలు సమస్తం దేవుడు నిర్దేశించి ప్రకృతి శాసనాల ప్రకారమే పనిచేస్తుంటే ఈ నరుడు కళ్ళుండి కూడా పరికించి చూడలేడు; హృదయం ఉండి కూడా ప్రశాంతంగా ఆలోచించలేడు. అతని కళ్ళపై ఏమరుపాటు పొర కమ్ముకుంది. అతని హృదయకవాటాలు మూసుకుపోయాయి. కాని అతను తనకు స్వేచ్ఛ ఇవ్వబడని కార్యరంగంలో తనకు తెలియకుండానే దైవాజ్ఞల్ని శిరసావహిస్తున్నానన్న వాస్తవం గ్రహించలేకపోతున్నాడు.

“మేము అనేకమంది మానవులను, జిన్నులను నరకం కోసమే పుట్టించాం. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు.” (ఖుర్‌ఆన్–7:179)

హృదయముండి ఆలోచించనివారు, కళ్ళుండి చూడనివారు, చెవులుండి విననివారు ఎవరూ ఉండరు. కాని ఖుర్‌ఆన్ ఇలా ఆరోపిస్తుందంటే దానిక్కారణం, వారు దైవశాసనాలు, పరలోక విషయాలలో మాత్రమే ఇలా ప్రవర్తిస్తారు. విశ్వవ్యవస్థ వెనుక ఉన్న సృష్టికర్త హస్తాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించరు. సృష్టివ్యవస్థలో ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని చాటుతున్న అసంఖ్యాక నిదర్శనాలను గమనించరు. దైవం, పరలోకం గురించిన సత్యవాక్కులు వీరి చెవులకెక్కవు. బుద్ధిజీవులై ఉండి దేవుని విషయంలో బుద్ధినుపయోగించకపోతే పర్యవసానం ఇలాగే ఉంటుంది.

ఈ వైఖరి కారణంగానే వారు మానవస్థాయి నుంచి దిగజారి పశువులకన్నా నికృష్టులయ్యారని ఖుర్‌ఆన్ అంటోంది. ఇలాంటివారికి ప్రపంచమే సర్వస్వం. ఎలాగైనా వీలైనన్ని ప్రాపంచిక సుఖాలు జుర్రుకోవాలన్నదే వీరి



ధ్యేయం. మంచిచెడులతో, ధర్మాధర్మాలతో నిమిత్తం లేదు. వీరి దృష్టిలో దగా, మోసం, అన్యాయం, అవినీతి అన్నీ ధర్మసమ్మతమే. నీటిబుడగ లాంటి ఇహికజీవితం కోసం శాశ్వత పరలోకజీవితాన్ని విస్మరించడం కంటే మించిన ఆత్మవంచన మరేదైనా ఉందా?

“బుద్ధినుపయోగించని బధిరులు, మూగలు దేవుని దృష్టిలో పశువులకన్నా నికృష్టులు.” (8:22,23); “రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, ఆకాశం నుండి దేవుడు దించే ఉపాధి (వర్షం)లో, తద్వారా ఆయన మృతభూమికి జీవం పోసే (సస్యశ్యామలంచేసే) ప్రక్రియలో, గాలుల చలనంలోనూ బుద్ధిజ్ఞానాలు కలవారికి అద్భుత నిదర్శనాలున్నాయి.” (ఖుర్‌ఆన్–45:1–5)

# 3. సత్యతిరస్కారం వల్ల నష్టాలు

సత్యతిరస్కారం (కుఫర్)కు పర్యాయపదం అజ్ఞానం లేక మూఢత్వమే. మనిషి దేవుడ్ని గురించిన సత్యం తెలుసుకోక పోవడంకంటే మించిన అజ్ఞానం మరేముంటుంది? అతనీ జగతికి సంబంధించిన మహోన్నతమైన కర్మాగారాన్ని, దాని నిర్వహణ తీరును రేయింబవళ్ళు చూస్తున్నాడు. కాని ఆ కర్మాగారాన్ని నిర్మించి నడిపేవాడెవడో అతనికి తెలియదు. అతను ప్రకృతిలోని చిత్రవిచిత్ర వస్తువుల్ని, వాటిలో ఉన్న అసాధారణ సాంకేతిక ఔన్నత్యం అనుదినం చూస్తున్నాడు. అయినా వాటి ఉనికికి, నిర్వహణకు మూలకారకుడెవరో తెలుసుకోలేక పోతున్నాడు. దీన్నిబట్టి అతను ఎంతటి ఘోరమైన అజ్ఞానపు రొచ్చులో కూరుకుపోయాడో ఊహించవచ్చు.

ఇలాంటి అజ్ఞానాంధకారంలో తచ్చాడే మనిషికి విశ్వసనీయమైన జ్ఞానమార్గం ఎలా లభిస్తుంది? సరైన జ్ఞానార్జన విషయమై అజ్ఞానంతో ప్రారంభంలోనే తప్పటడుగు వేసిన మనిషి ఆ కారుచీకటిలో కళ్ళు చించుకొని ఎంత శోధించినా, తనకున్న పరిమితజ్ఞానంతో నింగికి నిచ్చెనవేసి వెతికినా జ్ఞానకాంతిని చూడలేడు. అతనికి ప్రతిచోటా లభించేది అంధకారమే.

మానవుని అవయవాలతో సహా ప్రపంచంలోని సమస్త వస్తువులు, సృష్టితాలు దేవునికి విధేయత చూపుతూ, ఆయన నిర్దేశించిన ప్రకృతి (ఇస్లాం) శాసనాల ప్రకారమే పనిచేస్తున్నాయని మనం గత పేరాలలో

తెలుసుకున్నాం. దేవుడు మానవునికి నిర్ణయాధికారం, ఎంపిక స్వేచ్ఛలతో పాటు ప్రపంచంలోని ఇతర సృష్టితాలపై కొంతమేరకు పాలనాధికారం కూడా ప్రసాదించాడు. అయితే దైవశాసనాలను త్రోసిపుచ్చిన మానవుడు ఆయా సృష్టితాలతో ప్రకృతి విరుద్ధమైన పనులు చేయిస్తున్నాడు. ఉదాహరణకు- నోరు నిర్వహించే సహజసిద్ధమైన విధులలో ఒకటి సత్యం పలకడం కూడా ఉంది. కాని ఈ అజ్ఞాని నోటిని దాని ప్రకృతి గుణానికి వ్యతిరేకంగా బలవంతంగా దానిచేత అబద్ధం పలికిస్తున్నాడు. అలాగే కళ్ళు, కాళ్ళు, చేతులు, ఇతర అవయవాలతో వాటి ప్రకృతికి విరుద్ధంగా బలవంతంగా దుష్కార్యాలు చేయిస్తున్నాడు. అంటే అతను వాటిపై దౌర్జన్యం చేస్తున్నాడన్న మాట. మరోమాటలో చెప్పాలంటే అతను ఇతర సృష్టితాల పైనే గాకుండా తన అస్తిత్వంపై కూడా దౌర్జన్యం చేస్తున్నాడు.

దీన్నిబట్టి సత్యతిరస్కారం (కుఫర్) ఎంతటి దౌర్జనకరమైన విషయమో స్పష్టమవుతోంది. సత్యతిరస్కారం దౌర్జన్యం మాత్రమే కాదు, అది నమ్మక ద్రోహం, కృతఘ్నత, తిరుగుబాటు కూడా అవుతాయి. తన అవయవాల చేత బలవంతంగా దుష్కార్యాలు చేయించుకున్న మానవుడికి వ్యతిరేకంగా పరలోకంలో అతని అవయవాలు కూడా సాక్ష్యమిస్తాయి.

“దైవవిరోధుల్ని నరకానికి తీసికెళ్లేందుకు వారిని చుట్టు ముట్టి తీసుకొచ్చే రోజు గురించి ఊహించు. అప్పుడు ముందొచ్చినవారిని వెనుక వచ్చిన వారు దగ్గరికొచ్చేదాకా ఆపివేయడం జరుగుతుంది. అలా అందరూ అక్కడికి చేరుకున్న తరువాత వారి కళ్ళు, చెవులు, చర్మాలు వారు ప్రపంచంలో ఉన్నప్పుడు ఏమేమి చేసేవారో సాక్ష్యమిస్తాయి. అప్పుడు వారు తమ చర్మాలను ఉద్దేశించి “మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిస్తున్నారు?” అని అడుగుతారు. దానికవి ఇలా సమాధానమిస్తాయి:

“ప్రతి వస్తువుకు మాట్లాడే శక్తినిచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తినిచ్చాడు. ఆయనే మిమ్మల్ని మొదటిసారి పుట్టించాడు. ఇప్పుడు ఆయన దగ్గరికే మీరు తీసుకురాబడ్డారు. మీరు రహస్యంగా నేరాలు చేస్తున్నప్పుడు, ఎప్పుడో ఓసారి మీ కళ్ళు, చెవులు, చర్మాలు కూడా మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న



ఆలోచనే మీకు కలగలేదు. పైపెచ్చు మీరు చేసే దుష్కార్యాలు అనేకం దేవునికి కూడా తెలియదని మీరు భావిస్తుండేవారు. దేవుడ్ని గురించి మీలో ఏర్పడిన ఈ దుష్టభావనే మిమ్మల్ని (నట్టేట) ముంచింది. ఈ కారణంగానే మీరిప్పుడు నష్టపోయారు”. (ఖుర్ఆన్–41:19–23)

మానవుని దగ్గర తనదంటూ ఏముంది? తన ముక్కు, చెవులు, కళ్ళు, కాళ్ళు, చేతులు, నోరు, హృదయం మొదలైన అవయవాల్ని అతనంతట అతనే సృష్టించుకున్నాడా? లేక దేవుడు సృష్టించాడా? వాటిని వినియోగించుకునే శక్తి అతనే సంపాదించుకున్నాడా లేక దేవుడు ప్రసాదించాడా? ఇవన్నీ దేవుడు సృష్టించినవేనని, ఆయన ప్రసాదించినవేనని తలలో మెదడున్న ఏ మనిషైనా చెబుతాడు. మరి దేవుడు సృష్టించి ప్రసాదించిన ఈ అవయవాల్ని దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా ఉపయోగించే అధికారం అతనికి ఎవరిచ్చారు? ఇది దేవుని పట్ల కృతజ్ఞత, తిరుగుబాటు, నమ్మక ద్రోహాలు కాదా? తన అస్తిత్వంపై దౌర్జన్యం చేయడం కాదా? ఎవరైనా సేవకుడు తన యజమాని ఉప్పుతింటూ తన విధులు నిర్వహించకుండా ఎగ్గొడితే లేదా ఇతరులకు సేవ చేస్తుంటే ఆ చర్య కృతఘ్నత, నమ్మక ద్రోహాల కిందికి రాదా?

“వీరు సృష్టికర్త లేకుండానే తమంతటతాము తయారై ఉనికిలోకి వచ్చారా లేక తమకుతామే సృష్టికర్తలా? పోనీ భూమ్యాకాశాల్ని సృష్టించారా వీరు? (అదేమీకాదు.) వీరికసలు సత్యంపై నమ్మకమే లేదు. (ఖురాన్–52:35,36)

“సరే, చనిపోతున్న మనిషి ప్రాణం మీరు కళ్ళారా చూస్తుండగానే అతని కంఠం దాకా వచ్చి, బయటికి పోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు దాన్ని మీరెందుకు ఆపలేరు? మీరు ఎవరి అదుపాజ్ఞలో లేరనుకుంటే ఈపని ఎందుకు చేయలేరు?” (ఖుర్ఆన్–56:83,84)

“దేవుడు మిమ్మల్ని మీకేమీ తెలియని స్థితిలో మీతల్లుల గర్భాల నుండి తీశాడు. ఆయన మీకు చూడటానికి కళ్ళిచ్చాడు, వినడానికి చెవులిచ్చాడు, ఆలోచించడానికి హృదయాన్నిచ్చాడు. మీరు కృతజ్ఞత చూపుతారనే ఆయన ఇవన్నీ మీకిచ్చాడు.” (ఖుర్ఆన్–16:78)

"మేము స్వయంగా మిమ్మల్ని సృష్టించామే, మరి మీరెందుకు (మామాట) అంగీకరించరు? మీరు వదిలే రేతస్సు గురించి ఎప్పుడైనా ప్రశాంతంగా ఆలోచించారా? దాని ద్వారా శిశువుని రూపొందిస్తున్నది మీరా లేక మేమా?" (ఖుర్ఆన్–56:61)

"మీరు పొలాల్లోనాటే విత్తనాల్ని గురించి ఆలోచించారా? ఆ విత్తనాలతో పంటలు మీరు పండిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే ఆ పంటపొలాల్ని నుగ్గునుగ్గు చేసేయగలం. అప్పుడు మీరు విచారిస్తూ "అయ్యయ్యో! మా శ్రమ, పెట్టుబడి అంతా వృధా అయ్యిందే! అసలు మా నొసటే దౌర్భాగ్యం రాసిఉంది" అని రకరకాలుగా చెప్పుకుంటారు. సరే, మీరు త్రాగే నీటిని కళ్ళుతెరచి చూశారా? దాన్ని మేఘాల నుండి మీరు కురిపిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే దాన్ని తీవ్రమైన ఉప్పు నీటిగా మార్చేయగలం. మరి మీరు (మాపట్ల) ఎందుకు కృతజ్ఞులై ఉండరు?" (ఖుర్ఆన్–56:63–70)

మానవుడు ఈ ప్రపంచంలో అనేక వస్తువుల్ని వాడుకుంటూ ఎంతో ప్రయోజనం పొందుతున్నాడు. కాని ఆ వస్తువుల్ని సృష్టించి వాటివల్ల తనకు మేలు చేకూర్చుతున్న అదృశ్యశక్తిని గురించి ఆలోచించడం లేదు. పైగా ఆ అదృశ్యశక్తి దైవత్వాన్ని, ఆయన గుణగణాలను విభజించి సృష్టికర్త, మృత్యుదేవత, పంటల దేవత, వరుణ దేవుడు, అగ్నిదేవుడంటూ రకరకాల పేర్లుపెట్టి వాటి ఊహాజనిత చిత్రాలను, విగ్రహాలను పూజిస్తున్నాడు. అయితే ప్రకృతిలోని ఈ వస్తువులు, వాటి ప్రయోజకత్వం, వాటి మధ్య సమన్వయం, నిబద్ధతలను గురించి ప్రశాంత మనస్సుతో ఆలోచిస్తే వీటన్నిటికి మూలకారకుడు ఒకే దేవుడని గ్రహించగలం. ఆ దేవుడ్ని మాత్రమే ఆరాధించడం, ఆయన చూపే జీవనపథాన్నే అనుసరించడం మానవుని విధ్యుక్తధర్మం. ఇదే అతను దేవుని పట్ల చూపే కృతజ్ఞత.

మనకెవరైనా ఓ యాభై రూపాయల విలువగల సహాయం చేస్తే మనం అతనికి ఎంతో కృతజ్ఞత చూపుతాం. మరి కాస్త ఎక్కువ సహాయం చేస్తే 'నేను మీకెంతో రుణపడి ఉన్నాను, మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను' అంటాము. తోటి మానవులు చేసే ఈ చిరుసహాయం సృష్టికర్త చేసిన, చేస్తున్న సహాయంలో 0.00000001 శాతం కూడా ఉండదు. అయినా ఈ మానవుడు సృష్టికర్తను వదలి సృష్టితాల వెంటపడ్డాడు!



అయితే దేవుడు తాను ప్రసాదించిన మహాభాగ్యాలను గురించి మానవుల నుండి పరలోకంలో లెక్క తీసుకుంటాడు; ఈ మహాభాగ్యాలను నా ఆదేశాల ప్రకారం మీరు ఏ మేరకు సద్వినియోగం చేశారని తప్పకుండా నిలదీస్తాడు. అప్పుడు దైవాజ్ఞలను విస్మరించి వాటిని దుర్వినియోగం చేసినవారి గతి ఏమవుతుంది?

ఇది సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం. ఈ మహాభాగ్యాలు ప్రసాదించిన సృష్టికర్తకు కృతజ్ఞులయి ఆయన ఆదేశాల ప్రకారం, ఆయన ప్రవక్తల హితవుల ప్రకారం జీవితాంతం సత్కర్మలు ఆచరించినవారే నరక యాతనల నుండి తప్పించుకుంటారు. అలాంటివారే స్వర్గప్రవేశానికి, దైవ దర్శనభాగ్యానికి నోచుకుంటారు.

"ఎవరైనా కృతజ్ఞత చూపుతున్నాడంటే అది అతనికే లాభదాయకమవు తుంది. కృతఘ్నుడైపోతే (అది అతనికే చేటు). నా ప్రభువు నిరపేక్షాపరుడు దేన్నీ ఖాతరుచేయని వాడు..." (ఖుర్ఆన్–27:40)

"మీరు సత్యాన్ని తిరస్కరిస్తే, (మీరేకాదు) ప్రపంచంలోని మానవులంతా సత్యతిరస్కారులై పోయినాసరే (దానివల్ల దేవుని దైవత్వానికి వాటిల్లే నష్టమేమీ లేదు), ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు." (ఖు–14:8).

దైవప్రవక్త (స) ప్రకారం దేవుడిలా చెబుతున్నాడు: "నా దాసులారా! అనాది నుండి అంతం వరకు మీరు మానవులు, జిన్నులు అంతా అందరి కంటే ఎక్కువ దైవభీతిపరుడైన వ్యక్తి హృదయంలా అయిపోతే, దానివల్ల నా రాజరికానికి (దైవత్వానికి) ఒరిగేదేమీ లేదు. నా దాసులారా! అలాగే అనాది నుండి అంతం వరకు మీరు మానవులు, జిన్నులంతా అందరికంటే ఎక్కువ దుర్మార్గుడైన వ్యక్తి హృదయంలా మారితే, దానివల్ల నా రాజరికం (దైవత్వం)లో ఏమాత్రం లోటురాదు. నా దాసులారా! ఇవి మీరు చేసుకున్న కర్మలే. వాటిని నేను మీ కర్మపత్రంలో రాస్తాను. ఆ తర్వాత వాటి ప్రకారం

మీకు పూర్తి ప్రతిఫలం ఇస్తాను. కనుక మీలో ఎవరికైనా మేలు జరిగితే అతను దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకోవాలి. మరెవరికైనా కీడు జరిగితే తననుతానే నిందించుకోవాలి.'' (ముస్లిం)

నిజదేవుడ్ని గుర్తించకుండా అజ్ఞానాంధకారంలో తచ్చాడే మానవునికి జీవితంలోని ఏ రంగంలో కూడా సరైన మార్గదర్శనం లభించదు. అతను సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అనేక సమస్యలతో సతమతమవు తాడు. ఒక సమస్యను పరిష్కరించబోతే మరొక సమస్య పుట్టుకొస్తుంది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు లేదా మరిన్ని సుఖభోగాలు అనుభవించడానికి మోసాలకు, నక్కజిత్తులకు పాల్పడతాడు. సమాజంలో అంతఃకలహాలు, ఆర్థిక-రాజకీయ సంక్షోభాలు సృష్టిస్తాడు. తోటి మానవులపై దుర్భర దౌర్జన్యానికి ఒడిగడ్తాడు; రక్తపు టేరులు ప్రవహింపజేస్తాడు.

"కొందరు ఇహలోక జీవితాన్ని గురించి చెప్పేమాటలు నిన్నెంతో ఆకట్టు కుంటాయి. వారు తమ అంతరంగాల్లో వున్న భావాలు పరమ పవిత్రమైనవని తెలిపేందుకు మాటిమాటికి దేవుడ్ని సాక్షిగా తీసుకువస్తారు. కాని వారు సత్యానికి బద్ధవిరోధులు. అలాంటివారికి అధికారం లభించగానే ప్రపంచంలో కల్లోలాల వ్యాప్తికి, పంటపొలాల విధ్వంసానికి, మానవ వినాశానికే వారు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారు." (ఖుర్‌ఆన్-204,205)

తన సృష్టికర్త, ప్రభువు, పోషకుడయిన దేవుడ్ని గుర్తించని మనిషి, ఆ దేవుడు మానవుల ఇహపరాల సాఫల్యం కోసం తన ప్రవక్తల ద్వారా పంపిన జీవనవిధానాన్ని కూడా త్రోసిపుచ్చుతాడు.

"మేము వారి వద్దకు వారి ప్రస్తావనే తీసుకొచ్చాం. కాని వారు తమ ప్రస్తావన పట్లే విముఖులైపోతున్నారు." (ఖుర్‌ఆన్-23:71)

ఇక్కడ వారి ప్రస్తావనంటే మానవుల జీవితవిధానానికి సంబంధించిన విషయాలని అర్థం. మానవులు ఈ ప్రపంచంలో ప్రశాంతజీవితం గడపా లంటే సమంజసమైన, సముచితమైన, న్యాయమైన, నిష్పాక్షికమైన, సమగ్రమైన ఒక సామాజిక వ్యవస్థ (Social Order) ఎంతో అవసరం. భాష, వర్ణం, వర్గం, మతం, జాతి, తెగ, కులం, ప్రాంతం, దేశం మొదలైన



ప్రాతిపదికలపై ఏర్పడే దురభిమానాలతో, ఇతర బలహీనలతో సతమత మయ్యే మానవులు తమంతటతాము ఇలాంటి "సువ్యవస్థ"ను నిర్మించు కోలేరు. మానవుల్లో ఎంత నీతిమంతులు, నిష్పక్షపాతకులై ఉన్నప్పటికీ వారు అందరికీ న్యాయం చేకూర్చగల ఇలాంటి సామాజిక వ్యవస్థను నిర్మించలేరు. దాన్ని మానవుల సృష్టికర్త, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, ప్రభువు, పోషకుడు అయిన దేవుడు మాత్రమే నిర్మించగలడు. ఆయన మాత్రమే ఇలాంటి వ్యవస్థ ద్వారా మానవుల్ని అదుపు చేస్తూ ప్రపంచంలో శాంతి సుస్థిరతలు, నీతి న్యాయాలను నెలకొల్పగలడు.

మన మెదడు కేంద్రనాడీమండల వ్యవస్థ ద్వారా మన శరీరాన్ని, అవయవాల్ని కంట్రోల్‌చేస్తూ మన ఆరోగ్యానికి, మన కార్యకలాపాల సక్రమ నిర్వహణకు ఎలా దోహదపడుతున్నదో, దేవుడు కూడా తాను నిర్ణయించిన "ఏకదైవారాధనా విధానం" (ఇస్లాం) ద్వారా మానవుల్ని కంట్రోల్ చేస్తూ వారి పరస్పర సంబంధాలకు, శాంతియుతమైన జీవితానికి దోహదపడతాడు. అదీగాక, ఈ విధానం ద్వారా మానవుడు పరలోకంలో దేవుని ప్రసన్నత, శాశ్వత స్వర్గసౌఖ్యాలకు కూడా అర్హుడవుతాడు. ఇలాంటి జీవనవిధానాన్ని, సామాజిక వ్యవస్థను, దైవధర్మాన్ని మానవుడు త్రోసి పుచ్చుతున్నాడంటే, అతను తనకు శ్రేయస్కరమైన సొంత జీవితవిధానానికే తూట్లు పొడిచి ఇహలోకంలో అశాంతిని, పరలోకంలో నరక యాతనలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నాడన్న మాట.

## 4. ఇస్లాంలోని ప్రయోజనాలు

ఈ విశ్వవ్యవస్థలోని సమస్త సృష్టితాలలో, వాటి అణువణువులో దేవుని ఏకత్వాన్ని, ఆయన శక్తిసామర్థ్యాలను చాటిచెప్పే సంకేతాలు ఉన్నాయని, చివరికి మానవుని అస్తిత్వంలో కూడా అలాంటి సంకేతాలున్నాయని మనం గత పేరాలలో తెలుసుకున్నాం. మానవుడు ఆ సంకేతాలను అర్థం చేసుకోవడానికి దేవుడు అతనికి బుద్ధిజ్ఞానాలు, విజ్ఞతావివేచనలు, మంచీ చెడుల విచక్షణా జ్ఞానం కూడా ప్రసాదించాడని మనం తెలుసుకున్నాం. వాటితో పాటు అతనికి దేవుడు తన ప్రవక్తల ద్వారా రుజుమార్గం చూపి,

దాన్ని ఇష్టమైతే అవలంబించే, లేదనుకుంటే నిరాకరించే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కూడా ప్రసాదించాడు. ఈ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల ద్వారా దేవుడు అతడ్ని రుజుమార్గాన నడుస్తాడా లేక అపమార్గం పట్టిపోతాడా అని పరీక్షిం చదలిచాడు. ఈ కారణంగానే ధర్మావలంబనలో ఎలాంటి బలాత్కారం లేదంటున్నది ఖుర్ఆన్.

"ధర్మస్వీకరణలో ఎలాంటి బలవంతం, బలాత్కారాలు లేవు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరుచేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కు చెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే." (ఖుర్ఆన్-2:256)

బలవంతం, బలత్కారాలుంటే పరీక్షకు అర్థమే ఉండదు. పరీక్ష హాల్లో అభ్యర్థికి ప్రశ్నపత్రంతో పాటు సమాధానాలు కూడా పంపి, నువ్వు 'ఈ' సమాధానాలు మాత్రమే రాయాలి అని వత్తిడి తెస్తే, అది పరీక్ష అన్పించు కోదు. అభ్యర్థిలోని శక్తిసామర్థ్యాలు బహిర్గతం కావు. ఎంపికస్వేచ్ఛ, నిర్ణయాధికారం ఉన్నప్పుడే పరీక్ష సార్థకమవుతుంది. అలాంటి పరీక్ష ఉన్నప్పుడే మానవుల్లో విశ్వాసులెవరో-అవిశ్వాసులెవరో, సత్యవాదులెవరో-అసత్యవాదులెవరో, సన్మార్గులెవరో-అపమార్గులెవరో తెలుస్తుంది. దాన్నిబట్టే వారికి పరలోకంలో ఫలితాలు లభిస్తాయి.

ఒక మనిషి ఎలాంటి బలవంతం, బాహ్యవత్తిళ్ళకు గురికాకుండా తన బుద్ధివివేచనలు, విచక్షణజ్ఞానాలను సద్వినియోగం చేయడం ద్వారా ఈ పరీక్షలో కృతార్థుడయ్యాడనుకుందాం. అంటే అతను తన నిజప్రభువును గుర్తించాడు. అవిధేయత, అపమార్గాలకు పాల్పడే స్వేచ్ఛ ఉన్నప్పటికీ అతను దేవునికి విధేయుడయి, అంటే ముస్లిం అయి ఆయన చూపిన రుజుమార్గం అవలంబించాడు. సత్యాన్ని గుర్తించి దాని ముందు మోకరిల్లాడు; సత్యానికి తలవంచి తాను సత్యవాదినని నిరూపించుకున్నాడు. ఇలాంటి మనిషే ఇహపర లోకాల్లో సఫలీకృతుడవుతాడు.

అతనిప్పుడు జీవితాంతం జ్ఞానాచరణలకు చెందిన ప్రతి రంగంలోనూ సరైన మార్గంలోనే నడుస్తాడు; సముచిత నిర్ణయాలే తీసుకుంటాడు; సదా



సత్కార్యాలే చేస్తుంటాడు. అతను తాత్విక చింతనతో విశ్వవ్యవస్థను గమనిస్తూ దాని వెనుక దాగిన అగోచర శక్తుల్ని అర్థం చేసుకోవడానికి కృషి చేస్తాడు. సైన్స్ పరిశోధనల ద్వారా ప్రకృతి శాసనాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. భూమ్యాకాశాల నిర్మాణం, నిర్వహణల తీరుతెన్నులను పరిశీలించి వాటి నిర్మాత, నిర్వాహకుడు ఎవరో తెలుసుకుంటాడు. తాను సాధించే సైన్స్ పరిశోధనా ఫలితాలను, సాంకేతిక ప్రగతి ఫలాలను మానవాళి శ్రేయస్సు కోసమే వినియోగిస్తాడు. మానవతావాదిగా అతను ఎల్లప్పుడూ సర్వమానవ సంక్షేమాన్ని కోరుకుంటాడు.

"భూమ్యాకాశాల నిర్మాణంలో, రాత్రింబవళ్ళ చక్రభ్రమణంలో యోచించే వారికి ఎన్నో నిదర్శనాలున్నాయి. ఆ యోచనాపరులు నిల్చొని, కూర్చొని, పడుకొని- ఏ స్థితిలో ఉన్నాసరే ఎల్లప్పుడూ దేవుడ్ని స్మరిస్తూఉంటారు. అదీగాక వారు భూమ్యాకాశాల నిర్మాణం గురించి పరిశీలిస్తూ ఇలా ప్రార్థిస్తారు: "ప్రభూ! నీవు ఈ విశ్వాన్ని నిష్ప్రయోజనంగా, లక్ష్యరహితంగా సృజించలేదు. నీవు పరమ పవిత్రుడవు. మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. నీవు నరకంలో పడవేసిన వాడ్ని ఘోరమైన అవమానానికి గురిచేసినట్లే. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయ పడలేరు." (ఖుర్ఆన్-3:190-192)

అలాగే అతను ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా సరైన విధానాలు అనుసరించి, సమంజసమైన నిర్ణయాలే తీసుకుంటాడు. చరిత్ర, శాసనం, విద్యాకళల్లోనూ ముస్లిం అవిశ్వాసికి ఏమాత్రం తీసిపోడు. అయితే వారిద్దరి దృక్పథాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముస్లిం ఏ విద్యనయినా సదాశయంతో సరైన దృక్కోణంతో అధ్యయనం చేసి సముచిత నిర్ణయం తీసుకుంటాడు. చరిత్రలో మానవుని గత అనుభవాల ద్వారా గుణపాఠం గ్రహిస్తాడు. జాతుల ఉత్థానపతనాలకు కారణాలేమిటో తెలుసుకుంటాడు. వారి సభ్యతాసంస్కృతులకు సంబంధించిన మంచి విషయాలేమిటో పరిశోధిస్తాడు. వారి పుణ్యపురుషుల జీవిత విశేషాల ద్వారా ప్రయోజనం పొందుతాడు. గతజాతులు ఏ విషయాల కారణంగా నాశనమయ్యాయో వాటన్నిటికీ దూరంగా మసలుకుంటాడు. సంపద ఆర్జన,

వినియోగాల విషయంలో ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే విధానాలను తెలుసుకొని తదనుగుణంగా నడచుకుంటాడు.

పోతే సర్వమానవ సమానత్వం, సర్వజన సంక్షేమాలే అతని రాజకీయ లక్ష్యాలయి ఉంటాయి. ఆ దృక్పథంతోనే అతను సంక్షేమరాజ్యం స్థాపించి బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, ప్రాంతీయ, జాతీయ దురభిమానాలను దరికి చేరనీయకుండా న్యాయవంతమైన పాలన చేస్తాడు. పాలనాధికారాన్ని దేవుడు ప్రసాదించిన అమానత్ (Trust)గా భావించి అవినీతి, అన్యాయం, అక్రమాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా దాన్ని వీలైనంత వరకు ప్రజాసంక్షేమం కోసమే సద్వినియోగం చేస్తాడు.

ముస్లిం స్వభావంలో దైవభీతి, ధర్మపరాయణత, సత్యసందర్శనం, రుజువర్తనాలే వేరుగొని ఉంటాయి. ప్రపంచంలోని సమస్త వస్తుసంపదకు, చివరికి తన శరీరానికి, శక్తిసామర్థ్యాలకు సైతం దేవుడే యజమాని అని, తాను ఆయన దాసుణ్ణి మాత్రమేనని, వాటన్నిటినీ ఆ దేవుని అభీష్టం ప్రకారం, ఆయన చూపిన విధానాల ప్రకారమే వినియోగించవలసి ఉంటుందని, తనకు ప్రసాదించబడిన ఒక్కొక్క వస్తువు, విషయం గురించి పరలోకంలో ఆ ప్రభువు ముందు లెక్క చెప్పుకోవలసి ఉంటుందని భావిస్తూ అతను ఇహలోకంలో సాత్వికజీవితం గడుపుతాడు.

ఈ భావనతో జీవితం గడిపే మనిషి గుణగణాలు ఎలా ఉంటాయో ఆలోచించండి. అతను తన మనస్సులోకి చెడు తలంపులను రానివ్వడు. తనకళ్ళను చెడుదృశ్యాల నుండి, చెవులను చెడుమాటల నుండి కాపాడుకుంటాడు; నోటి నుండి చెడు పలుకులు వెలువడకుండా జాగ్రత్త వహిస్తాడు. అతను అక్రమార్జనతో కడుపు నింపుకోవడానికి బదులు పస్తుండటానికే ఇష్టపడతాడు. తన చేతుల్ని దౌర్జన్యం కోసం ఎన్నటికీ వినియోగించడు. అలాగే అతను తన కాళ్ళను చెడు దారిన నడవడానికి ఎప్పుడూ ఉపయోగించడు. వ్యవహారం ప్రాణం మీదికి వచ్చినా సరే అన్యాయం, అసత్యం, అధర్మాల ముందు ఎన్నటికీ తలవంచడు. అతను ఒక్క క్షణం కూడా మనోవాంఛలకు బానిసయి అక్రమానికి పాల్పడలేడు.



ఈవిధంగా సకల సద్గుణాలతో మూర్తీభవించిన వ్యక్తిత్వం అతనిది; భయప్రలోభాలకు ఏమాత్రం లొంగని దృఢమనస్కుడు; ఆశయ సాధనలో అకుంఠిత దీక్షాపరుడు. ఇలాంటి మహోన్నత వ్యక్తిత్వమే ఏ రంగంలోనైనా విజయశిఖరాలు అధిరోహిస్తుందని ఆశించగలం. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తదనంతరం స్వర్ణయుగం సృష్టించిన శ్రేయస్కర ఖలీఫాల జీవిత చరిత్రలే దీనికి సజీవ తార్కాణాలు.

ఇలాంటి ఉదాత్త జీవనం గడిపిన మనిషి పరలోకంలో తన ప్రభువు ముందు ప్రవేశపెట్టబడినప్పుడు ఆ మహాప్రభువు అతనిపై వరాల వర్షం కురిపిస్తాడు; కారుణ్యానుగ్రహాలలో ముంచెత్తుతాడు. కారణం అతను తనకు ఇహలోకంలో అప్పగించబడిన బాధ్యతలను పూర్తి నిజాయితీగా, శక్తివంచన లేకుండా నిర్వహించాడు. దేవుడు పెట్టిన పరీక్షలో నూరు శాతం మార్కులతో కృతార్థుడయి పరమ మోక్షానికి అర్హుడవుతాడు.

ఇదీ మానవుడికి వెలుగుబాట చూపి ఇస్లాం పెట్టిన బిక్ష. పరమపద సోపానం ఎక్కించి పరమమోక్షానికి చేర్చిన వైనం. ప్రతి యుగంలో, ప్రతి జాతిలో గతించిన ఇలాంటి సచ్చరితుల ధర్మం ఇస్లామే. దాని పేరు ఆ కాలాల్లో వారి భాషల్లో ఏదైనప్పటికీ అది ముమ్మాటికీ ఇస్లాం ధర్మమే.

## 5. విశ్వాసం-విధేయత

ఇస్లాం అంటే విధేయత అని మనం గత పేజీలలో తెలుసుకున్నాం. ఇప్పుడు జ్ఞానం, విశ్వాసాలను గురించి తెలుసుకుందాం. కొన్ని విషయాలను గురించిన జ్ఞానం సంపాదించనంతవరకు విధేయత పాటించలేము. ఆ జ్ఞానం మనసులో విశ్వాసం చోటుచేసుకునేంత మేరకు ఉండాలి. మిడిమిడి జ్ఞానంవల్ల మనసులో దృఢవిశ్వాసం చోటుచేసుకోజాలదు.

అన్నిటికంటే ముందు మనిషికి దేవుని అస్తిత్వం పట్ల, ఆయన ఏకత్వం పట్ల నమ్మకం కుదరాలి. ఈ నమ్మకం లేకపోతే అతను దేవునికి విధేయుడు ఎలా అవుతాడు? ఆ తర్వాత మనిషికి దేవుని గుణగణాలకు, ఆయన శక్తి సామర్థ్యాలకు సంబంధించిన జ్ఞానం కూడా ఉండాలి. దేవుని దైవత్వంలో మరెవరూ భాగస్వాములు లేరనే విషయం తెలియకపోతే మనిషి

మిథ్యాదైవాలకు మొక్కకుండా, మొరపెట్టుకోకుండా ఎలా ఉండ గలుగుతాడు? దేవుడు సర్వజ్ఞాని, సర్వం చూస్తున్నాడు, సర్వం వింటున్నాడనే విషయాలు తెలియకపోతే అతను దేవుని పట్ల అవిధేయతకు పాల్పడకుండా ఎలా ఉండగలుగుతాడు?

కనుక మనిషికి ఈ విషయాలకు సంబంధించిన పూర్తిజ్ఞానం ఉండాలి. ఈ జ్ఞానం కేవలం 'ఇన్ఫర్మేషన్' కోసమే సంపాదించకూడదు; హృదయంలో విశ్వాసం స్థిరపడే అంతటి జ్ఞానం సంపాదించాలి. అప్పుడే మనిషి ఆ జ్ఞానానికి అనుగుణంగా నడచుకుంటూ, దానికి వ్యతిరేకమైన చర్యలకు దూరంగా ఉంటాడు.

ఆ తరువాత మనిషికి దైవాభీష్టం ప్రకారం జీవితం గడపడానికి సరైన విధానం ఏమిటి; దేవునిదృష్టిలో ఏది సత్యం, ఏది అసత్యం; ఏది ధర్మం, ఏది అధర్మం? అనే విషయాలు కూడా తెలిసిఉండాలి. దీని కోసం దైవ నియమావళికి సంబంధించిన పూర్తి జ్ఞానం సంపాదించాలి. అయితే పూర్తి జ్ఞానం ఉన్నప్పటికీ అందులోని విషయాల పట్ల దృఢవిశ్వాసం లేకపోతే, మనిషి దైవేతరుల సొంతజ్ఞానం కూడా సరైనది కావచ్చని భావించి దైవ జ్ఞానానికి వ్యతిరేకంగా నడచుకునే ప్రమాదం ఉంటుంది.

దైవాభీష్టం ప్రకారం నడచుకుంటే దైవప్రసన్నత పొందగలమన్న విషయాలతో పాటు, దేవునికి అవిధేయుడై ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా నడచుకుంటే దాని పర్యవసానం ఏమిటనే విషయాలను గురించి కూడా మనిషి తెలుసుకోవాలి. అంటే సకారాత్మక, నకారాత్మక విషయాలను గురించిన పూర్తిజ్ఞానం సంపాదించాలన్న మాట. దానికోసం మరణానంతర జీవితం గురించిన విశేషాలు కూడా తెలిసుండాలి. దైవన్యాయస్థానంలో కర్మవిచారణ జరుగుతుందని, సత్కర్మలకు బహుమానం రూపంలో దైవ దర్శనం-స్వర్గసౌఖ్యాలు లభిస్తాయని, దుష్కర్మలకు శిక్షగా నరకయాతనలు చవిచూడవలసి వస్తుందని క్షుణ్ణంగా తెలిసిఉండాలి.

పరలోక జీవితం గురించిన ఈ విషయాల పట్ల మనిషి అజాగ్రత్తగా ఉంటే లేదా ఏమరుపాటుకు లోనైవుంటే, అతను దైవవిధేయతకు



ఎందుకు కట్టుబడి ఉంటాడు? దైవవిధేయతలో ఎదురయ్యే కష్టాలను ఎందుకు సహిస్తాడు? ప్రపంచంలో నష్టం కలిగిస్తాయన్న భయంలేని పాపాల జోలికి పోకుండా ఉండగలడా? ఇలాంటి విశ్వాసం కలిగినవాడు దైవచట్టాలను ఎన్నటికీ గౌరవించలేడు. అలాగే పరలోక జీవితం ఒకటుందని, అక్కడ దైవన్యాయస్థానంలో తన కర్మలకు లెక్క చెప్పవలసి ఉందని తెలుసుకున్నప్పటికీ ఆ విషయాల పట్ల గట్టి నమ్మకం లేనివాడు కూడా దైవచట్టాలను గౌరవించలేడు. అతను ఎల్లప్పుడూ సందేహం, సందిగ్ధాలలోనే పడివుంటాడు. ఒక పని చేయడం వల్ల పరలోకంలో లాభం ఉందని, చేయకపోవడం వల్ల నష్టముందని గట్టిగా నమ్మేవాడు మాత్రమే ఆ పని చేసితీరుతాడు.

## 6. విశ్వాసం అంటే ఏమిటి?

ఇస్లాంలో జ్ఞానం, నమ్మకాలు కలసిన విషయాన్నే 'విశ్వాసం' అంటారు. 'విశ్వాసం' అంటే తెలుసుకోవడం, అంగీకరించడం అని అర్థాలున్నాయి. మరోమాటలో చెప్పాలంటే విషయం తెలుసుకొని దాన్ని అంగీకరించడం అన్న మాట. దేవుని ఏకత్వాన్ని, ఆయన గుణగణాలను, ఆయన శాసనావళిని, ఆయన నిర్దేశించే శిక్ష, ప్రతిఫలాలను తెలుసుకొని వాటిని హృదయపూర్వకంగా నమ్మే మనిషిని 'విశ్వాసి' అంటారు. ఆ విశ్వాసానికి అనుగుణంగా నడచుకునేవాడ్నే 'ముస్లిం' అంటారు. అంటే దైవవిధేయుడు.

విశ్వాసం గురించిన పైవివరణ తెలుసుకున్న తరువాత మనం విశ్వాసరాహిత్యంతో ఏ మనిషీ (నిజమైన) ముస్లిం కాలేడని గ్రహించగలం. విశ్వాసం-ఇస్లాంల సంబంధం విత్తనానికి, చెట్టుకున్న సంబంధంలాంటిదే. విత్తనం లేకుండా చెట్టు మొలవదు. ఒకవేళ నేలలో విత్తనం వేసినప్పటికీ నేల సారవంతంగా లేకపోతే లేదా గాలి, నీరు సరిగా అందకపోతే నాసిరకం చెట్టు మాత్రమే మొలకెత్తుతుంది. అదేవిధంగా ఒక వ్యక్తి హృదయంలో విశ్వాసం ఉన్నప్పటికీ సంకల్పబలం లేకపోవడం వల్ల లేదా సరైన విద్యాశిక్షణలు లభించకపోవడం వల్ల లేదా సహవాసదోషం వల్ల లేదా పరిసరాల దుష్ప్రభావం వల్ల పరిపూర్ణ ముస్లిం కాలేకపోతాడు.

విశ్వాసం, ఇస్లాంల దృష్ట్యా యావత్తు మానవుల్ని ఈవిధంగా నాలుగు వర్గాలుగా విభజించవచ్చు:-

1- కొందరు దేవుని ఏకత్వాన్ని, ఆయన గుణగణాలను దృఢంగా విశ్వసించి ఆయన ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటిస్తారు. నిప్పును తాకడానికే భయపడేవారిలో వీరు దేవుడు నిషేధించిన విషయాల జోలికి పోవడానికి భయపడతారు. వారు దైవనిషేధిత విషయాలకు ఎల్లప్పుడూ దూరంగా మసలుకుంటారు. దేవునికి ఇష్టమైన కర్మలు ఆచరించడానికైతే పరుగుపరుగున ముందుకువస్తారు. వీరు నిజమైన ముస్లింలు.

2- మరికొందరు దేవుని పట్ల విశ్వాసం కలిగి ఉన్నప్పటికీ ఆ విశ్వాసం దేవునికి పూర్తిగా విధేయుడ్ని చేసేటంత దృఢమైనది కాదు. వీరి విశ్వాసం బలహీనమైనదే అయినా మొత్తంమీద వీరు దేవుని దృష్టిలో ముస్లింలు గానే పరిగణించబడతారు. కాకపోతే వీరు దేవుని పట్ల అవిధేయతకు పాల్పడి చేసిన పాపాలకు పరలోకంలో తాత్కాలిక శిక్ష అనుభవిస్తారు.

3- కొందరు దేవుని ఏకత్వాన్ని, ఆయన గుణగణాలను విశ్వసించరు కాని, వారికర్మలు మాత్రం దైవనియమావళి ప్రకారం ఉన్నట్లు కన్పిస్తాయి. వీరసలు దైవద్రోహులు. రాజును రాజుగా, రాజశాసనాన్ని రాజశాసనంగా అంగీకరించని వ్యక్తి రాజశాసనాన్ని అతిక్రమించకుండా ఎన్ని పనులు చేసినా ప్రయోజనం లేనట్లే వీరి సత్కర్మలు కూడా పరలోక న్యాయ స్థానంలో చెల్లని నాణేలుగా ఉండిపోతాయి.

4- మరికొందరు దేవుని ఏకత్వాన్ని, గుణగణాలను నమ్మకపోవడమే గాక వారి కర్మలు కూడా ఘోరంగా ఉంటాయి. వారు దుష్కర్ములు, దుర్మార్గులు, విద్రోహులు; అందరికంటే అధమస్థాయికి చెందినవారు.

మానవుల ఈ వర్గవిభజనను బట్టి మానవుడి సాఫల్యం, మోక్షాలు అతని విశ్వాసం మీదనే ఆధారపడి ఉంటాయని తెలుస్తోంది. ఇస్లాం స్వీక రించే మనిషి ఆచరణ ఏస్థాయిలో ఉన్నాసరే, అది విశ్వాసం అనే విత్తనం నుండే పుట్టుకొస్తుందనేది నిర్వివాదాంశం. విశ్వాసం లేనిచోట అవిశ్వాసం, అవిధేయతలే ఉంటాయి. అంటే సత్యతిరస్కారం, స్వామిద్రోహాలు.



# 7. జ్ఞానార్జనా మార్గం

విధేయత కోసం విశ్వాసం చాలా అవసరమని పైవివరణ ద్వారా మనం తెలుసుకున్నాం. అయితే దేవుని ఏకత్వం, ఆయన గుణగణాలు, శక్తిసామర్థ్యాలు, ఆయనకు ఇష్టమైన శాసనావళి, పరలోక జీవితం వగైరా విషయాలను గురించి సరైన, విశ్వసనీయమైన జ్ఞానం మనకు ఎలా ఎక్కడ్నుంచి లభిస్తుంది అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

బుద్ధి-వివేచనలతో పరిశీలించే వారి కోసం ఈ సువిశాల విశ్వంలో దేవుని ఏకత్వాన్ని, ఆయన శక్తిసామర్థ్యాలకు మూగ సాక్షులుగా నిలిచిన అనేక సూచనలు, నిదర్శనాలు ఉన్నాయి. అయితే అనేకమంది ఆలోచనా ధోరణి ఏమరుపాటు వల్లనో, ప్రాపంచిక వ్యామోహం వల్లనో వక్రీకరణకు గురయిపోయింది. తత్ఫలితంగా కొందరు దేవుళ్ళు ఇద్దరని, మరికొందరు ముగ్గురని భావిస్తున్నారు. ఇంకొందరు ఏకేశ్వరుని దైవత్వాన్ని ముక్కలు ముక్కలుగా చేసి వరుణదేవుడు, వాయుదేవుడు, అగ్నిదేవుడు, సూర్య భగవానుడు, భూదేవి, కులదేవత, శనిదేవత మొదలైన పేర్లతో మిథ్యా దైవాలను కొలుస్తున్నారు. ఇలా అత్యధికమంది దేవుని ఏకత్వాన్ని, ఆయన గుణగణాలను అర్థం చేసుకోవడంలో మోసపోయారు.

పరలోకజీవితం విషయంలో కూడా చాలామంది తప్పుడు నమ్మకాలు ఏర్పరచుకున్నారు. వారిలో కొందరు మనిషి చనిపోయాక మట్టిలో కలసి పోతాడని, ఆ తరువాత మరెలాంటి జీవితం లేదని భావిస్తున్నారు. మరి కొందరు మనిషి మాటిమాటికి జన్మ ఎత్తుతాడని, గత జన్మలో చేసిన పాపపుణ్యాలకు ఫలితం వర్తమానజన్మలో అనుభవిస్తాడని నమ్ముతారు.

దైవాభీష్టం ప్రకారం మనుగడ సాగించడానికి ఎలాంటి నియమావళి పాటించాలో దాన్ని మనిషి తన బుద్ధి-వివేచనాలతో ఎన్నటికీ నిర్మించ లేడు. అసాధారణ మేధాసంపన్నుడు అనేక సంవత్సరాల అనుభవం, చింతన, శోధనల తర్వాత కొంతమేరకు మాత్రమే పరలోక విషయాలకు సంబంధించి ఒక అభిప్రాయానికి రాగలడు కాని, తనకు సత్యం పూర్తిగా తెలిసిందని మాత్రం నమ్మలేడు.

అందువల్ల సృష్టికర్త మానవులకు ఇలాంటి సత్యాన్వేషణా పరీక్షకు గురి చేయకుండా వారిలోనే కొందరు పుణ్యపురుషులకు తన గుణగణాలు, శక్తి సామర్థ్యాలకు సంబంధించిన జ్ఞానంతోపాటు తన అభీష్టానికి అనుగుణ మైన జీవనవ్యవస్థ కూడా అందజేశాడు. అదీగాక పరలోక జీవితానికి సంబంధించిన వివరాలు కూడా వారికి తెలియజేశాడు. ఈ విషయాలన్నీ తెలియజేసి వీటిని తోటిమానవులకు అందజేయాలని కూడా వారిని ఆదే శించాడు. ఈ పుణ్యపురుషుల్నే దైవప్రవక్తలు అంటారు. దేవుడు తన ప్రవక్త లకు ఈ జ్ఞానాన్ని దివ్యావిష్కృతి (Revelation) ద్వారా అందజేశాడు.

కాబట్టి ప్రజలు స్వార్థం, సంకుచిత భావాలు, దురభిమానాలకు తావీయకుండా దైవప్రవక్త పవిత్ర జీవనసరళిని పరిశీలించి, ఆయన అందజేసే సందేశం స్వీకరించవలసి ఉంటుంది. అప్పుడే వారు పరలోక మోక్షానికి అర్హులవుతారు.

## 8. అతీంద్రియాలపై విశ్వాసం

మనం ఏదైనా విషయం గురించి తెలియకపోతే ఆ విషయం బాగా తెలిసిన వ్యక్తిని అన్వేషించి, అతను చెప్పినట్లు నడచుకుంటాం. ఎప్పుడైనా మనం జబ్బు పడితే మనకు మనం చికిత్స చేసుకోకుండా డాక్టర్ దగ్గరకు వెళ్తాం. అతను పట్టా పుచ్చుకున్న డాక్టర్, రోగుల్ని ఆప్యాయంగా పలక రించి వారికి ధైర్యంచెప్పే డాక్టర్, వేలాదిమంది వ్యాధిగ్రస్తుల్ని విజయ వంతంగా చికిత్స చేసి బాగా అనుభవం గడించిన డాక్టరయితే, ప్రజలు అలాంటి డాక్టర్ మీదే విశ్వాసముంచి సంతోషంగా అతని దగ్గరకు వెళ్తారు. ఆ విశ్వసంతోనే వారు అతనిచ్చే మందుల్ని అతను చెప్పినట్లు వాడుతారు. అతను ఏఏ పదార్థాలు తినవద్దని, ఏఏ పనులు చేయవద్దని చెబుతాడో ఆయా పదార్థాలు తినడం, ఆయా పనులు చేయడం మానుకుంటారు.

అలాగే మనం చట్టంవిషయంలో న్యాయవాదిని విశ్వసిస్తాం; విద్యార్జన విషయంలో ఉపాధ్యాయుడ్ని విశ్వసించి అతను చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటాం; మనం చేరుకోవలసిన చోటుకు పోయేదారి తెలియకపోతే తెలిసిన వ్యక్తిని అడిగి తెలుసుకొని ఆ దారినే నడుస్తాం. ఇలా ప్రతి వ్యవ



హారంలోనూ దానికి సంబంధించిన జ్ఞానం సంపాదించడానికి అది తెలిసిన వ్యక్తిని విశ్వసించవలసి ఉంటుంది; ఆ వ్యవహారంలో మనం అతనికి తప్పనిసరిగా విధేయులై నడుచుకోవలసి ఉంటుంది.

అతీంద్రియాలు లేక అగోచరాలపై విశ్వాసం అంటే మనకు తెలియని విషయాలను తెలిసిన వ్యక్తి ద్వారా తెలుసుకోవడం, అతడ్ని విశ్వసించడం అని అర్థం. దేవుని గుణగణాలు, శక్తిసామర్థ్యాలు, దైవదూతల విధులు, పరలోక జీవితం, దైవాభీష్టం ప్రకారం మానవుడు అనుసరించవలసిన జీవన విధానం మొదలైన విషయాలు ప్రజలందరిలో సత్యవాది, నీతి మంతుడు, నిజాయితీపరుడు, ధర్మపరాయణుడు సదాచారసంపన్నుడైన పుణ్యపురుషుడి ద్వారా మాత్రమే మనకు లభిస్తాయి. ఆ మహనీయుని నోట వెలువడే మహితోక్తులు వింటే అతను చెప్పే మాటలన్నీ నిజమేనని, నమ్మదగినవేనని మన అంతరాత్మ అంగీకరిస్తుంది. కారణం అతను దైవ ప్రవక్త అయివుండటమే. ఇలా మనిషి తన అంతరాత్మ ఘోషను ఆలకించి దైవప్రవక్తను, అతని హితోక్తుల్ని నమ్మడాన్నే 'అగోచరాలపై విశ్వాసం' (ఈమాన్ బిల్‌గైబ్) అంటారు.

## 9. దైవదౌత్యం (Prophethood)

ప్రపంచంలో మానవుల మనుగడ కోసం సృష్టికర్త వారికి అవసరమైన శారీరక శక్తులతో పాటు మానసిక శక్తిసామర్థ్యాలు కూడా ప్రసాదించాడు. సాధారణ శక్తిసామర్థ్యాలు దాదాపు మానవులందరికీ ప్రసాదించబడ్డాయి. అసాధారణ శక్తిసామర్థ్యాలు కొందరికి మాత్రమే ప్రసాదించడం జరిగింది. అయితే ఈ శక్తిసామర్థ్యాలు కూడా అన్ని రంగాల్లో అందరికీ సమానంగా ప్రసాదించబడలేదు. కొందరికి ఒకటి రెండు రంగాల్లో అసాధారణ సామర్థ్యం లభిస్తే, మరికొందరికి ఇతర రంగాల్లో అసాధారణ సామర్థ్యం లభిస్తుంది. జనసామాన్యం అలాంటి మేధాసంపన్నులపై విశ్వాసం ఉంచి, వారి సేవలు పొందుతారు.

అయితే ఈ మేధావులు, ప్రవీణులు కనుగొనే విషయాలు, చేసే పనులు, చెప్పే మాటలు వారి సొంత మేధాజనితాలు మాత్రమే. మానవ

మేధకు, పరిశోధనకు అందని మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. ఆ విషయాలకు సంబంధించిన వాస్తవజ్ఞానం మానవులు తెలుసుకోకపోతే లేక తెలిసినా వాటిని నమ్మకుండా వదిలేస్తే మరణానంతరం వారు తీవ్ర పరిణామాలకు గురికావలసి వస్తుంది. కారణం సృష్టికర్త ఇహలోకాన్ని మానవుల కోసం పరీక్షా సదనంగా చేశాడు. తనకు, తన దాసులయిన మానవులకు ఉన్న వాస్తవ సంబంధం తెలుసుకొని, తాను పంపే ఆజ్ఞల్ని వారు శిరసావహిస్తారా లేదా అన్నదే ఆ పరీక్ష. ఈ పరీక్షలో నెగ్గడానికి కావలసిన సమాధానాలు కూడా ఆయన తనప్రవక్తల ద్వారా మానవులకు అందజేశాడు. ఇక మానవులు దైవప్రవక్తలను గుర్తించి, వారిని విశ్వసించి, వారి అడుగుజాడల్లో నడవవలసి ఉంటుంది. స్వార్థం, సంకుచితత్వం, ఐహికవ్యామోహం, వివిధ దురభిమానాలను దరికి చేరనివ్వని సాత్విక మనస్కులు దైవప్రవక్తలను సులభంగా గుర్తిస్తారు.

దివ్యావిష్కృతి ద్వారా దివ్యజ్ఞానం పొందిన దైవప్రవక్తలు మాత్రమే మానవులకు రుజుమార్గం చూపగలుగుతారు. ఆ రుజుమార్గమే 'ఇస్లాం.' అంటే దైవవిధేయతా మార్గం. ప్రతి దైవప్రవక్తా ప్రజలకు ఇస్లాం గురించే బోధించాడు. ఇస్లాం మాత్రమే ఏకైక రుజుమార్గం, ముక్తిమార్గం. రెండు బిందువుల్ని కలిపే సరళరేఖ ఒక్కటి మాత్రమే అవుతుంది. మిగిలినవన్నీ వక్రరేఖలు అవుతాయి. అదేవిధంగా దేవుడ్ని, దాసుడ్ని కలిపే రుజుమార్గం ఇస్లాం మాత్రమే. ఆ మార్గాన్ని తెలియజేసేవారు దైవప్రవక్తలు మాత్రమే. కనుక మానవులకు తమ ఇహపర సాఫల్యాల కోసం దైవప్రవక్తలను విశ్వ సించి వారిని అనుసరించడం తప్ప మార్గాంతరం లేదు.

ఇంతకూ దైవప్రవక్తలు ప్రపంచంలో ఎక్కడ ఎప్పుడు ప్రభవించారు, వారి జీవిత విశేషాలు ఎలా ఉండేవి, వారి మౌలిక బోధనలు ఏమిటీ మొదలైన ప్రశ్నలు మన ముందు తలెత్తుతాయి. కనుక వాటిని గురించి కూడా మనం సంక్షిప్తంగానైనా తెలుసుకోవాలి.

మానవసృష్టి ప్రారంభంలో దేవుడు ఒక మానవుడ్ని సృష్టించి, అతని ద్వారా అతని జతను సృష్టించాడు. ఆ జంట ద్వారానే కోట్లాది మానవులు



పుట్టి పుడమిపై విస్తరించారు. ఇప్పటికీ పుడుతూ విస్తరిస్తున్నారు. ఇలా ప్రళయం దాకా జరుగుతుంది. ఇలా మానవసృష్టి ఒకే ఒక మానవుడితో ప్రారంభమయింది. మానవులంతా ఆ తొలి మానవుడి సంతతే. ఇది ఈనాడు శాస్త్రవేత్తలు కూడా అంగీకరిస్తున్న యదార్థం.

ఈ ఆదిమానవుడ్నే ఇస్లాం 'ఆదం' (అలైహి) అంటోంది. దేవుడు ఆది మానవుడ్నే మొట్టమొదటి దైవప్రవక్తగా చేసి, తన సంతానానికి ఇస్లాం గురించి అంటే దైవవిధేయతా మార్గం గురించి బోధించాలని ఆయన్ని ఆదేశించాడు. ఈ ఆదేశం ప్రకారం ఆదం (అలై) తన సంతతి ప్రజలకు హితోపదేశం చేస్తూ "యావత్తు ప్రపంచంలో దేవుడు ఒక్కడే. ఆయన్ని మాత్రమే ఆరాధించండి. ఆయన సన్నిధిలోనే తల వంచండి. ఆయన్నే వేడుకోండి. ఆయన అభీష్టం ప్రకారమే నీతిమంతమైన, పవిత్ర జీవితం గడపండి. మీరిలా నడుచుకుంటే పరలోకంలో గొప్ప బహుమానం లభిస్తుంది. ఒకవేళ మీరు నన్ను తిరస్కరించి దైవవిధేయతకు విముఖులై పోతే ఘోరమైన శిక్షకు గురవుతారు" అని బోధించారు.

హజ్రత్ ఆదం (అలైహి) సంతానంలో మంచివాళ్ళు తమ తండ్రి చూపిన మార్గంలో నడవసాగారు; చెడ్డవాళ్ళు ఆ మార్గాన్ని వదిలేశారు. ఆ తరువాత క్రమక్రమంగా అనేక చెడులు పుట్టుకొచ్చాయి. కొందరు సూర్య చంద్రుల్ని, మరికొందరు రాళ్ళను-చెట్లను, ఇంకొందరు పశువుల్ని-పక్షుల్ని పూజించడం ప్రారంభించారు. కొందరు అగ్ని, వర్షం, వ్యాధి, ఆరోగ్యం, ఇతర శక్తులకు సంబంధించి వేర్వేరు దేవుళ్ళున్నారని, వారి అనుగ్రహం సంపాదించడానికి మనం అందర్నీ పూజించాలని భావించారు. ఈవిధంగా అజ్ఞానం మూఢత్వాల కారణంగా వివిధ రకాల బహుదైవారాధన, విగ్రహ పూజలు ఉనికిలోకి వచ్చాయి.

అది హజ్రత్ ఆదం (అలైహి) సంతతి ప్రపంచంలోని వివిధ భూభాగా లలో విస్తరించి విభిన్న జాతులుగా మారిన కాలం. ప్రతి జాతీ ఓ కొత్త మతాన్ని, కొత్త ఆచారాలను కనిపెట్టింది. ఈవిధంగా ఆనాడు మానవులు నిజదేవుడ్ని, తమతండ్రి చూపిన సన్మార్గాన్ని మరచిపోయి మనోవాంఛలకు

బానిసలైపోయారు. వారిలో అనేక రకాల మూఢనమ్మకాలు, దురాచారాలు పుట్టుకొచ్చాయి. మంచీ-చెడుల విచక్షణాజ్ఞానం కోల్పోయి అనేక చెడులలో కూరుకుపోయారు. అప్పుడు కరుణామయుడయిన దేవుడు ప్రతి జాతిలో దైవప్రవక్తలను పంపడం ప్రారంభించాడు. ఆ ప్రవక్తలు తమతమ జాతి ప్రజలకు వారు మరచిపోయిన ఇస్లాంధర్మ పాఠాలను గుర్తుచేసి వారిని రుజుమార్గంలోకి తీసుకురావడానికి ప్రయత్నించేవారు.

ఈవిధంగా ప్రపంచంలోని ప్రతిదేశంలో, ప్రతిజాతిలో దైవప్రవక్తలు ప్రభవించారు. వారంతా ప్రజలకు ఇస్లాం గురించే బోధించారు. వారందరి హితోపదేశాల్లో ఏకేశ్వరోపాసన, నీతినిజాయితీలు, దయాసానుభూతులు, సహాయసహకారాలు, పరలోకభావన, కర్మవిచారణ, స్వర్గనరకాలు వగైరా మౌలిక బోధనలు, విశ్వాసాలు ఒకేవిధంగా ఉండేవి. కాకపోతే బోధనా విధానాలు, జీవిత శాసనాల్లో కొంచెం తేడా ఉండేది. ఏజాతి ప్రజలు ఏ చెడులో ఎక్కువగా కూరుకుపోయివుంటారో ఆ చెడును నిర్మూలించ డానికే వారి ప్రవక్త ఎక్కువ కృషి చేసేవాడు. అంటే సమాజసంస్కరణకు సంబంధించిన శాసనాల్లో కాస్తంత వ్యత్యాసం ఉంటుందన్న మాట. ఇలా వివిధజాతుల్లో, వివిధకాలాల్లో మానవుల సంస్కరణ కోసం వేలాదిమంది దైవప్రవక్తలు ప్రభవించారు. వారందరి ధర్మం ఇస్లామే.

ఇక దైవప్రవక్తల పట్ల ప్రజలు ఎలా ప్రవర్తించారో చూడండి. దైవప్రవక్త లను కొందరు మాత్రమే విశ్వసించి సన్మార్గం అవలంబిస్తే, అనేక మంది వారిని తిరస్కరించేవారు. తిరస్కంచడమే కాదు, వారిని అనేక విధాల వేధించడాని క్కూడా పాల్పడేవారు. కొందరు ప్రవక్తలను దేశబహిష్కరణ చేశారు. మరికొందరిని హతమార్చివేశారు. కొందరు ప్రవక్తలు జీవితాంతం హితోపదేశం చేసినా అయిదారుగురి కంటే ఎక్కువ మంది అనుచరులు లభించలేదు. మరికొందరు ప్రవక్తలకు వందల సంఖ్యలో అనుచరులు లభించారు. ఏమైనప్పటికీ దైవప్రవక్తలు తమ కర్తవ్యాన్ని నిరాఘాటంగా నిర్వహిస్తూపోయారు. చివరికి వారి కృషి ఫలితంగా పెద్ద జాతులు కూడా ఇస్లాం వడిలోకి వచ్చాయి.



అయితే ప్రవక్తల మరణానంతరం వారి అనుచరులు క్రమేణా మళ్ళీ అజ్ఞానాంధకారంలో పడిపోయారు. వారిలో కొందరు తమ ప్రవక్తల బోధన లను తారుమారు చేశారు. మరికొందరు దైవగ్రంథాలలో తమ తరపున కొత్తకొత్త విషయాలు చేర్చారు. ఆరాధనా విధానాల్లో కొత్త పోకడలు సృష్టిం చారు. మరికొందరైతే తమకు రుజుమార్గం చూపిపోయిన ప్రవక్తలనే దేవుళ్ళుగా చేసుకొని వారి విగ్రహాలను పూజించడం ప్రారంభించారు. కొందరు తమ ప్రవక్తను దేవుని అవతారంగా భావిస్తే, మరికొందరు తమ ప్రవక్తను దేవుని కుమారునిగా చేశారు. ఈవిధంగా మూఢనమ్మకాలు, దురాచారాలు మళ్ళీ ఊపందుకున్నాయి. దైవప్రవక్తలు తెచ్చిన దివ్య గ్రంథాలు దైవప్రోక్త విషయాలేమిటో, మానవ మేధాజనితాలేమిటో తెలియనంతగా మార్పులకు, చేర్పులకు గురయిపోయాయి.

మనం ఇంతకుముందు చెప్పుకున్నట్లు ప్రతిజాతిలో వేర్వేరు ప్రవక్తలు ప్రభవించేవారు. వారి బోధనలు ఆయా జాతులకు పరిమితమై ఉండేవి. దానిక్కారణం సైన్సు, నాగరికత అంతగా అభివృద్ధి చెందని ఆ కాలంలో వివిధ భూభాగాలలో విస్తరించివున్న జాతుల మధ్య రాకపోకలు, ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండేవి కావు. వాతావరణం, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఆనాటి జాతుల సంస్కృతులు, జీవన స్థితిగతులు కూడా పూర్తి భిన్నంగా ఉండేవి. అంచేత దైవధర్మానికి సంబంధించి ఆయా జాతులకు ప్రవక్తలు అందజేసిన మౌలిక బోధనలు ఒకటే అయినప్పటికీ, కొద్దికొద్ది తేడాలతో వేర్వేరు ధర్మశాస్త్రాలు అందజేసేవారు.

ఆ తరువాత క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మానవుల మనో వికాసం, సామాజిక స్పృహ పెరిగాయి. మానవాళి ఆలోచనాసరళి బాల్య దశ నుండి యౌవన దశకు చేరుకుంది. విజ్ఞానశాస్త్రం, విద్యాకళలు, సభ్యత-నాగరికతలు అభివృద్ధిచెందాయి. గొప్పగొప్ప విజేతలు ఉద్భవించి అనేక జాతులను ఒకే రాజకీయ వ్యవస్థలోకి తెచ్చారు. జాతుల మధ్య చాలావరకు దూరాలు తగ్గిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచ మానవులందరికీ ఒకేప్రవక్త ద్వారా ఒక ఉమ్మడి ధర్మశాస్త్రం అందజేయ

వలసిన అవసరం వచ్చింది. గత ప్రవక్తల ధర్మశాస్త్రాలన్నీ రద్దుచేసి ఒకే ధర్మశాస్త్రాన్ని పంపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దానికోసం సృష్టికర్త ప్రవక్తల పరంపరను అంతమొందించి భౌగోళికంగా ప్రపంచ కేంద్ర స్థానమయిన మక్కా నగరంలో మహనీయ ముహమ్మద్ (స)ను అంతిమ దైవప్రవక్తగా ప్రభవింపజేశాడు. ఇప్పుడు యావత్తు మానవాళికి ప్రళయం దాకా ఆ మహనీయుడు తెచ్చిన ఖుర్ఆన్, ఆయన సంప్రదాయాలతో కూడిన ఇస్లామీయ జీవనవిధానమే ముక్తిమార్గం.

"దేవుని దగ్గర (ఆమోదిత)ధర్మం ఇస్లాం మాత్రమే." (ఖుర్ఆన్-3:19)

## 10. కారుచీకటిలో కాంతిరేఖ

ఓసారి 1400 సంవత్సరాలు వెనక్కిపోయి ప్రపంచ పరిస్థితి చూడండి. చీకటి పడితే చాలు, యావత్ప్రపంచం అంధకారమే. విద్యుచ్ఛక్తి లేదు. రేడియోలు లేవు. టెలివిజన్లు లేవు. కంప్యూటర్లు లేవు. ముద్రణాలయాలు లేవు. ఫ్యాక్టరీలు లేవు. రైళ్ళు-బస్సులు లేవు. విమానాలు-హెలికాప్టర్లు లేవు. పశువులే ఆనాటి ప్రజల వాహనాలు, రవాణాసాధనాలు. ఒక దేశం నుండి మరొక దేశానికి పోవాలంటే నెలల తరబడి ప్రయాణం చేయవలసి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో అరేబియా ఇతర దేశాల నుండి దాదాపు విడిపోయిఉండేది. దాని ఇరుగుపొరుగున విద్యాకళల్లో కాస్తంత అభివృద్ధి చెందిన ఈరాన్, రోమ్, ఈజిప్టు దేశాలు ఉండేవి. అయినప్పటికీ పెను పర్వతాల్లాంటి పెద్దపెద్ద ఇసుకతిన్నెలు, వందల మైళ్ళు నడచినా ఓ పచ్చటి రెమ్మయినా కానరాని ఇసుక సముద్రాలు అరబ్బుల్ని వాటన్నిటి నుంచి వేరుచేశాయి. వ్యాపారం కోసం మాత్రం వారా దేశాలకు తరచుగా వెళ్తుండేవారు. అంతకుమించి వారా దేశాలతో మరెలాంటి సంబంధం పెట్టుకునేవారు కాదు. అందువల్ల వారిలో నాగరికత అంతగా అభివృద్ధి చెందలేదు. అరేబియాలో పాఠశాలలుగాని, గ్రంథాలయాలుగాని అసలే లేవు. కొందరికి మాత్రమే కాస్తంత చదవడం, రాయడం వచ్చు.

ఆనాడు అరేబియాలో ఎలాంటి ప్రభుత్వం లేదు. చట్టాలు అంతకన్నా లేవు. ప్రతితెగ స్వయంప్రతిపత్తి కలిగివుండేది. అరబ్బులు స్వేచ్ఛాజీవులు.



ఎవరికీ బానిసలుగా ఉండేందుకు ఏమాత్రం సహించేవారు కాదు; ఎంతో ఆత్మాభిమానం కలవారు. మాటకు కట్టుబడి ఉండేవారు. తాము నమ్మిన విషయాల కోసం ప్రాణాలైనా త్యజించడానికి సిద్ధపడేవారు.

అయితే మరోవైపు వారిలో అనేక చెడులు కూడా ఉండేవి. ప్రతి చిన్న విషయానికీ కత్తులు దూసేవారు. తెగల మధ్య నిరంతరం రక్తపాతం జరుగుతుండేది. ఏదైనా విషయంలో వివాదం చెలరేగితే ఆ తెగల మధ్య ఏండ్ల తరబడి యుద్ధాలు జరుగుతుండేవి. లూటీలు, దోపిడీలు కూడా జరుగుతుండేవి. మనిషి ధన మాన ప్రాణాలకు ఎలాంటి విలువ ఉండేది కాదు. జూదం, మద్యసేవనం, వ్యభిచారం యధేచ్ఛంగా సాగుతుండేవి. ఒకరి ముందు ఒకరు నిస్సంకోచంగా దిగంబరులయ్యేవారు. చివరికి స్త్రీలు కూడా దిగంబరులై కాబాప్రదక్షిణ చేసేవారు. ఎల్లప్పుడూ విగ్రహారాధనలో తలమునకలై ఉండేవారు. దారిలో ఏదైనా మంచి రాయి కన్పిస్తే చాలు దాన్ని తీసికెళ్ళి పూజించడం ప్రారంభించేవారు.

అలాంటి జాతిలో, ఆ పరిస్థితుల్లో కారుచీకటిలో కాంతిరేఖలా ఓ మహోన్నత వ్యక్తిత్వం ఆవిర్భవిస్తుంది. అతను పసితనంలోనే తాత, తల్లి దండ్రుల నీడ కోల్పోయాడు. కౌమారదశలో తోటిపిల్లలతో కలసి మేకలు కాయడం మొదలెట్టాడు. యౌవనదశలో వ్యాపారంలోకి దిగాడు. విద్యా గంధం లభించక నిరక్షరాస్యుడిగానే ఉండిపోయాడు. అయితే కొద్ది కాలం లోనే అతను సత్యమంతుడు (సాదిఖ్)గా, నిజాయితీపరుడు (అమీన్)గా ప్రసిద్ధిచెంది ప్రజల దృష్టి ఆకట్టుకున్నాడు. అశ్లీలం, దుర్భాషలకు ఆమడ దూరంలో ఉండేవాడు.

అతను పేదలకు, బాధితులకు సహాయం చేయడానికి అందరికంటే ముందుండేవాడు. అనాథలకు, వితంతువులకు సహాయసహకారాలు అంద జేస్తుండేవాడు. జాతి అంతా మద్యం మత్తులో జోగుతున్నా అతను దాని వాసనను సైతం సహించేవాడుకాదు. అలాగే మొత్తంజాతి విగ్రహారాధనలో తలమునకలై ఉన్నా అతను దాని దరిదాపులకే పోయేవాడు కాదు. అతని వ్యక్తిత్వంలో క్రమశిక్షణ గోచరిస్తుండేది. అతని మాటల్లో మాధుర్యం ఉట్టి

పడుతుండేది. భావాల్లో భక్తిరసం జాలువారుతుండేది. ప్రవర్తనలో ప్రజా హితం తొణికిసలాడుతుండేది. అందుకే అతను అజ్ఞానం, అవినీతి, అంధ విశ్వాసాల్లో మునిగితేలుతుండిన జాతి దుస్థితి చూస్తూ ఎంతగానో విచారి స్తుండేవాడు. జాతిసంస్కరణ గురించే సదా ఆలోచిస్తుండేవాడు. అతను తరచుగా భూమ్యాకాశాల నిర్మాణం, విశ్వవ్యవస్థ నిర్వహణలపై పరిశీలనా దృష్టి సారిస్తుండేవాడు.

ఈ చింతనా, పరిశీలనల్లో నలభై వసంతాలు గడచిపోతాయి. విచార ధార పరాకాష్ఠకు చేరుకుంటుంది. తన చుట్టూ నానాటికీ దిగజారుతున్న పరిసరాలు చూసి అతను తీవ్రంగా ఆందోళన చెందుతాడు. చివరికతను జనవాసాలు వదలి పట్నం వెలుపల ఓ కొండగుహను తన ఆలోచనా సరళికి అనువైన ప్రదేశంగా ఎన్నుకుంటాడు. ఆ గుహలో ఏకాంతంగా రోజుల తరబడి యోచిస్తూ తన మనోమస్తిష్కాలను పరిశుద్ధ పరచు కుంటాడు. ఏ అంధకారంలో జాతి తచ్చాడుతుందో ఆ అంధకారాన్ని దూరంచేసే కాంతిరేఖను అన్వేషించడంలో లీనమైపోతాడు. చివరికి ఓరోజు ఉన్నట్లుండి హఠాత్తుగా ఆ కాంతిరేఖ అతని అంతరంగంలో తళుక్కున మెరిసింది. హృదయం తేజోవంతమయింది. మనోసాగరంలో విప్లవ కెరటాలు ఉప్పొంగాయి. కొండగుహ నుండి బయటికి వచ్చి జనం ముందు నిల్చొని ఓ నూతన శంఖారావం గావించాడు-

సోదరులారా! ఈ రాళ్ళురప్పలను పూజించడం మానేయండి. ఇదంతా మిధ్య, వ్యర్థం. ఈ భూమ్యాకాశాలు, సూర్యచంద్రనక్షత్రాలు వగైరా సమస్త సృష్టిరాసుల్ని సృజించిన సృష్టికర్తే మన దేవుడు. ఆయనే మనల్ని పాలిస్తూ పోషిస్తున్న వాడు. ఆయనే మన జీవన్మరణాలకు కారకుడు. ఆయనే మన మొరల్ని ఆలకించేవాడు. ఈ దోపిడీ-దొంగతనాలు, జూదం, మద్యపానం, వ్యభిచారం-అశ్లీలచేష్టలు అన్నీ పాపకార్యాలు. వాటిని మానేయండి. సత్యమే పలకండి, న్యాయం చేయండి. నిజాయితిగా వ్యవహరించండి. హత్యా-దౌర్జన్యాయలకు దూరంగా ఉండండి. మానవులంతా సమానులు. జాతి, వర్ణం, కులం, తెగ, సిరుల ఆధారంగా ఎవరూ అధికులు కాలేరు. దేవునికి భయపడేవారే ఆయన దృష్టిలో గౌరవనీయులు. మరణానంతరం మనమంతా దేవుని సన్నిధిలో మన కర్మలకు లెక్క చెప్పుకోవలసి ఉంటుంది. అక్కడ విశ్వాసం, సత్కర్మలు మాత్రమే మనల్ని దేవుని శిక్ష నుండి కాపాడగలుగుతాయి...."



ఈవిధంగా ఆ మహనీయుడు ధర్మప్రచారం ప్రారంభించాడు. అయితే ఈ సత్యం, నీతివాక్యాలు అతని జాతిప్రజలకు మింగుడు పడలేదు. వారు అతడ్ని తిరస్కరించడమేగాక అతనిపై హింసాదౌర్జన్యాలకు పాల్ప డ్డారు. ప్రారంభంలో అతడ్ని రాజుగా చేస్తామని, పెద్దఎత్తున సిరిసంపదలు సేకరించి అందరికంటే గొప్ప శ్రీమంతుడ్ని చేస్తామని, అందమైన స్త్రీతో వివాహం జరిపిస్తామని ప్రలోభపెట్టారు. వాటికి లొంగకపోవడంతో దూషించారు; తూలనాడారు; అతని దారిలో ముళ్ళు పరిచారు; శరీరం మీద మలినాలు విసిరారు. ఆ తరువాత రకారకాలుగా వేధించారు. మూడేండ్లపాటు సంఘబహిష్కరణ చేశారు; రాళ్ళతో కొట్టి రక్తసిక్తం చేశారు. చివరికి హత్యాప్రయత్నానికి కూడా ఒడిగట్టారు. అతడ్ని విశ్వసించి అనుచ రులైపోయినవారిని కూడా ఘోరంగా వేధించారు.

ఇంతకూ ఆ దైవదాసుడు చేసిన నేరం ఏమిటీ? సకల చరాచరాలను సృష్టించిన దేవుడ్ని మాత్రమే ఆరాధించాలని; నీతిమంతులుగా, సదాచార సంపన్నులుగా, మానవత్వమున్న మనుషులుగా జీవించాలనే కదా అతను హితోపదేశం చేసింది! అందులో అతని స్వార్థం-స్వలాభాలు ఏమున్నాయి? జాతిశ్రేయస్సు కోసమే కదా అతను పాటుపడింది! నలభై ఏండ్ల వయసు దాకా అతని నీతినడవడికలు చూసేకదా అతనికి సత్యమంతుడు, నిజా యితీపరుడని బిరుదులిచ్చి గౌరవించింది! ప్రాపంచిక వ్యవహారాల్లో ఏనాడూ అబద్ధమాడని మనిషి దేవుని విషయంలో అబద్ధమాడుతాడా?

అదీగాక నలభై ఏండ్ల వయసుదాకా అందరిలాగే సాధారణ శైలిలో మాట్లాడిన మనిషి, చదవనూ-వ్రాయనూరాని నిరక్షరాస్యుడు ఆ తరువాత అకస్మాత్తుగా ప్రజల సాధారణ శైలికి భిన్నంగా అతని నోట వెలువడుతున్న అద్భుతవాణి 'దైవవాణి' గాక మరేమవుతుంది? ఆ దివ్యవాణి (ఖుర్‌ఆన్)

తనలోని ఒక అధ్యాయం లాంటిదైనా, కనీసం ఒక సూక్తి లాంటిదైనా రచించి చూపమని సవాలు విసరినప్పుడు గొప్ప గొప్ప కవులు, పండితులు సైతం దాన్ని స్వీకరించలేక చేతులెత్తేశారు.

"ఈఖుర్‌ఆన్ దేవుని దగ్గర నుండి దివ్యావిష్కృతి లేకుండా మానవులు తమంతట తాము రచించుకోగల గ్రంథం కాదు. ఇది పూర్వం అవతరించిన దైవగ్రంథాల్ని ధృవీకరిస్తున్న దివ్యగ్రంథం, (వాటన్నిటి మౌలిక బోధనలను) విపులీకరించే సమగ్ర గ్రంథం. నిస్సందేహంగా ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన గ్రంథం." (ఖుర్‌ఆన్-10:37)

"మా దాసునిపై దించిన ఈ గ్రంథం గురించి మీకేదైనా అనుమానం ఉంటే ఇందులోని అధ్యాయంలాంటి ఓ అధ్యాయం రచించి తీసుకురండి. దీనికోసం ఒక్క దేవుణ్ణి వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యవంతులైతే ఈపని చేసి చూపండి. మీరీ పని చేయలేకపోతే...ఏమాత్రం చేయలేరు...మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. అవిశ్వాసుల కోసం అది సిద్ధపరచబడిఉంది." (ఖుర్‌ఆన్-2:23,24)

"యావత్తు మానవులు, జిన్నులు ఏకమయి కఠోర తపస్సు చేసినా, పరస్పరం సహకరించుకున్నా, ఖుర్‌ఆన్‌లాంటి గ్రంథాన్ని ఎన్నటికీ రచించ లేరు." (17:88); "వారు ఖుర్‌ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ నుండి గాక మరెవరి నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (ఖుర్‌ఆన్-4:82)

ఖుర్‌ఆన్ భాషాశైలి అద్భుతమైంది. దీన్ని ఫలానా శైలి అని నిర్దిష్టంగా పేర్కొన లేము. ఖుర్‌ఆన్‌లోని భాషా ఉరవడి, వాడి, వేడి అద్వితీయ మైనవి. అంచేత కొందరు భాషాకోవిదులు ఇది ప్రాసయుక్తమైన గద్య మని, గద్యరూపంలో వున్న పద్యమని అభిప్రాయపడ్డారు. ఇందులో పద్యా నికి ఉండవలసిన లాక్షణిక నియతి ఏదీ లేకపోయినా భావగర్భితమైన పదబంధాలు, కవితాసృష్టిలోని నుడికారపు వంపుసొంపులు, పదాలంకర ణలు మాత్రం వున్నాయి. అలాగే మరొకవైపు గద్యానికి వుండవలసిన భావ గాంభీర్యం, భావసమగ్రత, విషయానుశీలనం, వాక్యాల పటుత్వం మనకు



కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. అయినా ఖుర్‌ఆన్‌శైలి గ్రంథరచనలా వుండదు. ఇది పూర్తిగా ప్రసంగధోరణిలో సాగుతుంది. ఓ నిరంతర ప్రసంగం! అనర్గళంగా సాగే వచనామృత ధార!

ఖుర్‌ఆన్ అవతరించిన అరబీభాష ఇరాఖ్ నుండి మొరాకో వరకు దాదాపు యాభై కోట్లమంది ప్రజలకు ఈనాటికీ మాతృభాషగా ఉంది. అరబీభాష వ్యాకరణం, దాని పదకోశం, ఉచ్చారణ, నుడికారాలు 1400 సంవత్సరాల నుండి నేటికీ అలాగే వున్నాయి. ఆనాటి అరబ్బులు ఈ గ్రంథాన్ని చదివి ఎలా అర్థం చేసుకునేవారో ఈనాడు కూడా అరబీభాష ఎరిగినవారు దీన్ని చదివి అలాగే అర్థం చేసుకోగలుగుతారు. ఖుర్‌ఆన్ తన మూలభాషలో, అసలుపదాలతో ఎలాంటి మార్పులకు, చేర్పులకు గురికాకుండా ఈనాటికీ నూరుశాతం సురక్షితంగా ఉంది.

నైతికదృష్ట్యా రాళ్ళకుప్పలో రత్నంలా ఉద్భవించిన ఆ మహనీయుని నోట వెలువడిన ఇలాంటి దివ్యవాణిని ఏ దైవభీతిపరుడు, నిస్వార్థపరుడు నిరాకరిస్తాడు?

"కాబట్టి, (మీరనుకునేది నిజం) కాదు. మీకు గోచరించేదాని పేర, గోచరించనిదాని పేర ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇది గౌరవనీయుడైన సందేశహరుని వాక్కు. ఏ కవి నోటో వెలువడిన మాటకాదు. మీరసలు బహు తక్కువగా విశ్వసిస్తారు. ఇది ఏ మాంత్రికుడో చెప్పిన వాక్కు కూడా కాదు. మీరసలు చాలా తక్కువగా ఆలోచిస్తారు. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన వాణి. ఇతను కల్పించి ఏదైనా విషయం ప్రచారం చేస్తే, మేమితని కుడిచేయి పట్టుకొని కంఠనాళం కోసివేసే వాళ్ళం. అప్పుడు మమ్మల్ని ఈపని నుండి ఏశక్తీ అడ్డుకోలేదు." (ఖుర్‌ఆన్-69:39-47)

గతంలో గొప్పగొప్ప మేధావులు సమాజాన్ని సంస్కరించారు. కాని దైవ ప్రవక్తలుకాని ఆ మేధావులు మానవజీవితంలోని ఏవో రెండు మూడు రంగాలను మాత్రమే కొంతమేరకు సంస్కరించగలిగారు. కాని ఈ అరబ్బు నిరక్షరాస్యుడు దైవప్రవక్తగా కేవలం 23 సంవత్సరాలలో జీవిత సమస్త రంగాలను సమూలంగా సంస్కరించాడు.

అతను అత్యున్నత సుగుణసంపత్తితో తన శత్రువుల్ని మిత్రులుగా చేసుకున్నాడు. తన వ్యతిరేక శక్తుల్ని అనుకూలంగా మార్చుకున్నాడు. అతను, అతని అనుచరులు సత్యవ్యతిరేకుల హింసాదౌర్జన్యాలు భరించ లేక మక్కా నుండి మదీనాకు వలసపోతే విరోధులు అక్కడక్కూడా చేరి సమరజ్వాలలు రగిలించారు. అయితే ఆ మహనీయుడు క్రమంగా తన అనుచరుల సంఖ్య పెరగడంతో పాటు దైవాజ్ఞ కాగానే యుద్ధరంగంలోకి దిగి పదేండ్ల కాలంలోనే సత్యవ్యతిరేకులు రగిల్చిన సమరజ్వాలలను ఆర్పి వేశాడు. విజేతగా మక్కా నగరంలో ప్రవేశించినప్పుడు తనను, తన అనుచరుల్ని దారుణంగా హింసించి ముప్పతిప్పలు పెట్టిన బద్ధవిరోధుల్ని, తన పినతండ్రిని కడతేర్చి అతని గుండేకాయను నమలిన రక్తపిపాసుల్ని సైతం విశాలహృదయంతో క్షమించాడు.

ఆ మహామనీషి సభ్యతనాగరికతల వాసన కూడా ఆఘ్రాణించని అరబ్బుల్ని ఒక త్రాటిపైకి తెచ్చి వారి సమస్త జీవితరంగాల్లో నైతికతా కుసుమాలు వెదజల్లాడు. అతను లేవదీసిన ఏకేశ్వరోపాసనాఉద్యమం, నైతికతా విప్లవం ముందు కరడుగట్టిన సత్యతిరస్కారులు కూడా తలలు వొంచారు; రోమ్, ఈరాన్, ఈజిప్టు లాంటి అగ్రరాజ్యాలు గడగడలాడి పోయాయి.

కేవలం 23 ఏండ్ల అతి స్వల్ప కాలంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలను సమూలంగా సంస్కరించి, ఆయా రంగాల్లో సముచిత శాసనాలతో కూడిన సువిశాలమైన ఓ మహత్తర సామ్రాజ్యాన్ని స్థాపించడం మానవమాత్రుడికి సాధ్యమేనా? గతంలో ఎవరైనా మానవ మాత్రుడు ఇలాంటి సంపూర్ణ విప్లవం లేవదీసి, సమగ్ర జీవనవ్యవస్థ నెలగొల్పినట్లు చరిత్రలో ఒక్క ఉదాహరణయినా మనకు లభిస్తుందా? ముమ్మాటికీ లేదనే చెప్పాలి. అది దైవప్రవక్తలకే సాధ్యం. ఆ దైవప్రవక్తల లోని అంతిమ దైవప్రవక్తే ముహమ్మద్ మహనీయుడు (సల్లం).

ఆ మహనీయుడు (స) దైవధర్మం పేరుతో ఏది మాట్లాడినా, ఏ పని చేసినా దివ్యావిష్కృతి ద్వారా లభించే దైవాజ్ఞల ప్రకారమే మాట్లాడేవారు, చేసేవారు. ఆ దైవాజ్ఞలు, దైవహితోక్తుల సముదాయమే దివ్యఖుర్ఆన్.



ముహమ్మద్ (స) ప్రవక్తృత్వం గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"మేము ముహమ్మద్(సల్లం)ని యావత్మానవాళికోసం దైవప్రవక్తగా నియమించాం. దీనికి దేవుని సాక్ష్యమే చాలు. కనుక ఎవరు దైవప్రవక్తకు విధేయులయి నడచుకుంటారో, వారు దేవునికి విధేయులై నడచుకున్నట్లే. అలాచేయకుండా ముఖం తిప్పుకుంటే తిప్పుకోని. అలాంటివారి కోసం మేము నిన్ను పర్యవేక్షకునిగా నియమించిపంపలేదు." (4:79,80)

"(ప్రజలారా!) ముహమ్మద్ (స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాదు. ఆయన దేవుని సందేశహరుడు. దౌత్యపరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు." (33:40)

ఆదిమానవుడు ఆదం (అలై) నుండి ముహమ్మద్ (స) వరకు మొత్తం లక్షా ఇరవై నాల్గువేల మంది ప్రవక్తలు ప్రభవించినట్లు హదీసులు చెబుతున్నాయి. వారిలో ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త. ఈ విషయాన్ని ఆయన పలు సందర్భాలలో ఈవిధంగా తెలియజేశారు:

♣ "దైవదౌత్య పరంపర ముగిసిపోయింది. నా తదనంతరం ఇక ఏ ప్రవక్తగాని, సందేశహరుడుగాని రాడు." (తిర్మిజి, ముస్నద్ అహ్మద్)

♣ "నేను అంతిమ దైవప్రవక్తను. నా తరువాత మరే ప్రవక్తా లేడు. అయితే నా అనుచర సముదాయం (ఉమ్మత్)లో ముప్ఫయి మంది అసత్యవాదులు పుట్టారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను దైవప్రవక్తనని ప్రకటించుకుంటాడు." (అబూదావూద్)

♣ "ఇస్రాయీల్ సంతతికి దైవప్రవక్తలు నాయకత్వం వహించేవారు. ఒక ప్రవక్త చనిపోగానే మరొక ప్రవక్త అతనికి వారసుడయ్యేవాడు. కాని నా తదనంతరం ప్రవక్తలెవరూ ఉండరు. ఖలీఫాలు మాత్రం ఉంటారు." (బుఖారి)

ఒక ప్రవక్త తదనంతరం మరొక ప్రవక్త రావడానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉండవచ్చు.

(**1**- గతప్రవక్త తెచ్చిన దైవబోధనలు అంతరించడమో, మార్పులు-

చేర్పులకు గురికావడమో జరిగివుండాలి. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట వెలువడిన దైవబోధనలు ఖుర్ఆన్ రూపంలో ఇప్పటికీ వాటి మూలభాషలో సురక్షితంగా ఉన్నాయి. న్యాయబద్ధంగా ఆలోచించినా, చారిత్రక దృష్టితో వీక్షించినా ఖుర్ఆన్ విషయంలో లభించేటంతటి గట్టి ప్రామాణికత, చారిత్రక ఆధారాలు మరే మతగ్రంథం విషయంలో మనకు లభించవు. ఖుర్ఆన్ విషయంలోనే కాదు, ముహమ్మద్ ప్రవక్త (స) జీవిత విశేషాలను గురించి కూడా పటిష్ఠమైన ఆధారాలు ఉన్నాయి. ఆయన జీవితాన్ని ప్రత్యక్షంగా చూసి, ఆయన అమృతప్రవచనాలు ఆస్వాదించిన అనుచరుల జీవితవిశేషాల్ని గురించి, ఆ అనుచరుల్ని ప్రత్యక్షంగా కలుసు కొని వారి ద్వారా ప్రవక్త జీవితవిశేషాలను సేకరించిన వ్యక్తుల జ్ఞాపకశక్తి, గుణగణాలను గురించి కూడా గట్టి ఆధారాలు ఉన్నాయి.

(**2**- గతప్రవక్త తెచ్చిన దైవబోధనలు ప్రస్తుత ప్రజల అవసరాలకు అసంపూర్ణంగా ఉండటమో లేదా కొన్ని మార్పులు-చేర్పులు చేయవలసిన అవసరం రావడమో అయివుంటుంది. ముహమ్మద్ ప్రవక్త (సల్లం) తెచ్చిన దైవబోధనలు సంపూర్ణమైనవి. వాటిలో మార్పులు-చేర్పుల కోసం మరో ప్రవక్త రావలసిన అవసరం లేదు. ఈ బోధనలు ప్రళయం దాకా జన్మించే ప్రజలకు వర్తించే విధంగా ఉన్నాయి.

(**3**- గతప్రవక్త తెచ్చిన దైవబోధనలు ఓ ప్రత్యేకజాతి కోసం పరిమితమై ఉండటం వల్ల ప్రస్తుత జాతి లేక జాతుల కోసం మరొక ప్రవక్తను పంప వలసిన అవసరం ఏర్పడి ఉండవచ్చు. ముహమ్మద్ ప్రవక్త (స) యావత్తు మానవాళి కోసం ప్రభవించిన దైవప్రవక్త. కనుక ఏ జాతిప్రజలు కూడా మరో దైవప్రవక్త కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు.

ఈ మూడు కారణాలతోనే మహనీయ ముహమ్మద్ (సల్లం) చిట్టచివరి దైవప్రవక్త అయ్యారు. ఆయన తెచ్చిన ఖుర్ఆన్ చిట్టచివరి దైవవాణి అయ్యింది. ఇదే ఇప్పుడు ప్రపంచ మానవులందరికీ రుజుమార్గం చూపే ఏకైక కరదీపిక. ఇప్పుడు కావలసింది ఆ కరదీపికతో స్వయంగా రుజు మార్గంలో నడుస్తూ ఇతరుల్ని కూడా రుజుమార్గంలో నడిపించేవారే.



# 11. ఇస్లాం స్వీకార ఒప్పందం

మనిషి ఆచరణలకు విశ్వాసాలే ఆధారాలు. చెట్టు మొలకెత్తి పెరగ డానికి విత్తనం ఎంత ముఖ్యమో ఆచరణకు విశ్వాసం అంతే ముఖ్యం. విద్యుచ్ఛక్తి గురించి ఏమీ తెలియని బాలుడు ఇనుపకడ్డీతో హైటెన్షన్ వైర్ల మీదపడిన గాలిపటం తీసుకోడానికి ప్రయత్నిస్తే కరెంట్ షాక్‌కొడ్తుంది. నిప్పు సంగతి తెలియని పసివాడు వెలుగుతున్న కొవ్వొత్తిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తే చెయ్యి కాలుతుంది. కరెంటుకు షాక్‌కొట్టే గుణం, నిప్పుకు కాల్చే గుణం ఉన్నాయని పెద్దవాళ్ళు నమ్ముతారు. అంచేత వారు పసి పిల్లల్లా, పిచ్చివాళ్ళులా, మూర్ఖుల్లా ప్రవర్తించి ప్రమాదం కొనితెచ్చుకోరు.

అదేవిధంగా దేవుడు, దివ్యావిష్కృతి, మరణానంతర జీవితం గురిం చిన విషయాల్ని కూడా మంచీ-చెడూ, విజ్ఞతా-వివేచనలు కలిగిన మానవుడు విశ్వసించి తదనుగుణంగా నడచుకుంటే, అతను ఇటు ఇహ లోకంలోనూ సుఖవంతమైన జీవితం గడుపుతాడు, అటు పరలోకంలోనూ శాశ్వత సౌఖ్యాలు అనుభవించ గలుగుతాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు: "దేవుడు విశ్వాసంలేని సదాచరణను, సదాచరణలేని విశ్వాసాన్ని (ఎన్నటికీ) స్వీకరించడు." (ఇస్లామీ నజర్య-ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్)

మహనీయ ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్తగా ప్రభవించిన తరువాత గత ప్రవక్తలు తెచ్చిన దైవబోధనలన్నీ రద్దయిపోయాయి. ఇప్పుడు ప్రజలు మహనీయ ముహమ్మద్ (స)ని అంతిమ దైవప్రవక్తగా విశ్వసించి, ఆయనకు పూర్తిగా విధేయులయి, ఆయన ఏఏ విషయాలను విశ్వసించాలని, ఏఏ విషయాలను దైవాజ్ఞలుగా భావించి పాటించాలని ప్రజలకు బోధించారో ఆ విషయాలను విశ్వసించి, ఆ దైవాజ్ఞలను పాటించాలి. ఈ ప్రక్రియ పేరే ఇస్లాం.

ఇస్లాంలో ప్రవేశించడానికి ఒక ఒప్పందం ఉంది. దేవునికి, దాసునికి మధ్య కుదరవలసిన ఒప్పందం అది. ఏదైనా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్‌కు, ఇంజినీర్‌కు మధ్య కుదరవలసిన ఒప్పందం

లాంటిదే ఈ ఒప్పందం. కాంట్రాక్టర్ చేయవలసిన పనులు, షరతులు, సమయాలు మొదలైన విషయాలన్నీ అగ్రిమెంట్‌లో పొందుపరచడం జరుగుతుంది. వాటన్నిటినీ అంగీకరించి తదనుగుణంగా చేస్తానని కాంట్రాక్టర్ అగ్రిమెంట్‌లో సంతకం చేస్తాడు. ఇంజినీర్ కూడా సాక్షిగా, పర్యవేక్షకుడిగా అందులో సంతకం పెడ్తాడు. ఇలా సంతకాలు అయిన తర్వాత కాంట్రాక్టర్ ప్రాజెక్టు స్వీకరించి పనులు ప్రారంభిస్తాడు. ఇంజినీర్ ఆ పనుల మంచీ-సెబ్బరలు పర్యవేక్షిస్తుంటాడు.

అదేవిధంగా ఇస్లాం స్వీకరణ కోసం మనిషి కొందరు సాక్షుల ముందు ఓ ప్రత్యేక సద్వచనం మనస్ఫూర్తిగా పఠించాలి. ఆ సద్వచనం పఠించగానే అతను దానికి సంబంధించిన విషయాలన్నిటినీ విశ్వసించి, దాని బోధన లన్నిటిని పాటించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాలి.

కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం చేయవలసిన పనుల్లో కొన్నిటిని చేసి కొన్నిటిని వదిలేస్తే, లేదా షరతుల్లో కొన్నిటిని ఉల్లంఘిస్తే అతని ఒప్పందం రద్దయిపోతుంది. కాని ఇస్లాంలో దేవునికి, దాసునికి మధ్య కుదిరిన ఒప్పందం రద్దయిపోవడం జరగదుకాని, ఆ ఒప్పందంలో విధిగా చేయవలసిన పనుల్లో కొన్నిటిని మూర్ఖత్వంతో లేదా కావాలని చేయకుండా మానేస్తే మాత్రం పరలోకంలో వాటికి భారీమూల్యం చెల్లించ వలసి వస్తుంది. అంటే దాసుడు కొంతకాలంపాటు నరకయాతనలు చవిచూడ వలసివస్తుంది. ఒకవేళ ఒప్పందంలోని విశ్వాస ప్రకరణలో ఏ ఒక్క విషయాన్ని నిరాకరించినా ఒప్పందం రద్దయిపోతుంది. అంటే ఆ మనిషి ఇక శాశ్వతంగా నరకకూపంలోనే పడివుండవలసి వస్తుంది.

ఇంతకూ ఆ ఒప్పందం ఏమిటో, సంతకంలాంటి ఆ సద్వచనం ఏమిటో తెలుసుకుందాం. ఆ ఒప్పందమే 'ఇస్లాం.' ఇందులో మనిషి విశ్వసించవలసిన విషయాలు, నెరవేర్చవలసిన పనులన్నీ ఉంటాయి. ఇస్లాం అనబడే ఈ ఒప్పందంలోని విషయాలన్నిటికీ కట్టుబడివుంటానని, వాటిని వీలైనంతవరకు పాటిస్తానని మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ ఓ ప్రత్యేక 'సద్వచనం' పఠించాలి. ఆ సద్వచనమే "లాఇలాహ ఇల్లల్లాహు,



ముహమ్మదుర్రసూలుల్లాహ్." అంటే 'అల్లాహ్ తప్ప మరెలాంటి దేవుడు, ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త (సందేశహరుడు)' అని అర్థం. మనిషి ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరడానికి ఈ 'సద్వచనం' గురించి సాక్ష్యం ఇవ్వాలి. అంటే "అష్హదుఅన్‌లాఇలాహ ఇల్లల్లాహు, వఅష్హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ" (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని; ముహమ్మద్ ఆ దేవుని దాసుడు, ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను) అని పలకాలి.

తలనొప్పి నివారణకోసం డాక్టర్ తన పేషంట్‌కు అనాసిన్ అనే మందు ప్రిస్క్రైబ్ చేశాడనుకోండి. అప్పుడా పేషంట్ ఇంటికెళ్ళి డాక్టర్ రాసిచ్చిన మందుచీటిలోని పదాన్ని 'అనాసిన్, అనాసిన్' అని ఎన్నిసార్లు వల్లించినా లేదా ఆ మందుచీటీని నీళ్ళలో నానబెట్టి తాగినా అతని తలనొప్పి తగ్గదు కదా! ఆ పేషంట్ మెడికల్‌షాపుకెళ్ళి అనాసిన్ కొనుక్కొని డాక్టర్ చెప్పినట్లు దాన్ని వాడాలి. అప్పుడే అతని తలనొప్పి తగ్గుతుంది.

అలాగే ఈ సద్వచనాన్ని చిలకపలుకుల్లా కేవలం వల్లించినంతమాత్రాన మనిషి నిజమైన ముస్లిం కాలేడు. అది డాక్టర్ రాసిచ్చిన మందుచీటి లాంటిదని లేదా అగ్రిమెంట్‌లో కాంట్రాక్టర్ చేసిన సంతకం లాంటి విషయమని ముస్లింలు తెలుసుకోవాలి. సంతకం చేసిన తరువాత వారు ఒప్పందంలోని విషయాలు, షరతులన్నిటినీ పాటించవలసి ఉంటుంది. సద్వచన సాక్ష్య ప్రకటనతో మనిషి చట్టప్రకారం ముస్లింగా మారుతాడు. ఈవిధంగా మనిషి ముస్లిం అవగానే ఇస్లాంలోని దైవాజ్ఞల్ని, దైవప్రవక్త (స) హితోక్తుల్ని పాటించడానికి అనుక్షణం సిద్ధంగా ఉండాలి.

## 12. సద్వచన సారాంశం

"లాఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మదుర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప మరెలాంటి ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త) అనే సద్వచనం (కలిమాతయ్యిబా) గురించి వివరంగా తెలుసుకుందాం.

ఈ సద్వచనంలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటి అంశమైన 'లాఇలాహ ఇల్లల్లాహు' అనే వాక్యంలోని 'ఇలాహ్' అనే పదం చాలా

విస్తృతభావంతో కూడుకున్నది. 'ఇలాహ్' అంటే ఆపద సమయంలో ఆదుకునేవాడు, భయాందోళనలు కలిగినప్పుడు శాంతి స్థిమితాలు ప్రసాదించేవాడు, కష్టాలు కడతేర్చి సుఖాన్నిచ్చేవాడు, శరణుగోరినవారికి ఆశ్రయమిచ్చేవాడు, కోర్కెలు తీర్చేవాడు అని నానార్థాలు ఉన్నాయి. ఈ అరబీ పదాలలో ఆధిక్యతా భావం (Supremacy) కూడా ఇమిడివుంది.

ఆధిక్యత ఉన్న చోటికే అవసరార్థులు గుమికూడటం సహజం. కనుక ఆధిక్యత కలిగిఉన్నవాడు అర్థులకు ఆరాధ్యుడయి పోతాడు. ఈవిధంగా 'ఇలాహ్' అనేపదంలో అర్థించదగినవాడు, ఆరాధించదగినవాడు, ఆశ్రయమిచ్చేవాడు, ఆపదల మొక్కులవాడు అనే అర్థాలున్నాయి. బహుదైవారాధనా భావం కలిగినవారంతా ఈ అర్థాలలోనే అసాధారణ శక్తి ఉందని భావించిన ప్రతి సృష్టితాన్ని (Creature) పూజించడం ప్రారంభించారు. చివరికి ఏకేశ్వరవాదులమని చెప్పుకునేవారు సైతం ఏకాగ్రత కోసమనో, దేవునికి ప్రతిరూపాలనో భావించి సృష్టిపూజకు అలవాటుపడ్డారు.

అయితే ఇస్లాం ఏకేశ్వరవాదానికి సంబంధించి విశ్వాసానికి, ఆచరణకు మధ్య ఉన్న ఈ వైరుధ్యాన్ని ఖండించింది. ఆ 'ఇలాహ్' (ఆరాధ్యుడు) ఒక్కడేనని, ఆయన తప్ప వేరేఆరాధ్యుడు పూజనీయుడు లేడని, ఆయనే 'అల్లాహ్' అని నమ్మడంతోపాటు ఆచరణరీత్యా కూడా ఆ ఒక్కడినే ఆరాధించాలని, ఆయన్నే వేడుకోవాలని, జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ ఆయన ఆజ్ఞల్ని మాత్రమే శిరసావహించాలని చెబుతోంది.

ఏకేశ్వర భావం ప్రతి మానవుని నైజంలో వేళ్ళూని ఉంది. అయితే ఆచరణలోనే అనేక మంది ఈ సత్యానికి కట్టుబడి ఉండలేక పోతున్నారు. ఒకే దేవుణ్ని ఆరాధిస్తున్నామని చెబుతూనే కొన్ని చేష్టల ద్వారా బహుదైవోపాసనకు పాల్పడుతున్నారు.

దేవుళ్ళు అనేక మంది ఉన్నారని భావించినప్పుడు "కస్మై దేవాయ హవిషా విధేమ?" (ఏ దేవునికి మా హవిస్సుల నివ్వవలెను?) అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రపంచానికి, ఇక్కడి సుఖదుఃఖాల వ్యవస్థకు కారణం "ఏకోబ్రహ్మమే" అని నిర్ధారించుకున్నప్పుడు "ఆ బ్రహ్మ లక్షణాలు ఏవి?" అనే మరో ప్రశ్న ఉద్భవిస్తుంది. ఆ బ్రహ్మ లక్షణాలన్నీ కలిగివున్న సమగ్ర పదమే "అల్లాహ్". 'అల్+ఇలాహ్' అనే రెండుపదాలు కలసి ఒకే దేవుడు, The God అనే భావం స్ఫురించేలా 'అల్లాహ్' అనే పదం ఏర్పడింది. ఈ పదమే ఆ శుద్ధ ఏకబ్రహ్మకు నామవాచకమైపోయింది.



కనుక ఆ శుద్ధ ఏకబ్రహ్మ అయిన అల్లాహ్ మాత్రమే ఆరాధనకు, ఆశ్రయం పొందడానికి, విజ్ఞప్తులకు, వేడుకోళ్ళకు అర్హుడని, ఆయన తప్ప ఇహపరలోకాల్లో మరే దేవుడు, ఆరాధ్యుడు లేడని ఈ 'సద్వచనం' లోని మొదటి అంశం తెలియజేస్తోంది.

"(అసలైన ఆరాధ్యుడు) అల్లాహ్యే. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన నిత్యజీవుడు; ఎన్నటికీ నిద్రించనివాడు; కునుకుపాట్లు కూడా పడనివాడు. భూమ్యాకాశాల్లో వున్న సమస్తం ఆయనదే. ఎవరి విషయంలో నైనాసరే, ఆయన అనుమతి లేకుండా ఆయన సన్నిధిలో ఎవరు సిఫారసు చేయగల్గుతారు? వారి ముందున్న దేమిటో, వారికి గోచరించకుండా ఉన్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. ఆయన తలచుకుంటే తప్ప ఆయనకున్న జ్ఞానసంపదలోని ఏ విషయమూ ఎవరికీ తెలియదు. ఆయన రాజ్యాధికారం భూమ్యాకాశాలను పరివేష్టించిఉంది. వాటి రక్షణ ఆయనకు ఏ మాత్రం కష్టమైన పనికాదు. ఆయన సర్వాధికారి, సర్వోన్నతుడు." (ఖుర్ఆన్–2:255)

"తాను తప్ప మరోఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన గోచర అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు, కరుణామయుడు, కృపాసాగరుడు. తాను తప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన రాజాధిరాజు, పరమపవిత్రుడు, శాంతిమయుడు, శరణునిచ్చేవాడు, సంరక్షకుడు, పర్యవేక్షకుడు, సర్వాధికుడు, సర్వోన్నతుడు, చండశాసనుడు. ప్రజలు చేస్తున్న బహుదైవారాధనకు అల్లాహ్ ఎంతో అతీతుడు, పరిశుద్ధుడు." (ఖుర్ఆన్–59:22,23)

"చెప్పు: ఆయన అల్లాహ్, ఏకైక దేవుడు. ఆ దేవుడు ఎవరి అవసరమూ లేని నిరపేక్షాపరుడు. ఆయనకు ఎలాంటి సంతానం లేదు. ఆయన ఎవరికీ సంతానంగా లేడు. ఆయనకు సమానమైన వారెవరూ లేరు. ఆయన సాటిలేని మహామేటి." (ఖుర్ఆన్–112:1-4)

మహాప్రవక్త ముహమ్మద్ (స) దేవుని మాటల్ని ఇలా తెలిపారు:

“నా దాసులారా! నేను మార్గం చూపినవాడు తప్ప మీలో ప్రతిఒక్కడూ మార్గవిహీనుడే. కనుక సన్మార్గం చూపమని నన్ను వేడుకోండి, నేను మీకు సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదిస్తాను. నా దాసులారా! నేను ఉపాధి ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతిఒక్కడూ క్షుత్బాధితుడే. కనుక ఉపాధి ప్రసాదించమని నన్ను మొరపెట్టుకోండి, నేను మీకు ఉపాధినిస్తాను. నా దాసులారా! నేను వస్త్రాలు ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతిఒక్కడూ వస్త్రవిహీనుడే. కావున వస్త్రాలు ప్రసాదించమని నన్ను అర్థించండి, నేను మీకు వస్త్రాలస్తాను. నా దాసులారా! మీలో ప్రతిఒక్కడూ రేయింబవళ్ళు పాపాలు చేస్తున్నవాడే. నేను మీపాపాలన్నీ క్షమిస్తాను. కనుక పాపక్షమాపణ కోసం నన్ను ప్రార్థించండి, నేను మీపాపాలు క్షమిస్తాను.” (ముస్లిం)

ఏకదైవారాధనకు సంబంధించిన ఈ విశ్వాసం, భావనలు మనిషిలో ఎంతో ఆత్మాభిమానం, ఆత్మగౌరవం జనింపజేస్తాయి. యావత్ సృష్టితాలు తన లాంటి దైవదాసులు, అశక్తులు మాత్రమేనని, సర్వలోక సృష్టికర్త, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మాత్రమే ఆరాధించదగినవాడని గట్టిగా నమ్మిన మనిషి విశ్వపాలకుడు, జగన్నాయకుడయిన ఆ ఏకేశ్వరునికి తప్ప మరెవరికీ భయపడడు, తలవంచడు. ఆ అసాధారణ శక్తిస్వరూపుడి ముందు తప్ప మరెవరి ముందూ చేయిజాపడు, దేబరించడు.

సృష్టికర్తను మాత్రమే ఆరాధించేవాడు సృష్టిపూజ సమీపానికే పోలేడు. అందరికంటే అల్లాహ్ మాత్రమే గొప్పవాడని, తన దగ్గర ఉన్న భౌతిక-మానసిక సంపదలన్నిటికీ ఆయన మాత్రమే యజమాని అని దృఢంగా విశ్వసించిన మనిషిలో అహంకారం మచ్చుకైనా ఉండదు. దానికి బదులు అణుకువ, ఆత్మసంతృప్తులు అతని అంతరంగంలో వేరుగొంటాయి. ఆ శుద్ధ పరబ్రహ్మ ప్రసాదించిన నైతిక-ఆధ్యాత్మిక సంపదలే తనకు ఆయన ప్రసన్నత-దర్శనభాగ్యాలు చేకూర్చుతాయని నమ్ముతాడు.

అలాంటి వ్యక్తి నిరాశానిస్పృహలకు, పిరికి-పారుబోతుతనాలకు ఏ మాత్రం తావీయకుండా ఆశయ సాధనలో అకుంఠిత దీక్షాపరుడై త్యాగ



భావంతో పనిచేస్తాడు. దైవప్రసన్నత కోసం అధర్మశక్తులకు ఏమాత్రం భయపడకుండా ధనప్రాణాలను సైతం ధారపోయడానికి సిద్ధమవుతాడు. మరోవైపు తోటిమనుషుల్ని, సహదైవదాసులుగా, సాటిసోదరులుగా భావించి వారిపట్ల ఎల్లప్పుడు మానవతా దృక్పథంతో మసలుకుంటాడు.

ఏకేశ్వరుడు, శుద్ధ పరబ్రహ్మ అయిన అల్లాహ్‌ను పైన వివరించినట్లు విశ్వసిస్తున్న మనిషి ఆయన్ని ఆరాధించడానికి అవసరమైన ఆదేశాలు, పద్ధతులు లభించే మార్గం ఏమిటీ, దాన్ని గురించి ఎవరు తెలియజేస్తారు అని యోచిస్తాడు. అలాంటిమనిషి ఆ రుజుమార్గం తెలిపే మహనీయుడు తారసపడితే అతడ్ని తప్పకుండా విశ్వసిస్తాడు. అంటే సద్వచనంలోని రెండవ అంశమైన ‘ముహమ్మదుర్రసూలుల్లాహ్’(ముహమ్మద్ దేవుని ప్రవక్త, దైవసందేశహరుడు) అనే విషయాన్ని విశ్వసిస్తాడన్న మాట.

ఆవిధంగా “లాఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మదుర్రసూలుల్లాహ్” అనే సద్వచనాన్ని పూర్తిగా, హృదయపూర్వకంగా విశ్వసించిన మనిషి జీవితంలో సంపూర్ణ విప్లవం వస్తుంది. అతను అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) అడుగుజాడలలో తు.చ. తప్పకుండా నడవడానికి కృషిచేస్తాడు. ఆయన ద్వారా లభించిన ప్రతి ఆదేశాన్ని శిరోధార్యంగా భావించి పాటిస్తాడు. ఆయన నిషేధించిన విషయాల ఛాయకే పోలేడు. ఆ మహనీయుని గుణగణాలను అలవరచుకోవడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాడు. ఇలా అతను మానవత్వం మూర్తీభవించిన మనిషిలా, పరిపూర్ణ ముస్లింగా జీవితాంతం మనుగడ సాగిస్తాడు.

## 13. మౌలిక విశ్వాసాలు

ఇస్లామీయ విశ్వాసం అయిదు మౌలిక విశ్వాసాలపై ఆధారపడిఉంది. 1- దేవునిపై విశ్వాసం, 2- దైవదూతలపై విశ్వాసం, 3- దైవగ్రంథాలపై విశ్వాసం, 4- దైవప్రవక్తలపై విశ్వాసం, 5- పరలోకంపై విశ్వాసం.

“మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుడ్ని, అంతిమదినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ)

గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకు అత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చుచేయాలి; ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలి; (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలి; ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసేవారే సన్మార్గగాములు. వారే (దేవుని పట్ల) భయ భక్తులు కలిగినవారు.” (ఖుర్ఆన్–2:177)

పై సూక్తిలో ఈ అయిదు విశ్వాసాల ప్రస్తావన వచ్చింది. ఈ అయిదు విశ్వాసాలలో ‘దేవునిపై విశ్వాసం’ గురించి మనం గతపేజీలలో వివరంగా తెలుసుకున్నాం. ఇప్పుడిక్కడ మిగతా నాలుగు విశ్వాసాలను గురించి కూడా తెలుసుకుందాం.

## దైవదూతలపై విశ్వాసం

దేవుడ్ని విశ్వసించిన తర్వాత రెండవ మౌలికవిశ్వాసమైన దైవదూతల్ని విశ్వసించాలని దైవప్రవక్త (సల్లం) ఉపదేశించారు. దైవదూతలపై విశ్వాసం బహుదైవారాధనా నమ్మకాలను చాలావరకు దూరంచేస్తాయి.

బహుదైవారాధకులు దేవుని దైవత్వంలో రెండు రకాల సృష్టితాలను చేర్చారు. (1) భౌతికరూపంతో మానవులకు కన్పించే సృష్టితాలు. ఉదాహర ణకు- సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి, అగ్ని, నీరు, కొన్ని రకాల పశువులు, పక్షులు, మహనీయులైన మానవులు. (2) భౌతిక రూపం లేకుండా, మానవులకు కన్పించకుండా విశ్వనిర్వహణ కార్యాలు చేసే సృష్టితాలు. ఉదాహరణకు- వర్షం కురిపించేవాడు (వరుణదేవుడు), గాలి కలిగించేవాడు (వాయుదేవుడు) వగైరా.

మొదటిరకం సృష్టితాలు కంటికి కన్పిస్తున్నాయి కనుక వాటి దైవత్వాన్ని ‘లాఇలాహ ఇల్లల్లాహు’ అనే సద్వచనమే ఖండిస్తుంది. కాని రెండవ రకం సృష్టితాలైన అగోచరశక్తులు ఎంతో ప్రభావవంతమైనవి. ఇవే బహుదైవారా ధకుల్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి. వాటినే బహుదైవారాధకులు దేవతలుగా,



దైవసంతానంగా భావించి, వాటి ఊహాచిత్రాలు, విగ్రహాలు తయారుచేసి పూజిస్తారు. అంచేత ఏకేశ్వరోపాసనా భావన నుండి ఈ రెండవ రకమైన మూఢనమ్మకాన్ని అంతం చేయడానికి సృష్టికర్త ఇస్లాం మౌలికవిశ్వాసాల్లో ‘దైవదూతలపై విశ్వాసం’ అనే ఓ శాశ్వత ప్రకరణ ప్రవేశపెట్టాడు.

దైవదూతలు జ్యోతితో సృష్టించబడిన అగోచరజీవులు. బహుదైవారాధ కులు వారిని దేవతలుగా, దేవుని సంతానంగా భావించి పూజించేవారు. ఇస్లాం ఈ మూఢనమ్మకాన్ని ఖండిస్తూ, వారు దేవుని ఆజ్ఞలను కచ్చితంగా పాటించే దైవదూతలని, ఆయన ఆజ్ఞలను అణుమాత్రం కూడా జవదా టని అత్యంత వినమ్రులని, వారిలో ఎలాంటి దైవత్వంగాని, స్వతంత్ర ప్రతిపత్తిగాని ఏమాత్రం లేదని దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు.

అంతేకాదు, ప్రవక్తలకు దైవసందేశం అందజేసే దైవదూత పేరు జిబ్రీల్ (అలై) అని, వర్షం కురిపించే దైవదూత పేరు మికాయీల్ (అలై) అని, మరణదూత పేరు ఇజ్రాయీల్ (అలై) అని, ప్రళయశంఖారావం గావించే దైవదూత పేరు ఇస్రాఫీల్ (అలై) అని పితృలోకంలో మనిషిని పరీక్షించే దైవదూతలను మున్కిర్, నకీర్ అంటారని కూడా ఆయన తెలియజేశారు.

“నీ ప్రభువు దగ్గర ఎంతో గౌరవప్రతిష్ఠలు కలిగివున్న దైవదూతలు ఎన్నడూ అహంకారంతో ఆయన్ని ఆరాధించకుండా ముఖం తిప్పుకోరు. వారసలు ఎంతో గౌరవభావంతో, భయభక్తులతో ఆయన్ని స్తుతిస్తూ ఆయన ముందు మోకరిల్లుతుంటారు.” (7:206); “వారు గౌరవనీయులైన దైవ దాసులు. ఆయన సన్నిధిలో వారు ఏమాత్రం ఎదురుచెప్పరు. ఆయన ఇచ్చే ఆజ్ఞల్ని (వినయంతో) పాటిస్తారు.” (ఖుర్ఆన్–37:164)

“మానవుని కుడి, ఎడమల వైపు ఇద్దరు (అదృశ్య) లేఖకులు కూర్చొని (అతని) ప్రతి పనినీ, ప్రతి పలుకునూ నమోదు చేస్తున్నారు. అతని నోట ఏదైనా మాట వెలువడగానే దాన్ని నమోదుచేయడానికి ఒక పర్యవేక్షకుడు తక్షణమే అక్కడ ప్రత్యక్షమవుతాడు.”(50:17,18); “ప్రతి మనిషికీ ముందూ వెనుకా దేవుడు నియమించిన (అదృశ్య) గూఢచారులు ఉన్నారు. ఆయన ఆజ్ఞతో వారతడ్ని పర్యవేక్షిస్తుంటారు.” (ఖుర్ఆన్–13:11)

"ఆయన మిమ్మల్ని పర్యవేక్షించేవారిని నియమించి పంపుతున్నాడు. మీలో ఎవరికైనా మరణ కాలం ఆసన్నమైనప్పుడు ఆయన దూతలే అతని ప్రాణం తీసికెళ్తారు. వారు కర్తవ్యనిర్వహణలో ఎలాంటి లోటు రానివ్వరు." (6:61); "మేము పంపే దూతలు వారి ప్రాణాలు తీయడానికి వచ్చినప్పుడు "ఏరి, దేవుడ్ని వదలి మీరు మొరపెట్టుకున్న మీ మిథ్యాదైవాలు ఇప్పుడెక్కడికి పోయారు?" అని ప్రశ్నిస్తారు వారిని. దానికి వారు "వారంతా మా నుండి కనుమరుగైపోయారు" అంటారు. "మేము నిజంగా సత్యతిరస్కారులం" అని వారే తమకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతారు." (ఖుర్ఆన్-7:37)

"దైవదూతలు అవిశ్వాసుల ప్రాణాలు తీస్తున్నప్పటి స్థితి నీవు చూస్తే బాగుండు! వారప్పుడు అవిశ్వాసుల ముఖాలపై, పిరుదులపై కొడుతూ 'ఇక దహన యాతన చవిచూడండి. ఇది మీరు చేజేతులా కొని తెచ్చుకున్నదాని పర్యవసానమే. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడుకాదు' అని అంటారు." (ఖుర్ఆన్-8:50,51)

"దైవదూతలు వారి ఆత్మలను పవిత్రంగా ఉన్నప్పుడు స్వాధీనం చేసు కుంటూ 'మీకు శాంతి కలుగుగాక! మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అంటారు." (ఖుర్ఆన్-16:32)

"ఇది (ఖుర్ఆన్) మహా శక్తిసంపన్నుడు, ఎంతో గౌరవనీయుడైన సందేశహరుని (జిబ్రీల్) వాక్కు. అతను సింహాసనాధీశుని కొలువులో గొప్ప హోదా అంతస్తులు కలిగినవాడు. అక్కడ అతని ఆజ్ఞలు పాటించబడతాయి. అతను ఎంతో నమ్మకస్తుడు." (81:19-21); "జిబ్రీల్ దేవుని ఆజ్ఞతోనే ఈ గ్రంథం నీమీద అవతరింపజేశాడు." (ఖుర్ఆన్-2:96)

"వీరు కరుణామయుని దాసులైన దైవదూతల్ని స్త్రీలుగా పరిగణించారు. వారి శరీరాకృతి చూశారా వీరు? వీరి సాక్ష్యాన్ని మేము నమోదుచేస్తున్నాం. దాన్నిగురించి వీరు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది." (ఖు-43:19)

"మానవులు తమ సృష్టికర్తయిన దేవునికి భూతపిశాచాలను సాటి కల్పించి పూజిస్తున్నారు. పైగా వారు తెలిసో తెలియకో ఆయనకు కొడుకుల్ని, కూతుళ్ళను అంటగడ్తున్నారు. కాని దేవుడు ఎంతో పరిశుద్ధుడు. వారు



కల్పించి పలుకుతున్న మాటలకు ఆయన ఎంతోఅతీతుడు. ఆయన యావత్ భూమ్యాకాశాలనే సృష్టించిన అద్భుత శక్తిసంపన్నుడు. ఆయనకసలు భార్యే లేనప్పుడు సంతానం ఎలా కలుగుతుంది? ఆయనే ప్రతిదాన్నీ సృష్టించే వాడు, ప్రతి విషయమూ తెలిసినవాడు." (ఖుర్ఆన్-6:100,101)

ఇస్లాం స్వీకరించినవారు దైవప్రవక్త (సల్లం) ద్వారా తెలిసిన అనేక విషయాలతో పాటు దైవదూతల ఉనికి, వారి గుణగణాలు, కార్యకలాపా లను గురించిన సమాచారాన్ని కూడా విశ్వసించి తదనుగుణంగా వ్యవహ రించవలసి ఉంటుంది.

## దైవగ్రంథాలపై విశ్వాసం

ఇస్లం మౌలికవిశ్వాసాల్లో మూడవది దైవగ్రంథాలపై విశ్వాసం. దేవుడు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)పై దివ్యఖుర్ఆన్ అవతరింపజేసి నట్లే గతప్రవక్తలపై కూడా దివ్యగ్రంథాలు అవతరింపజేశాడు. వాటిలో ఆయన కొన్ని దైవగ్రంథాల పేర్లు మాత్రమే మనకు తెలియజేశాడు. ఉదాహరణకు- ఇబ్రాహీం ప్రవక్త (అలైహి)పై అవతరించిన గ్రంథం పేరు సహీఫా ఇబ్రాహీం, మూసా ప్రవక్త (అలైహి)పై అవతరించిన గ్రంథం పేరు తౌరాత్, దావూద్ ప్రవక్త (అలైహి)పై అవతరించిన గ్రంథం పేరు జబ్బూర్, ఈసా ప్రవక్త (అలైహి)పై అవతరించిన గ్రంథం పేరు ఇన్జీల్. ఇతర దివ్య గ్రంథాల పేర్లు తెలియజేయబడలేదు. అంచేత ఏ మతగ్రంథం గురించి కూడా ముస్లింలు అది దైవగ్రంథమనిగాని, దైవగ్రంథం కాదనిగాని నమ్మకంగా చెప్పలేరు; చెప్పకూడదు కూడా.

అంతిమ దైవగ్రంథమైన దివ్యఖుర్ఆన్ అవతరణతో గతగ్రంథాల బోధనలు రద్దయిపోయాయి. కారణం ఆ గ్రంథాలు తెచ్చిన దైవప్రవక్తలు ఇహలోకం వీడిపోయిన తరువాత వాటిని ప్రజలు క్రమేణా మార్పులకు, చేర్పులకు గురిచేశారు. వాటి మౌలికబోధనలను పునరుద్ధరించి, కలియుగ మానవుల అవసరాలకు తగిన ధర్మశాస్త్రంతో ఖుర్ఆన్ అవతరించింది. ఇదే ఇప్పుడు ప్రళయందాకా ప్రపంచ మానవాళికి రుజుమార్గం చూపే, ముక్తి ప్రసాదించగలిగే అంతిమ దైవగ్రంథం.

"ఆయనే నీపై సత్యపూరితమైన ఈ గ్రంథం అవతరింపజేశాడు. ఇది గత గ్రంథాలను ధృవీకరిస్తోంది. దీనికి పూర్వం మానవాళికి సన్మార్గం చూపేం దుకు వచ్చిన తౌరాత్, ఇన్జీల్ గ్రంథాలను కూడా ఆయనే అవతరింపజేశాడు. ఆ తరువాత ఆయన (సత్యాసత్యాలను వేరుచేసి చూపే ఈ గీటురాయి (ఫుర్ఖాన్)ని అవతరింపజేశాడు." (ఖుర్ఆన్–3:3)

"మేము కాంతి, సన్మార్గంగల తౌరాత్ అవతరింపజేశాము. దేవునికి విధేయులైన ప్రవక్తలందరూ దాని ప్రకారమే యూదుల వ్యవహారాలు పరిష్కరిస్తుండేవారు. అలాగే ధర్మవేత్తలు, ధర్మశాస్త్రనిపుణులు కూడా. వారికే గ్రంథపరిరక్షణ బాధ్యత ఇవ్వబడింది. దానికి వారే సాక్షులుగా ఉన్నారు. కనుక మీరు ప్రజలకు భయపడకండి. నాకే భయపడండి. నా సూక్తుల్ని స్వల్పమూల్యానికి అమ్ముకోవడం మానేయండి. వినండి, దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే సత్యతిరస్కారులు." (ఖుర్ఆన్–5:44)

"తౌరాత్‌లో మేము యూదులకు ఈ ఉత్తర్వు జారీచేశాము: 'ప్రాణానికి బదులు ప్రాణం, కంటికి బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పంటికి బదులు పన్ను, అలాగే సమస్తగాయాలకు బదులు అలాంటిగాయాలే. అయితే ఎవరైనా ప్రతీకారం చేయకుండా క్షమిస్తే, అది అతని పాపాలకు పరిహారమవుతుంది.' వినండి, దేవుడు నిర్దేశించిన చట్టంప్రకారం పరిష్కారం చేయనివారే దుర్మార్గులు." (ఖుర్ఆన్–5:45)

"ఆ ప్రవక్తల తర్వాత మేము మర్యం కుమారుడు ఈసాను పంపాము. అతను తనకు పూర్వం నుండీ వున్న తౌరాత్‌ను ధృవీకరించేవాడు. అతనికి మేము కాంతి, సన్మార్గం గల ఇన్జీల్‌ని ప్రసాదించాం. అది కూడా గతంలో వచ్చిన తౌరాత్‌ను ధృవీకరిస్తుంది. అది దైవభీతిపరుల పాలిట వెలుగుబాట, హితోపదేశం. ఇన్జీల్‌ప్రజలు అందులో దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారమే పరిష్కరించుకోవాలని మేము ఆదేశించాం. కనుక దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే దుర్జనులు." (ఖుర్ఆన్–5:46,47)

"వారు తమ తప్పుడుఅంచనాలతో దేవుని విషయంలో చాలాపొరబడ్డారు. దేవుడు ఏ మానవమాత్రుడిపై ఎలాంటి విషయాన్నీ అవతరింపజేయలేదని



అంటున్నారు. వారినడుగు: 'ఇంతకూ మూసా తెచ్చిన గ్రంథాన్ని ఎవరు అవతరింపజేశారనుకుంటున్నారు? అది మానవులకు కాంతినిచ్చి సన్మార్గం చూపే గ్రంథం. అలాంటిగ్రంథాన్ని మీరు అనేక భాగాలుగా విడదీసిపెట్టారు. వాటిలో కొన్నిటిని వెల్లడిచేస్తూ మిగిలినవాటిని దాచిపెట్టారు. మీరు, మీ తాత ముత్తాతలు ఎరగని ఎన్నో విషయాలను మేము (ఖుర్ఆన్ ద్వారా) మీకు తెలియజేశాం.' చెప్పు (దాన్ని) దేవుడు (అవతరింపజేశాడు) అని. ఆతర్వాత వారిని వారి పనికిమాలిన వాదనల్లోనే పడిఉండనివ్వు." (ఖుర్ఆన్–6:91)

"(ముహమ్మద్!) మేము నూహ్‌కు, అతనితర్వాత వచ్చిన ప్రవక్తలకు దివ్య జ్ఞానం ఎలా అందజేశామో అలా నీకూ అందజేస్తున్నాం. మేము ఇబ్రాహీం, ఇస్మాయిల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతానం, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్ (అలై)లకు దివ్యజ్ఞానం అందజేశాం. దావూద్ (అలై)కు జబ్బూర్ ప్రసాదించాం." (4:163); "జబ్బూర్‌లో మేము హితోపదేశం చేసిన తర్వాత, మా పుణ్యదాసులు భూమికి వారసులవుతారని వ్రాశాం." (ఖుర్ఆన్–21:105,106)

"దేవుడు విశ్వాసుల నుండి వారి ధనప్రాణాలు కొనుగోలుచేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచిఉంచాడు. వారు దైవమార్గంలో పోరాడుతూ హతమార్చుతారు లేదా హతమార్చబడతారు. (వారికి స్వర్గం లభిస్తుందని) తౌరాత్‌లో, ఇన్జీల్‌లో, ఖుర్ఆన్‌లో వాగ్దానంఉంది. దాన్ని నెర వేర్చేబాధ్యత దేవునిపై ఉంది. వాగ్దానం నెరవేర్చడంలో దేవుడ్ని మించిన వారెవరుంటారు? కనుక దేవునితో మీరు చేసుకున్న ఈ వ్యాపారఒప్పందం పట్ల ఆనందోత్సవాలు జరుపుకోండి. ఇదే ఘనవిజయం. (ఖుర్ఆన్–9:111)

## దైవప్రవక్తలపై విశ్వాసం

ఇస్లాం మౌలిక విశ్వాసాలో నాల్గవది దైవప్రవక్తలపై విశ్వాసం. దైవ ప్రవక్తలు ప్రతి జాతిలోనూ ప్రభవించారని, వారందరూ ఇస్లాం బోధనలే ప్రజలకు అందజేశారని, వాటినే ప్రపంచ మానవాళికి అందజేయడానికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవించారని మనం గతంలో తెలుసుకున్నాం. దీన్నిబట్టి దైవప్రవక్తలంతా ఒకే సముదాయానికి చెందిన

వారని తెలుస్తోంది. కనుక ఇస్లాం స్వీకరించదలచిన వ్యక్తి వారందరినీ విశ్వసించాలి. వారిలో ఏఒక్క ప్రవక్తను తిరస్కరించినా ప్రవక్తలందరినీ తిరస్కరించినట్లే. అంటే అతను దేవుని దృష్టిలో ఇస్లాం మౌలిక బోధనలను అసత్యవిషయాలుగా భావించిన సత్యతిరస్కారి అవుతాడు అలాగే ఏఒక్క ప్రవక్తను సమర్థించినా ప్రవక్తలందరినీ సమర్థించినట్లు అవుతుంది.

దీన్ని ఒక ఉదాహరణ ద్వారా ఇలా పోల్చవచ్చు: పదిమంది తెలుగు వాళ్లు చైనాలోనో, ఈజిప్టులోనో ఒక వింతను చూసివచ్చి దాన్ని గురించి ఒకే విధంగా చెబుతున్నారనుకోండి. అప్పుడు ఎవరైనా ఆ పదిమందిలో ఒకడు చెప్పే మాటలు నిజమని ఒప్పుకుంటే మిగిలిన తొమ్మిది మంది చెప్పే మాటలు కూడా నిజమని ఒప్పుకున్నట్లవుతుంది. అలాగే వారిలో ఒకడు చెప్పే మాటలు అబద్ధమని తిరస్కరిస్తే మిగిలిన తొమ్మిది మంది చెప్పే మాటలు కూడా అబద్ధమని తిరస్కరించినట్లవుతుంది. అదేవిధంగా ఎవరైనా వందమంది దైవప్రవక్తలలో తొంభయితొమ్మిది మంది దైవప్రవక్తలను విశ్వసించి ఒక్క దైవప్రవక్తను తిరస్కరించినా అతను దైవప్రవక్తలందరినీ తిరస్కరించిన అవిశ్వాసి (కాఫిర్) అవుతాడు.

మానవులకు రుజుమార్గం చూపడానికి వివిధజాతుల్లో ఒక లక్షా ఇరవైనాలుగువేల మంది దైవప్రవక్తలు ఉద్భవించినట్లు హదీసుల ద్వారా తెలుస్తుంది. ఆ లక్షా ఇరవైనాలుగు వేలమంది దైవప్రవక్తలలో కొందరి పేర్లు మాత్రమే తెలియజేయడం జరిగింది. వారిని ప్రతిముస్లిం విధిగా విశ్వసించవలసిఉంటుంది. పేర్లు తెలియజేయబడని దైవప్రవక్తలను కూడా సత్యదైవప్రవక్తలని విశ్వసించాలి. అయితే ఏ ప్రత్యేక వ్యక్తిని కూడా అతను దైవప్రవక్త అనిగాని, దైవప్రవక్త కాదనిగాని చెప్పకూడదు.

అలాగే విభిన్న మతాల అనుయాయులు తమ మతనాయకులుగా భావిస్తున్న మహాపురుషుల్లో ఎవరైనా దైవప్రవక్త అయివుండవచ్చు; ఆయన తదనంతరం మూసా, ఈసా ప్రవక్త(అలైహి)ల అనుయాయులు చేసినట్లు వారాయన బోధనలను మార్పులకు, చేర్పులకు గురిచేసి ఉండవచ్చు. అంచేత ఆ మహాపురుషునికి వ్యతిరేకంగా ఎలాంటి మాటా చెప్పడం



ముస్లింలకు ధర్మసమ్మతం కాదు. కాకపోతే ముస్లింలు ఇస్లాం దృక్పథంతో వారి మత బోధనలను గురించి ఏదైనా చెప్పవచ్చు.

గత దైవప్రవక్తలకు, ముహమ్మద్ ప్రవక్త (స)కు మూడు విషయాల్లో మాత్రమే కాస్తంత తేడా ఉంది. దీన్నిగురించి మనం 10వ అధ్యాయం లోని చివరి నాలుగు పేరాల్లో తెలుసుకున్నాం. కనుక ప్రపంచ మానవులంతా రుజుమార్గం తెలుసుకొని మోక్షం పొందడానికి ముహమ్మద్ ప్రవక్త (స)ను, ఆయన బోధనలను విశ్వసించడం తప్ప వేరే మార్గం లేదు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "అల్లాహ్‌ను తన ప్రభువుగా, ఇస్లాంను తన జీవనధర్మంగా, ముహమ్మద్‌ను తన దైవప్రవక్తగా అంగీకరించి దాని పట్ల పూర్తిగా సంతృప్తి చెందినవాడే విశ్వాసమాధుర్యాన్ని చవిచూసిన వాడవుతాడు." (బుఖారి, ముస్లిం)

## పరలోకంపై విశ్వాసం

ఇస్లాం మౌలిక విశ్వాసాల్లోని అయిదవ అంశం పరలోకంపై విశ్వాసం. ఇస్లాం స్వీకరించదలచిన మనిషి పరలోకం గురించి ఈ క్రింది విషయాల్ని తప్పకుండా విశ్వసించవలసి ఉంటుంది:

(1) ఒకానొక రోజు దేవుడు మొత్తం విశ్వవ్యవస్థను, సమస్త సృష్టితాలను సమూలంగా తుడిచిపెడ్తాడు. ఆ రోజును ప్రళయదినం అంటారు.

"ప్రళయశంఖం పూరించబడే రోజు...ఆరోజు పరిస్థితి చాలా కఠినంగా, ఘోరంగా ఉంటుంది." (74:8,9); "ఆరోజు మానవులు (తీవ్రమైన భయాందోళనలతో) కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడైపోతాడు. సూర్య చంద్రుల్ని కలిపివేయడం జరుగుతుంది." (75:7-9); "ఆరోజు నక్షత్రాలు నిస్తేజమైపోతాయి. ఆకాశం చీలిపోతుంది. పర్వతాలు దూదిపింజల్లా ఎగురుతాయి." (ఖుర్ఆన్-77:8-10).

(2) ఆ తర్వాత (ఎన్ని వేల-లక్షల సంవత్సరాలకో తెలియదు) దేవుడు నూతన విశ్వవ్యవస్థ సృష్టించి మృతులందర్నీ తిరిగిబ్రతికించి, వారిని తన ముందు సమావేశపరచుకుంటాడు. దాన్ని పునరుత్థానం అంటారు.

"తీర్పుదినం ఒక నిర్ణీత సమయం. (అది తన నిర్ణీత సమయంలో తప్పకుండా వస్తుంది) ఆరోజు శంఖం పూరించబడుతుంది. అప్పుడు మీరు (సమాధుల నుండి) గుంపులు గుంపులుగా వస్తారు." (78:17,18); "మనం నిజంగా మళ్ళీ మన పూర్వస్థితికి తీసుకురాబడతామా? మనం (చచ్చి) శిథిల మైపోయి ఎముకలుగా మారిపోయినా (తిరిగి బ్రతికించబడతామా)?' అనంటారు కొందరు. 'అయితే మళ్ళీ ఈ బ్రతికించి లేపడమనేది (మనకు) చాలా నష్టదాయకమే' అంటారు తిరిగి. కాని ఇది పెద్ద పనేమీ కాదు. ఒకే ఒక భీకరగర్జన విన్పిస్తుంది. అంతే- మరుక్షణమే వారంతా లేచి ఓ బహిరంగ మైదానంలోకి వచ్చి నిలబడతారు." (ఖుర్ఆన్-79:10-14).

(3) మానవులందరూ తమ ఐహికజీవితంలో చేసుకున్న కర్మలకు సంబంధించిన రికార్డులన్నీ దైవన్యాయస్థానంలో ప్రవేశపెట్టబడతాయి. అక్కడ విశ్వప్రభువు ముందు దుర్మార్గులు, పాపాత్ముల నుండి ఒక్కొక్క దుష్కర్మను గురించి కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. ఆ రోజును తీర్పుదినం లేక విచారణదినం అంటారు.

"ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (102:8); "మీరంతా చివరికి దేవుని సన్నిధికి చేరుకోవలసిన దినం గురించి భయపడండి. (ఆరోజు) ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (ఖుర్ఆన్-2:281).

"అనుమానాలతో కూడిన నిర్ణయాలు తీసుకునేవారు నాశనంగాను! వారు అజ్ఞానాంధకారంలో తచ్చాడుతూ ఏమరుపాటుకు లోనైఉన్నారు. పైగా అసలీ విచారణదినం ఎప్పుడొస్తుందని అడుగుతున్నారు. వారిని నరకాగ్నిలో పడేసి మాడ్చివేసే దినం వస్తుంది(అని చెప్పు. అప్పుడు దైవదూతలు వారితో) 'ఇక చవిచూడండి మీ దురాగతాల రుచిని. మీరు తొందరపెడ్తుండిన విషయం ఇదే' (అని అంటారు)." (ఖుర్ఆన్-51:10-14)

(4) మానవులు చేసుకున్న సత్కర్మలు, దుష్కర్మలు సమస్తం పరలోక త్రాసులో తూయబడతాయి. ఎవరి సత్కర్మలు వారి దుష్కర్మల కంటే



బరువుగా ఉంటాయో వారిని దేవుడు క్షమిస్తాడు; మరెవరి దుష్కర్మలు వారి సత్కర్మల కంటే బరువుగా ఉంటాయో వారిని దేవుడు శిక్షిస్తాడు.

"ప్రళయదినాన మేము కచ్చితంగా తూచే త్రాసు ఏర్పాటుచేస్తాం. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. ఎవరైనా సరే, ఆవగింజంత కూడా ఏదైనా చేసివుంటే, దాన్ని మేము ముందుకు తెస్తాం. లెక్క చూడటానికి మేమే చాలు." (21:47); "ఆరోజు (కర్మల త్రాసులో) బరువయినదే సత్యమవుతుంది. ఎవరి త్రాసుపళ్ళెం బరువుగా ఉంటుందో వారికే మోక్షం లభిస్తుంది. మరెవరి త్రాసు పళ్ళెం తేలికగా ఉంటుందో వారు ఘోరంగా నష్టపోతారు." (ఖుర్ఆన్-7:8,9)

(5) క్షమించబడినవారు స్వర్గానికి, శిక్ష విధించబడినవారు నరకానికి చేరుకుంటారు. సత్కర్మలు, దుష్కర్మలు సమానంగా ఉన్నవారిని కొంత కాలంపాటు ఆరాఫ్ మీద (త్రిశంకు స్వర్గంలో) ఉంచి, ఆ తర్వాత వారిని అసలు స్వర్గానికి పంపడం జరుగుతుంది.

"(ఆరోజు) సజ్జనులు సుఖసంతోషాలలో ఓలలాడుతుంటారు. దుర్జనులు నరకానికి పోతారు. విచారణదినాన వారందులో ప్రవేశిస్తారు. వారిక నరకం నుండి ఎట్టి పరిస్థితిలోనూ బయటపడలేరు." (82:13,14)

నరకం మీదుండే వారధి (పుల్‌సిరాత్) దాటగానే నరకానికి, స్వర్గానికి మధ్య ఒక అడ్డుగోడ లాంటిది ఉంటుంది. దానిని 'ఆరాఫ్' అంటారు. ముస్లింలలో పాపపుణ్యాలు సమానంగా చేసినవారు వారధి దాటి స్వర్గానికి పోలేక ఇక్కడికి వచ్చి ఆగిపోతారు. వారు నరకం నుంచి తప్పించుకోగలిగినా స్వర్గాన్ని అందుకోలేక ఆరాఫ్ మీద కొంతకాలం పడిఉంటారు. ఆ తరువాత దేవుని అనుగ్రహంతో స్వర్గానికి చేరుకుంటారు.

## 14. పరలోక విశ్వాసం ఆవశ్యకత

పరలోకవిశ్వాసం గురించి అంతిమ దైవప్రవక్త (స) ప్రజలకు ఎలాంటి బోధనలు అందజేశారో అలాంటి బోధనలే గతప్రవక్తలు కూడా ప్రజలకు అందజేశారు. కనుక ప్రతిముస్లిం పరలోకాన్ని, దానికి సంబంధించిన ప్రవక్త బోధనలను విధిగా విశ్వసించాలి; నిరాకరిస్తే అవిశ్వాసి అవుతాడు.

మహోత్కృష్ట జీవులైన మానవులు పెద్దవారైన తర్వాత రెండువర్గాలుగా విడిపోతున్నారు. ఒకవర్గం సత్యాన్ని నిరాకరించి నీతిరాహిత్యమనే చీకటి కూపంలో పడుతుంది. మరోవర్గం సత్యాన్ని స్వీకరించి తదనుగుణమైన జీవితం గడుపుతూ పుట్టుకతో వచ్చిన ఉత్కృష్టతను సార్థకం చేసుకుంటుంది.

మొదటి వర్గానికి చెందిన ఒక వ్యక్తి వందలాది మంది అమాయకుల్ని హతమార్చి, వేలాది ఇండ్లను దోచుకున్న పరమ దుర్మార్గుడయి ఉంటాడు. రెండోవర్గానికి చెందిన మరొకవ్యక్తి వందలాది మంది జీవితాలు బాగుపరచి వేలాది కుటుంబాల కష్టాలను కడతేర్చిన సజ్జనుడై ఉంటాడు. వీరిద్దరినీ దేవుడు ఒకే దృష్టితో చూస్తాడా? ఆ దుర్మార్గుడికి అతని దుష్కార్యాలకు తగిన శిక్ష, ఆ సజ్జనుడికి అతని సత్కార్యాలకు తగిన ప్రతిఫలం లభించాలని; క్షుణ్ణంగా విచారణ జరిపించి పూర్తి న్యాయం చేకూర్చాలని మానవ అంతరంగం అభిలషించదా?

సజ్జనుడు చేసిన అనేక సత్కార్యాలకు తగిన పారితోషికం లభించడం ఇహలోకంలో సాధ్యంకాదు. అలాగే దుర్మార్గుడు చేసిన అనేక నేరాలకు తగిన శిక్ష విధించిన తర్వాత దాన్ని అమలుపరచడం కూడా ఇహలోకంలో సాధ్యంకాదు. "దక్షిణాఫ్రికాకు చెందిన మోజెస్ సిట్‌హోల్ అనే నేరగాడు 38 హత్యలు, 40 మానభంగాలు, 6 దోపిడీలు చేశాడు. 1997లో న్యాయస్థానం అతనికి 2,410 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది." (ఈనాడు దినపత్రిక: 17-10-1999).

ఇంతటి సుదీర్ఘకాల శిక్షను అమలు పరచడం ఇహలోకంలో అసంభవమని తెలుస్తూనే ఉంది. అది పరలోకంలోనే సాధ్యం. దీన్నిబట్టి మానవుని జీవితం మరణంతో పూర్తిగా సమాప్తం కాదని, అతని కర్మలకు తగిన శిక్ష లేక ప్రతిఫలం కోసం మరణానంతరం శాశ్వతంగా ఉండే మరో జీవితం ఉంటుందని ఉండాలని మానవ అంతరంగం సహజంగానే ఘోషిస్తుంది.

సాధారణంగా మనం ఏదైనా పని చేయదలచుకుంటే ఆ పని చేస్తే ప్రయోజనం ఉంటుందని ఆశ ఉన్నప్పుడే చేస్తాము; చేయదలచుకోకపోతే ఎంచక్కా మానేస్తాము. ఒకవేళ ఆ పని చేస్తే ప్రయోజనం ఉంటుం



దన్న ఆశతో పాటు, చేయకపోతే నష్టం కలుగుతుందన్న భయం కూడా ఉంటే ఆ పని తప్పకుండా చేయడానికి కృషిచేస్తాము. అది పరలోకానికి సంబంధించిన పనయితే, దానిపట్ల మనకు గట్టి నమ్మకం కూడా ఉంటే ఇక ఎట్టి పరిస్థితిలోనూ ఆ పని చేయకుండా వదలిపెట్టలేము.

దీన్నిబట్టి పరలోకంలోని స్వర్గంలో లభించే అసాధారణ ప్రతిఫలాలు, నరకంలో ఎదురయ్యే దారుణమైన యాతనలు ఏమిటో తెలిసిన ముస్లిం దైవాజ్ఞలను పాటించకుండా ఉండగలడా? పరలోకం పట్ల దృఢమైన విశ్వాసం ఉండే ఏముస్లిం కూడా దైవాజ్ఞలను పాటించకుండా ప్రాపంచిక వ్యామోహంలో కూరుకుపోలేడు.

ఉదాహరణకు నమాజ్‌నే తీసుకోండి. నమాజ్ ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన ప్రతి ముస్లిం రోజుకు అయిదుసార్లు తప్పనిసరిగా నిర్వహించవలసిన అతి ముఖ్యమైన విధి. ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయంలో విశ్వాసులు "దేవా! మేము నిన్నే ఆరాధిస్తాము, నీ సహాయమే అర్థిస్తాము" అని వేడుకోవాలని ఉంది. ఈ వేడుకోలుకు చక్కని క్రియాత్మక రూపమే నమాజ్. ఖుర్‌ఆన్‌లో మరోచోట విశ్వప్రభువు ఇలా ఆదేశిస్తున్నాడు:

"నిస్సందేహంగా నేనే దేవుణ్ణి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి (మానవుడా!) నీవు నన్నే ఆరాధించు. నా జ్ఞాపకార్థం నమాజ్ (ప్రార్థనావ్యవస్థ)ను స్థాపించు." (ఖుర్‌ఆన్–20:14)

"వారు పాపాత్ముల్ని చూసి 'మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?' అని అడుగుతారు. దానికి పాపాత్ములు ఇలా అంటారు: 'మేము నమాజు చేసేవారిలో చేరలేదు. పేదలకు అన్నదానం చేసేవారం కాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండే వాళ్ళము. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తూ ఉండేవాళ్ళము. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (ఖుర్‌ఆన్–74:40–47)

"నమాజ్ చేయనివాడికి నమాజ్ (ప్రళయదినాన) వెలుగు నివ్వడం గాని, ప్రమాణంగా నిలవడంగాని, మోక్షప్రదాయని కావడంగాని జరగదు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (అహ్మద్, దారిమి)

పరలోక విశ్వాసం మనిషి జీవితాన్ని సమూలంగా సంస్కరిస్తుంది. ఏ పనయినా చేయడం లేక చేయకపోవడం అనేది దాని లాభనష్టాలపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచమే సర్వస్వంగా భావించిన మనిషి, ప్రపంచంలో ప్రయోజనం చేకూర్చుతుందన్న ఆశలేని ఎలాంటి సత్కార్యమైనా చేయడానికి ముందుకు రాలేడు. అలాగే ప్రపంచంలో నష్టం కలిగిస్తుందన్న భయంలేని ఎలాంటి దుష్కార్యానికైనా దూరంగా ఉండలేడు. అతనికి భిన్నంగా పరలోకఫలితాల మీద దృష్టిసారించే మనిషి ప్రాపంచిక లాభనష్టాలు, సుఖదుఃఖాలు పూర్తిగా అశాశ్వతమైనవని భావిస్తాడు. పరలోకంలోని శాశ్వతమైన లాభనష్టాలు, సుఖదుఃఖాలను దృష్టిలో పెట్టుకొని అతను దుష్కార్యాలకు దూరంగా మసలుకుంటూ సదా సత్కార్యాలు చేస్తుంటాడు. దుష్కార్యాలలో ఎంత ప్రయోజనమున్నా, సత్కార్యాల్లో ఎంత నష్టమున్నా వాటిని ఖాతరు చేయడు.

ఆ ఇద్దరిలో ఎంత వ్యత్యాసం ఉందో చూడండి. మొదటి వ్యక్తి దగ్గర మూన్నాళ్ళ ముచ్చటైన ఐహిక జీవితంలో ప్రయోజనం చేకూర్చేదే సత్కార్యం. ఉదాహరణకు- అక్రమంగా కొంత డబ్బుగాని, కొన్ని గజాలు స్థలంగాని, ఏదైనా హోదా గాని, కాస్తంత పలుకుబడిగాని, కొంచెం పేరుప్రతిష్ఠలుగాని, ఏదైనా బహుమతిగాని, కొందరి పొగడ్తలుగాని, కాస్తంత సుఖంగాని, మనోవాంఛలకు కొంచెం రుచిగాని, లేదా కొన్ని క్షణాల లైంగికానందంగాని లభించే అవకాశం ఉంటే చాలు ఆ పాపకార్యానికి నిస్సంకోచంగా ఒడిగడ్తాడు. ప్రాపంచిక జీవితంలో నష్టం కలిగించేదే అతని దృష్టిలో పాపకార్యం. ఉదాహరణకు- ధనప్రాణాల నష్టంగాని, ఆరోగ్యం క్షీణించడంగాని, అప్రతిష్ఠపాలవడంగాని, పదవీహోదాలు పోవడంగాని, ఏదైనా ఆపద రావడంగాని జరిగే ప్రమాదం ఉంటే ఎలాంటి సత్కార్యం చేయడానిక్కూడా సిద్ధపడడు.

రెండవ వ్యక్తి దృష్టిలో దైవప్రసన్నత లభించే పనే సత్కార్యం; దైవాగ్రహానికి గొనిపోయే పనే దుష్కార్యం. సత్కార్యం చేయడం వల్ల ప్రపంచంలో ఎలాంటి ప్రయోజనం లేకపోయినా, పైపెచ్చు నష్టం వాటిల్లినా సరే అతను దాన్ని సత్కార్యంగానే పరిగణించి చేస్తాడు. అలాగే దుష్కార్యం చేయడం



వల్ల ప్రపంచంలో అతనికి లక్షల సరిసంపదలు లభించినా, గొప్ప గొప్ప హోదాలు వరించినా, పేరుప్రతిష్ఠలు ఆకాశానికి ఎగప్రాకినా, ప్రశంసల కుంభవృష్టి వర్షించినా, అందాలభామలు అక్కున చేరినా సరే అతను దాన్ని దుష్కార్యంగానే భావించి దాని జోలికి పోడు.

ఈరెండు విభిన్న ఆలోచనాతీరులతో మానవుడు రెండు విభిన్నమార్గాలు అవలంబిస్తాడు. పరలోకంపై విశ్వాసంలేని మనిషికి ఇస్లాం చూపే రుజుమార్గంలో ఒక్క అడుగు కూడా నడవడం సాధ్యం కాదు. దైవప్రసన్నత కోసం పేదలకు జకాత్ అందజేయమని ఇస్లాం అంటుంది. కాని అతను జకాత్ ఇస్తే తన సంపద తరిగిపోతుందని, పైగా పేదలకు తానిచ్చే రుణాలపై వారి నడ్డి విరగొట్టే వడ్డీ వసూలు చేస్తానని అంటాడు.

ప్రపంచంలో ఎంత నష్టం వాటిల్లినా సరే, అబద్ధమాడకూడదని, ఎల్లప్పుడో సత్యమే పలకాలని ఇస్లాం చెబుతోంది. కాని అతను 'ఏవిధమైన లాభం చేకూర్చని, పైపెచ్చు నష్టం కలిగించే సత్యం తీసుకొని ఏం చేసుకోను? లాభం చేకూర్చే అబద్ధాన్ని ఎందుకు మానుకోవాలి?' అనంటాడు. ఎవరైనా మీకు భద్రపరచమని ఏదైనా విలువైన వస్తువు ఇస్తే దాన్ని తిరిగి దాని యజమానికి నిజాయితీగా అప్పగించాలని ఇస్లాం చెబుతోంది. కాని పరలోకమ్మీద నమ్మకంలేని ఈ మనిషి తనకు అప్పగించబడిన వస్తువుకు సాక్షులు ఎవరూ లేకపోతే దాన్ని దిగమింగి, 'నువ్వసలు నాకేమీ ఇవ్వలేదు పోవయ్యా' అని వాదిస్తాడు.

దీన్నిబట్టి కొత్తగా ఇస్లాం స్వీకరించినవారికైనా, పుట్టకతో ముస్లిములైనా పరలోకాన్ని విశ్వసించడం ఎంత అవసరమో తెలుస్తోంది. పరలోకం మీద విశ్వాసంలేని మనిషి ముస్లిం కాలేడు. నిజం చెప్పాలంటే పరలోక నిరాకరణ మనిషిని మానవత్వం నుండి దానవత్వానికి దిగజార్చుతుంది.

## ఇతర మతాల్లో పరలోక భావన

క్రైస్తవ మతగ్రంథం బైబిల్ ఎన్ని మార్పులకు, చేర్పులకు గురైనప్పటికీ పరలోక జీవితం గురించిన కొన్ని వాస్తవాలు లేకపోలేదు. ప్రళయం, పునరుత్థానం, స్వర్గనరకాలను గురించి బైబిల్ ఏం చెబుతుందో చూడండి:

"ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశము నుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును." (మత్తయి-24:29)

"దీనికి ఆశ్చర్యపడకుడి; ఆ కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు." (యోహాను- 5:28,29)

"సర్పములారా, సర్పసంతానమా, నరకశిక్షను మీ రేలాగు తప్పించు కుందురు?" (మత్తయి-23:33); "మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను." (రోమా-14:12)

"అనేకులు తూర్పునుండియు, పడమటనుండియు వచ్చి అబ్రాహాము తో కూడను ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను, పరలోకరాజ్య మందు కూర్చుందురు గాని రాజ్యసంబంధులు వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండునని మీతో చెప్పుచున్నానెను." (మత్తయి-8:11,12)

హిందూ మతగ్రంథాల్లో ఒకవైపు పునర్జన్మ సిద్ధాంతం ఉన్నప్పటికీ, మరణానంతరం జీవితంలోని శాశ్వతమైన స్వర్గసౌఖ్యాలు, నరకయాతనల ప్రస్తావనలు కూడా ఉన్నాయి. మచ్చుకు కొన్ని విషయాలు చూడండి:

"నన్ను ఉత్తమకోరికల లోకంలో అనంతునిగా చెయ్యి. ఆ లోకం పూర్తి గా తేజోమయమైన లోకం. అది బ్రహ్మసామ్రాజ్యం. అక్కడ సకల తిను బండారాలు, సంపూర్ణ సుఖభోగాలు లభిస్తాయి." (రుగ్వేదం, మండలం9, సూక్తం113, మంత్రం10)

"ఎక్కడైతే ఆనందం, సౌఖ్యాలు, ఉత్తమమైన అనుభూతులున్నాయో, ఎక్కడైతే కోరుకున్న కోరికలన్నీ మొదటి నుండే లభ్యమయి ఉన్నాయో ఆ లోకంలో నాకు ముక్తినొసగు.' (రుగ్వేదం, మండలం-9, సూక్తం-113, మంత్రం-11)



"దానధర్మాలు చేసేవాడు మొదట సురభం అనే (స్వర్గ) ప్రదేశాన్ని పొందుతాడు. ఆ తరువాత అతడు మంచి వస్త్రాలను, అందమైన స్త్రీని, ఘాటైన సారాయిని పొందుతాడు." (అధర్వణ వేదం: 10-107-9)

"స్వర్గంలో మేము భార్యాపిల్లలతో ఉండేటట్లు అక్కడ మాకు మార్గం చూపు..... అంగవైకల్యరహితులమై మేము స్వర్గంలో మా తల్లిదండ్రుల్ని, కుమారుల్ని చూడాలి." -శత్పథబ్రాహ్మణం (6-6)

"నెయ్యితో నిండిన కోనేరులు, తేనెతటాకాలు, సారాయి, పాలు, పెరుగు మరియు నీటితో పుష్కలంగా పారే తీయటి సెలయేళ్లు స్వర్గంలో లభిస్తాయి. కమలాలతో నిండిన సరస్సులూ లభిస్తాయి." (అధర్వణ వేదం: 4-34-6)

"పరిశుద్ధ నందనవనం వగైరాలు పుణ్యాత్ముల విలాస ప్రదేశాలు. అక్కడ ఆకలిదప్పులుగాని, అలుపుసొలుపుగాని, చలి వేసవి తాపాలుగాని, మరె లాంటి ప్రమాదాలుగాని ఉండవు. అక్కడ అశుద్ధమైన నీచమైన వస్తువు ఏదీలేదు. అన్నివిధాలుగా సుఖమైనది. అక్కడ సువాసనతో కూడిన గాలులు వీస్తుంటాయి. అక్కడి పాటలు వీనులకు విందుగా, హృదయాలను రంజింప జేసేవిగా ఉంటాయి. అక్కడ దుఃఖంగాని, వృద్ధాప్యంగాని, శ్రమగాని, బాధ గాని ఉండవు. ఈ లోకం సత్కర్మలకు ఫలితంగా లభించేది. తమ కర్మలకు ప్రతిగా మనుషులు ఇక్కడ జన్మిస్తారు. ఇక్కడ పుట్టే ప్రతి మనిషి శరీరం అతని కర్మలకు అనుగుణంగా తేజోమయంగా ఉంటుంది. తల్లిదండ్రుల వల్ల వారక్కడ పుట్టరు. వారికి చెమట, దుర్వాసన, మలమూత్రాలు ఉండవు. వారి వస్త్రాలు దుమ్ముధూళితో మాసిపోవు. వారి సువాసనలు వెదజల్లే అందమైన పూమాలలు ఎప్పుడూ వాడవు..... ఈర్ష్యా ద్వేషాలు, బాధలు, అలుపు వారి దగ్గరికే రావు." (మహాభారతం: అరణ్యపర్వం-261:9-16)

"బలులిచ్చేవాడు, దానిప్రతిఫలం, బహుమానాల వల్ల స్వర్గంలో నెయ్యి తో నిండిన సెలయేళ్ళను, తన కోరికలను పొందుతాడు." (అధర్వణ వేదం: 18-4-5)

"ఓ కుంతీకుమారా! నీవు గనక యుద్ధంలో హతుడవైతే స్వర్గం పొందుతావు, జయిస్తే భూమిని ఏలుతావు." (భగవద్గీత: 2:37)

"మాతృసేవ వల్ల ఈ లోకాన్ని, పితృసేవ వల్ల మధ్యలోకాన్ని, గురుసేవ వల్ల స్వర్గాన్ని పొందుతాడు." (మనుశాస్త్రం: 2-212)

"పరోపకారం చేసేవాడు స్వర్గానికి వెడతాడు; పరులను పీడించేవాడు నరకానికి వెడతాడు." (వ్యాస మహాముని ఉవాచ)

"ఆ లోకాలు సూర్యుడులేని లోకాలు. ఎల్లెడలా అంధకారం వ్యాపించి ఉంటుంది. అందులో ఆత్మహత్యలకు పాల్పడేవారు ప్రవేశిస్తారు." (యజుర్వేదం: 40-2)

పురాణాల్లో, ముఖ్యంగా విష్ణుపురాణం (2-6-1 నుండి 29), శ్రీమద్ భాగవతం (5-6-1 నుండి 37)లో నరకం గురించిన వివరాలు లభిస్తాయి.

"అగమ్య' స్త్రీ లేక పురుషునితో సంభోగించేవారిని కొరడాలతో కొడుతూ 'తప్తసర్మి' అనే నరకంలోకి తీసికెళ్ళి పడవేస్తారు. తర్వాత ఎర్రగా కాలుతున్న ఇనుపవిగ్రహాలకు వారిని కట్టిపడేస్తారు. అక్కడ వారు కాలుతుంటారు..."

"ఏ రాజులు లేక రాజప్రతినిధులైతే ధర్మాన్ని, ఆరాధనాలయాలను, ఇతర ప్రదేశాలను నాశనం చేస్తారో వారు అశుద్ధం, మలమూత్రాలు, రక్తం, వెంట్రుకలు, కొవ్వు, గోళ్ళు, ఎముకలతో నిండిన 'వైతరణి' నదిలో మునకలేస్తారు...."

"ఎవరైతే తప్పుడు సాక్ష్యం ఇస్తారో వారు 'అవీచి' అనే నరకంలో నూరు యోజనాల ఎత్తు గల కొండపై నుండి పడవేయబడతారు."

"ఏ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు లేక వారి స్త్రీలయినా ఎలాంటి జంకులేకుండా మద్యాన్ని సేవిస్తారో వారిని 'అయఃపానం' అనే నరకంలో పడవేసి వారి నోటిలో కరిగిన ఇనుప రసం పోస్తారు యమదూతలు...."

"ఎవరైతే ధనగర్వంతో ధనం అయిపోతుందన్న బెంగతో దురాశాపరుడై దయ్యంలా కూడబెడతాడో, ఖర్చుపెట్టకుండా, దానం చేయకుండా ఉంటాడో అతడు 'సూచీముఖ' అనే నరకంలో పడతాడు. అక్కడ యమదూతలు అతణ్ణి సూదులతో పొడుస్తుంటారు."

"కాంతితో ధగధగలాడే యమరాజపురం, అప్సరసలతో, గాయకులతో నిండి ఉంది. అక్కడ 84లక్షల నరకాలున్నాయి."(గరుడపురాణం: ప్రేతకల్పం: 4:19)



హిందువుల్లో, ఎనభైనాలుగు లక్షల దేహాలు ఉన్నాయని, పునర్జన్మ కారణంగా ఆత్మ ఆ ఎనభైనాల్గు లక్షల దేహాల్లోను ప్రవేశిస్తుందనే భావన ఉంది. కాని పై మంత్రంలో వాటిని ఎనభైనాలుగు లక్షల నరకాలుగా చెప్పబడింది. గరుడ పురాణం- ప్రేతకల్పం- 5:20లో ఈ ఎనభై నాల్గు లక్షల నరకాల ప్రస్తావన వచ్చింది. వాటిలో ఇరవై ఒక్క నరకాలు మాత్రం అత్యంత భయంకరమైన నరకాలుగా వర్ణించబడ్డాయి.

"నాది, నేను అనే అహంకారంతో ఇతరుల ఎడల ఎవరయితే అసూయ అవలంబించి, మోసం దగాలతో తన కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడో, అతడు చనిపోయిన తరువాత తన దుష్కర్మలకు ఫలితంగా నరకంలో పడిపోతాడు." (దేవీ భాగవతం: 8:8-9)

మరణానంతర జీవితం గురించి హిందూమత గ్రంథాల దృక్పథం పరలోక వాదమేనని ఈ వివరాలను బట్టి స్పష్టమవుతోంది. సత్యవాదులు సతతం పరలోకం వైపునకే పిలుపునిచ్చారన్న ఖుర్ఆన్ వాదనతో ఈ దృక్పథం పూర్తిగా ఏకీభవిస్తోంది. అంతిమ దైవగ్రంథమయిన ఖుర్ఆన్ ప్రకారం ఈ ప్రపంచం ఏదో ఓరోజు అంతమై పోయేదే. పరలోకం మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. పరలోకంలో మానవులు రెండు వర్గాలుగా విడిపోతారు. ఆ రెండు వర్గాలలో ఒక వర్గం స్వర్గంలో ప్రవేశిస్తే రెండోవర్గం అగ్నికీలల్లో పడిపోతుంది. మనిషి ఏ వర్గంలో చేరదలిచాడో ఆలోచించి నిర్ణయించుకోవలసిన సమయమిది.

## 15. ఆరాధనలు

గత పేరాలలో మనం అయిదు మౌలిక విశ్వాసాలను గురించి తెలుసుకున్నాం. ఈ అయిదు విషయాలను విశ్వసించగానే మనిషి ముస్లిం సముదాయంలో ప్రవేశిస్తాడు. అయితే కేవలం విశ్వాసం వల్ల పరిపూర్ణ ముస్లిం కాలేడు. దేవుణ్ని, దైవప్రవక్త (సల్లం)ను విశ్వసించగానే మనిషి విధేయత చూపడం అతని విధ్యుక్త ధర్మమవుతుంది. అంటే అతను దైవప్రవక్త (సల్లం) దేవుని తరపున ఇచ్చే ఆజ్ఞలను తప్పకుండా పాటించాలన్న మాట. అప్పుడే అతను దేవుని దృష్టిలో సంపూర్ణ ముస్లింగా పరిగణించబడతాడు.

"దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (ఖుర్ఆన్–59:7)

ఈ ఆజ్ఞలకు మూలాధారాలు దైవగ్రంథం (ఖుర్ఆన్), దైవప్రవక్త (స) సంప్రదయాలే (హదీసులే). జీవితంలోని ఏ రంగంలో ఏపని చేసినా ఈ రెండిటి వెలుగులోనే చేయాలి. ఈ రెండిటి ప్రాముఖ్యం, ఆవశ్యకతలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు:

"నేను మీదగ్గర రెండువస్తువులు వదలివెళ్తున్నాను. వాటిని గట్టిగా పట్టుకొని (ఆచరిస్తూ) ఉన్నంత కాలం మీరెన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్ఆన్). రెండు, నా సంప్రదాయాలు (హదీస్)." (ముఅత్తా)

ఈ రెండిటి ఆజ్ఞలను పాటించడమే నిజమైన దైవారాధన అవుతుంది. దేవుడు ఖుర్ఆన్‌లో ఇలా ఆదేశించాడు:"నేను మానవుల్ని, జిన్నుల్ని నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించలేదు." (51:56)

పై సూక్తిలో మానవుని జీవిత పరమార్థం ఏమిటో స్పష్టంగా తెలియజేయబడింది. అదే ఆరాధన. ఇందులో రెండర్థాలు ఇమిడిఉన్నాయి. ఒకటి, దేవుడ్నితప్ప మరెవరినీ ఆరాధించకూడదు. రెండు, దైవారాధన తప్ప మరే పనీ చేయకూడదు. మొదటిది అందరికీ అర్థమవుతోంది. కాని రెండో విషయమే నేడు అనేకమంది ముస్లింల క్కూడా అర్థంకావడం లేదు.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృతభావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబాయాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబజీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థికలావాదేవీలు, దేశపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవజీవితంలోని సకలరంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయనప్రవక్త (స) అందజేసిన ఆదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.



ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా ఒక్క విశ్వప్రభువుని మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవితవ్యవహారాలు సాగించాలన్నమాట.

ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేసినా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా, ఎంతధ్యానం చేస్తున్నా- దైనందిన వ్యవహారాల్లో దైవేతరశక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట. ఈవైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది. కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోవడానికో లేక అజ్ఞానం వల్లనో "ఇవి మతవిషయాలు, అవి ప్రపంచవ్యవహారాల"ని వాదిస్తారు. కాని ప్రపంచవ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త (స) హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించడం లేదు.

ఇదీ ఇస్లామీయ ఆరాధనకున్న సరైన, సమగ్రభావం. ఈభావం దృష్ట్యా ఏ ముస్లిం ఖుర్ఆన్, హదీసుల ఆజ్ఞల్ని ఏమేరకు ఆచరించడో ఆ మేరకు ఇస్లాంపట్ల అతని విశ్వాసం క్షీణించిపోయినట్లే. అలాగే ఏముస్లిం ఖుర్ఆన్, హదీసుల ఆజ్ఞలకు వ్యతిరేకంగా నడచుకుంటాడో ఆ మేరకు అతని ఇస్లాంపరిధి కుంచించుకుపోతున్నట్లేనని గ్రహించాలి. ఖుర్ఆన్, హదీసుల ఆజ్ఞలేమిటో తెలియకపోతే తెలుసుకోవడం ప్రతి ముస్లిం కర్తవ్యం. తెలిసి కూడా వాటిని అతిక్రమించడం శిక్షార్హమైన నేరం అవుతుంది.

దేవుడు తన దాసుడ్ని పరిపూర్ణ మానవత్వం ఉన్న మనిషిగా తీర్చిదిద్దదలచాడు. ఈ లక్ష్యం నెరవేరాలంటే దాసుడు దేవునికి పూర్తిగా అంకితమై దైవదాస్యం చేస్తుండాలి. మానవత్వం అంటే ఏమిటీ? నీతి-నిజాయితి, సత్యం-ధర్మం, న్యాయం-నిష్పక్షపాతం, దయ-సానుభూతి, శాంతి-సహనం, విశాలహృదయం-క్షమాగుణం, దాతృత్వం-ధర్మపరాయణత, పరోపకారం-త్యాగనిరతి, మృదుభాషణ-కలుపుగోలుతనం, అణుకువ-నిరాడంబరత, జనసేవ-భూతదయ, సక్రమసంపాదన-దానిసద్వినియోగం, సఖ్యత-

సౌభ్రాతృత్వాలు కలిగివుండటమే కదా మానవత్వం అంటే! మరో మాటలో మానవత్వమంటే మానవసేవే. అంటే దాసులసేవ. దాసుల సేవే దైవసేవ.

ఈ సద్గుణాలన్నీ ఉండి పూర్తి నిస్వార్థంతో కేవలం దైవప్రసన్నత కోసం పనిచేయడమే అసలైన దైవారాధన, దైవదాస్యం అవుతుంది. అసలైన ఈ దైవారాధన కోసం దాసుల్ని సమాయత్తపరచడానికి, సరైనశిక్షణ ఇవ్వడానికి దేవుడు కొన్నివిధులు నిర్దేశించాడు. వాటిలో నమాజ్ (ప్రార్థనావ్యవస్థ) మొట్టమొదటి విధిగా నిర్ణయించాడు.

ఇస్లాం భవనం అయిదు మూల స్తంభాలపై ఆధారపడి ఉంది. ఒక హదీస్‌లో దైవదూత జిబ్రీల్ (అలైహి) 'ఇస్లాం అంటే ఏమిట'ని అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"ఇస్లాం అంటే అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆ దేవుని ప్రవక్త అని నీవు సాక్ష్యం చెప్పడం, నమాజ్ చేయడం, (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లించడం, రమజాన్‌నెల ఉపవాసాలు పాటించడం, శక్తి ఉంటే హజ్‌యాత్ర జరపడం." (బుఖారి, ముస్లిం)

## నమాజ్

దైవారాధనల్లో నమాజ్ ఎంతో ముఖ్యమైన ఆరాధన. ఇస్లాం సౌధానికి ఉన్న అయిదు మూల స్తంభాలలో 'సద్వచనం' (కలిమా తయ్యిబా) సెంట్రల్ పిల్లర్ అయితే, మిగిలిన నాలుగు దిశల నాలుగు మూలస్తంభాలలో ముఖ్యమైన మూలస్తంభం నమాజే. అలాంటి నమాజ్‌ని వదిలేస్తే ఇక ఆ సౌధం ఎంతో కాలం మనజాలదు. నిజదైవాన్ని గుర్తించి, ఇస్లాంను విశ్వసించిన తర్వాత దాని క్రియాత్మక రూపంలోని మొట్టమొదటి అంశం నమాజే. ఈ విషయాన్ని ఖుర్ఆన్ కూడా సమర్థిస్తోంది.

"నేనే దేవుడ్ని, నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక నీవు నన్నే ఆరాధించు. నన్ను స్మరించడానికి నమాజ్ స్థాపించు." (ఖుర్ఆన్-20:14)

దైవప్రవక్త (స) నమాజ్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఇలా అన్నారు:

"విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరిని వేరుచేసే హద్దు నమాజే." (ముస్లిం)



"నమాజ్ చేయనివాడికి నమాజ్ వెలుగు నివ్వడంగాని, ప్రమాణంగా నిలవడం గాని, మోక్షప్రదాయిని కావడం గాని జరగదు." (అహ్మద్, దారిమి)

ప్రజాసేవ చేయడానికి, సద్గుణాలు అలవరచుకోవడానికి, మానవత్వం సంతరించుకోవడానికి 'నమాజ్' చేయడం అంత ముఖ్యమా? అసలు నమాజ్‌లో ఏముందని? రోజూ నమాజ్‌లో కొన్ని ఖుర్ఆన్ సూక్తులు వల్లించినంత మాత్రాన మనిషిలోని మృగత్వం పోయి మానవత్వం వచ్చేస్తుందా? వస్తుందనే చెబుతోంది అంతిమ దైవగ్రంథం.

"నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." (ఖుర్ఆన్-29:45)

ఒక మనిషి నమాజు చేసేవాడైనప్పటికీ అశ్లీలచేష్టలకు, ఇతర చెడ్డ పనులకు పాల్పడుతున్నాడంటే అతను ఖుర్ఆన్‌లోని దైవాజ్ఞలను నిర్లక్ష్యం చేస్తున్నాడన్నమాట. లేదా దైవధర్మం పట్ల సరైన అవగాహన లేకుండా దేవుని దయాగుణంపట్ల నిరాధారమైన ఆశలు కల్పించుకున్నాడన్న మాట. ఈసూక్తి విషయంలో దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"మనిషి చేసే నమాజ్ అతడ్ని చెడ్డపనుల నుండి, అశ్లీలచేష్టల నుండి నిరోధించకపోతే అతని నమాజ్ నమాజే కాదు..." (ఇబ్నె ముస్లిం)

"ఒకవ్యక్తి చేసే నమాజ్ అతడ్ని అశ్లీలచేష్టల నుండి, చెడ్డపనుల నుండి, నిరోధించకపోతే అతని నమాజ్ అతడ్ని దేవునికి మరింత దూరం చేస్తుంది." (తబ్రాని)

ఇమామ్ జాఫర్ సాదిఖ్ వ్యాఖ్య: "ఎవరైనా తన నమాజ్ స్వీకరించబడిందా లేదా అని తెలుసుకోదలిస్తే, అతను తన నమాజ్ తనను ఏ మేరకు చెడ్డపనులు, అశ్లీలచేష్టల జోలికిపోనీకుండా నిరోధించిందో చూసుకోవాలి. నమాజ్ వల్ల అతను చెడ్డపనుల జోలికి పోకుండా నీతిగా ఉన్నాడంటే అతని నమాజ్ స్వీకరించబడినట్లే." (రూహుల్ మాని)

నమాజ్‌లో మనిషి ఏం చదువుతాడు? ఖుర్ఆనే కదా! ఖుర్ఆన్‌లో ఏమున్నాయి? మానవుని జీవిత సమస్తరంగాల్లో అతనికి మార్గదర్శనం

చేసే దైవాజ్ఞలున్నాయి. దేవునికి, దాసునికి ఉండాల్సిన వాస్తవ సంబంధం, పరలోకంలో కర్మవిచారణ, జవాబుదారిభావన, తోటిమానవుల హక్కులు, తల్లిదండ్రుల హక్కులు, భార్యభర్తల అనుబంధం, వారి సమస్యలు, స్త్రీ స్థానం, సంతానశిక్షణ, ఇరుగుపొరుగు సంబంధాలు, సామాజికసమస్యలు, ఆర్థికసూత్రాలు, నైతికనియమాలు, రాజ్యపాలనా విధానం వగైరా మనిషిని మానవుడిగా, నీతిమంతుడిగా తీర్చిదిద్దే విషయాలే ఉన్నాయి.

రోజుకు అయిదు పూటలు చేసే నమాజ్ మనిషికి ఈ విషయాలు మాటిమాటికి గుర్తుచేస్తూ అతడ్ని సుశిక్షుడ్ని చేస్తాయి. అయితే ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే అందులోని బోధనలను ఆచరించ డానికి వీలవుతుంది. రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయాలని ఇవ్వబడిన దైవాజ్ఞ వెనుక 'నమాజులో మనిషి పఠించే సూక్తుల్ని ఆచరణలో పెట్టాలన్న' లక్ష్యమే ఉంది. ఈలక్ష్యం ఉండటం వల్లనే "నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." అని ఖుర్ఆన్ పేర్కొంటున్నది. (29:45)

నమాజులో పఠించే ఖుర్ఆన్ సూక్తులు అర్థం చేసుకున్నప్పుడే నమాజ్ మనిషిని చెడులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది. ఖుర్ఆన్ భాష అరబీ అర్థం కానప్పుడు వేరే సమయాల్లో ప్రతిరోజూ దాని అనువాదాన్ని తనకు తెలిసిన భాషలోనయినా ఏకాగ్రతగా చదువుతూ ఉండాలి. ఇలా ఒక విషయాన్ని మాటిమాటికి చదవడం వల్ల అది అతడ్ని ఆచరణ వైపు ప్రేరేపిస్తుందని ఆశించగలం.

ధర్మానికి ఆధారం విశ్వాసం (ఈమాన్) అయితే, విశ్వాసానికి దర్పణం ఆచరణ అవుతుంది. ఆచరణ ద్వారానే మనిషిలోని విశ్వాసం బహిర్గత మవుతుంది. దేవుణ్ణి, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసించామని చెప్పుకునే ముస్లింలు దేవుని ఆజ్ఞలను, ఆయన ప్రవక్త ప్రవచనాలను పాటిస్తున్నప్పుడే వారి విశ్వాసానికి దేవుని దగ్గర గుర్తింపు లభిస్తుంది. ఇస్లాం సౌధానికుండే అయిదు మూల స్తంభాలలో విశ్వాసం తర్వాత నమాజ్ అగ్రస్థానం వహిస్తుంది. అలాంటి నమాజ్‌నే పాటించకపోతే దేవుని దగ్గర ముస్లింల



విశ్వాసానికి ఇక విలువ ఏముంటుంది? వారికి పరలోకంలో పశ్చాత్తాపం తప్ప మిగిలేదేముంది?

ఒక వ్యక్తి దేవుణ్ణి, దైవప్రవక్త (స)ను విశ్వసించానని ప్రకటించిన తర్వాత అతని విశ్వాస ప్రకటనకు ఎదురయ్యే మొట్టమొదటి పరీక్ష నమాజే. మస్జిద్ నుంచి అజాన్ పిలుపు వినగానే అతను ఇస్లాం పట్ల తన విశ్వాసప్రకటనను నిరూపించుకోవడానికి మస్జిద్‌కు పరుగెత్తి తోటి విశ్వాసులతో కలసి సామూహిక నమాజ్ చేయాలి. సామూహిక నమాజ్ మనిషిలో సమైక్యత, సోదరభావాలను పెంపొందిస్తుంది.

## జకాత్ (పేదలి ఆర్థిక హక్కు)

ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్‌ల తరువాత 'జకాత్' మూడవ మూలస్తంభంగా ఆరాధనా విధుల్లో రెండవ విధిగా పరిగణించబడింది. ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల నమాజ్‌తో పాటు జకాత్ ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తుంది. ఖుర్ఆన్ అనేకచోట్ల నమాజ్, జకాత్‌లను గురించే ఎక్కువ ప్రస్తావించడం గమనిస్తే, మొత్తం దైవారాధనల్లో ఇవే అతిముఖ్య ఆరాధనలని మనం గ్రహించగలం. ఖుర్ఆన్‌లోని సూక్తులు చదవండి:

"(సత్యాన్ని) విశ్వసించి సదాచార సంపన్నులయి నమాజు (విధి) నిర్వహిస్తూ, (పేదల ఆర్థికహక్కయిన) జకాత్‌ను నెరవేరుస్తూ ఉండేవారికి వారిప్రతిఫలం వారిప్రభువు వద్ద సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (2:277)

"వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశించవచ్చు." (9:18)

"విశ్వసించిన స్త్రీలు, పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభి లాషులు. వారు (ప్రజలకు) మంచివిషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ)ను స్థాపిస్తారు. జకాత్ నెరవేరుస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయ విధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది." (ఖుర్ఆన్-9:71)

ఇస్లాం మానవులపై ముఖ్యంగా రెండురకాల బాధ్యతలు మోపుతోంది. 1-దేవునిహక్కులు, 2-దాసులహక్కులు. నమాజ్ మనిషిని దేవునిహక్కులు నెరవేర్చేందుకు సమాయత్తపరుస్తుంది. జకాత్ దాసులహక్కులు నెరవేర్చ డం గురించిన బాధ్యతాభావాన్ని జనింపజేస్తుంది. ఖుర్ఆన్‌లో అనేకచోట్ల 'విశ్వాసం' తర్వాత ఈరెండిటినే ప్రస్తావించి, ఇవే మొత్తంధర్మానికి ముఖ్య ప్రాతిపదికలన్న భావాన్ని స్ఫురింపజేస్తుంది. బహుదైవారాధకులు గనక ఇస్లాం స్వీకరించి నమాజ్, జకాత్ ఆజ్ఞలు పాటిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారని ఖుర్ఆన్ ముస్లింలకు తెలుపుతోంది.

జకాత్ చెల్లించనివారు రుజుమార్గం పొందలేరని, ఒకవేళ రుజుమార్గం ప్రాప్తమైనా అందులో వారు స్థిరంగా ఉండలేరని ఖుర్ఆన్ బోధనలు స్పష్టంచేస్తున్నాయి. అలాంటి వారు అవిశ్వాసులు, బహుదైవారాధకులని గుర్తించబడటానికి వారు జకాత్ చెల్లించక పోవడమే పెద్ద నిదర్శనమని ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా తెలుస్తుంది.

"పరలోకాన్ని తిరస్కరించి జకాత్ (విధి) నెరవేర్చని బహుదైవారాధకులకు వినాశం (రాసిపెట్టి) ఉంది." (ఖుర్ఆన్-41:6,7)

దేవుడు మానవునికి ఈ లోకంలో అనేకరకాల సంపదలు ప్రసాదిం చాడు. అందుకతను దేవునికి కృతజ్ఞుడై ఉండటంతో పాటు, ఆ సంపదలో కొంతభాగం నిరుపేదలక్కూడా అందజేయాలి. స్తోమత కలిగినవారు తమ ధన కనక వస్తు పశుసంపదల నుండి ప్రతిఏడూ రెండున్నర శాతం చొప్పన తీసి పేదలకు దానం చేయాలి. దీన్ని 'జకాత్' అంటారు.

అంతేకాకుండా వారు ధాన్యం, అపరాలు, పండ్లు, కూరగాయలు తదితర భూఉత్పత్తుల నుండి కూడా జకాత్ తీయవలసి ఉంటుంది. దీన్ని 'ఉష్ర్' అంటారు. అయితే ఉష్ర్ యేడాదికి ఒకసారి మాత్రమే గాక, సంవత్సరానికి ఎన్నిసార్లు పండిస్తే అన్నిసార్లు తీసి పేదలకు దానం చేయాలి. వర్షం వల్ల పండే పంట నుండి పది శాతం, ఖర్చుతో కూడిన నీటిపారుదల సౌకర్యం వల్ల పండే పంట నుండి అయిదు శాతం చొప్పన ఉష్ర్ తీసి పేదలకు విధిగా అందజేయాలి.



"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేల నుండి మీకోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైవమార్గంలో ఖర్చు చేయండి." (2:267); "పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (ఖుర్ఆన్-6:141)

ముస్లింలకు నమాజ్ చేయడం ఎంత విధియో జకాత్ చెల్లించడం కూడా అంతే విధి. జకాత్ చెల్లించని వ్యక్తి పాలిట అతని డబ్బు పరలోకం లో విషసర్పంగా మారుతుందని; అతను చేసే నమాజ్‌ని దేవుడు స్వీకరిం చడని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) స్పష్టంగా తెలియజేశారు.

"వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారు లకు దుర్భరయాతన కాచుకొని ఉందని శుభవార్త విన్పించు! ఆ వెండి బంగారాలనే నరకాగ్నిలో బాగాకాల్చి వారి నుదుళ్ళపై, పక్కలపై, వీపులపై వాతలుపెట్టే రోజు వస్తుంది. 'ఇవే మీరు కూడబెట్టుకున్న సిరిసంపదలు, ఇక వీటిని చవి చూడండి' (అని అప్పుడు వారికి చెప్పబడుతుంది)." (ఖుర్ఆన్-9:34,35)

అంతిమ దైవప్రవక్త (స)కు పూర్వం గతప్రవక్తల అనుచరులకు కూడా నమాజ్ స్థాపనతో పాటు జకాత్ చెల్లింపు విధించబడింది.

"గ్రంథప్రజల దగ్గరకు (రుజుమార్గానికి సంబంధించిన) స్పష్టమైన బోధనలు వచ్చిన తరువాతే వారిలో విభేదాలు ఏర్పడ్డాయి. (తమ) జీవన విధానాన్ని దేవుని కోసం ప్రత్యేకించి ఏకాగ్రచిత్తులై ఆయన్నే ఆరాధించాలని, ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలని, (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలని, అదే సత్యధర్మమని మాత్రమే వారికి ఆదేశించబడింది." (98:4,5)

మూసా ప్రవక్త (అలై) అనుచరసమాజానిక్కూడా ఇది విధించబడింది. కాని యూదులు పేదలకు జకాత్ ఇవ్వడానికి బదులు, వారి నుండి వడ్డీ వసూలుచేయసాగారు. వారికివ్వబడిన ఆదేశం ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పండి. జకాత్) చెల్లిస్తూ ఉండండి. నాముందు మోకరిల్లేవారితో పాటు మీరు కూడా నాముందు మోకరిల్లండి." (2:43)

జకాత్ వ్యవస్థ ద్వారా ఇస్లాం ముస్లింల హృదయాల నుంచి ప్రాపంచిక వ్యామోహాన్ని, దాని విషవృక్షాలను నిర్మూలించి స్వచ్ఛమైన దైవప్రేమను జనింపజేయదలిచింది. ముస్లింలు కేవలం జకాత్ చెల్లించడంతోనే తృప్తి చెందకుండా, దాని అసలు ఉద్దేశాన్ని గ్రహించి తదనుగుణంగా నడచుకున్నప్పుడే ఈ లక్ష్యం నెరవేరుతుంది.

మనదగ్గర ఉన్నదంతా నిజానికి దేవుడు ప్రసాదించినదే. దాన్ని ఆయన చూపే మార్గంలో, ఆయన ఆదేశించిన రీతిలో సద్వినియోగం చేసినప్పుడే మనం ఆయన ప్రసన్నత పొందగలము. ఈ భావనలేని ముస్లిం తన తోటిదైవదాసుల్ని చిత్తశుద్ధితో, కేవలం దైవప్రసన్నత కోసం ప్రేమించ లేడు. అలాంటి ముస్లిం దేవుని హక్కుల్ని కూడా మనస్ఫూర్తిగా నెరవేర్చలేడు.

జకాత్ వ్యవస్థ వాస్తవానికి సమాజంలో ప్రజలకు ఆర్థిక న్యాయాన్ని చేకూర్చే అపురూప సాధనం. ఇది ప్రజల హృదయాల నుండి స్వార్థం, సంకుచితత్వం, పిసినారితనం, అసూయ, ద్వేషం, కాఠిన్యత, దోపిడి లాంటి చెడుభావాలను తీసేసి వాటి స్థానంలో ప్రేమ, పరోపకారం, త్యాగం, సానుభూతి, శ్రేయోభిలాష, సహకారం, స్నేహశీలత, చిత్తశుద్ధి, ఔదార్యం వంటి సద్భావాలను పెంపొందింపజేస్తుంది.

జకాత్ ప్రభుత్వాలు తమ ప్రజలపై విధించే పన్ను లాంటిది కాదు. ఇదొక ధన సంబంధమైన దైవారాధన. జకాత్‌వ్యవస్థ వల్ల వ్యక్తికి, సమాజానికి అత్యున్నత నైతికత, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఒనగూడుతాయి. అయితే ధనసంబంధమైన ఈ దైవారాధనకు, పన్నుకు మధ్యఉండే మౌలిక వ్యత్యాసాన్ని దృష్టిలోపెట్టుకొని, జకాత్‌ని దైవారాధనగా భావిస్తూ చెల్లిస్తున్నప్పుడే ఈ నైతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు లభిస్తాయి.

హజ్రత్ అమ్ర్ బిన్ అబస (రజి) ఉల్లేఖనం: నేను దైవప్రవక్త (స)ను "ఇస్లాం అంటే ఏమిట"ని అడిగాను. దానికి ఆయన "మంచి మాటలు చెప్పడం, (పేదవాడికి) అన్నం పెట్టడం" అని చెప్పారు. నేను మళ్ళీ "విశ్వాసం అంటే ఏమిట"ని అడిగాను. దానికి ఆయన "సహనం వహించడం, దానం చేయడం" అని అన్నారు. (అహ్మద్- మిష్కాత్)



దీన్నిబట్టి ఇస్లాం శారీరక ఆరాధనలతో పాటు ధనసంబంధమైన ఆరాధనలకు ముఖ్యంగా జకాత్‌కు ఎంతోప్రాముఖ్యం ఇస్తుందని తెలుస్తోంది. మనిషికున్న సంపదలో తనకంటే దిగువ స్థాయిలో ఉండే పేదవాడికి ఎంతో కొంత హక్కు తప్పనిసరిగా ఉంటుంది. ఇక్కడ్నుంచే ఇస్లామీయ అర్థశాస్త్రానికి పునాదులు ప్రారంభమవుతాయి.

"దైవమార్గంలో ఖర్చుపెట్టండి. (అంటే సత్కార్యాల కోసం సంపద వినియోగించండి.) చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి." (ఖుర్ఆన్–2:195)

## రమజాన్ ఉపవాసాలు

దైవారాధన విధుల్లో నమాజ్ తర్వాత రమజాన్ రోజాలు రెండవ స్థానం ఆక్రమించుకుంటాయి. మానవుని పుట్టుక లక్ష్యం దైవాన్ని ఆరాధించడమేనని ఖుర్ఆన్ పేర్కొంటున్నది. మనిషి తన దైనందిన జీవితంలో పూర్తిగా దైవాజ్ఞలను పాటించడం ద్వారా అతని జీవితమంతా దైవారాధనే అవుతుంది. అసలయిన ఈ దైవారాధన కోసం నమాజ్, రోజా, జకాత్, హజ్, ఆరాధనలు మనిషిని సుశిక్షితుడ్ని చేస్తాయి. ఏ విధంగా నమాజ్ అందులో పఠించే ఖుర్ఆన్ ద్వారా మనిషికి దైవాదేశాలకు అనుగుణంగా జీవితం గడపటానికి నిరంతరం శిక్షణనిస్తుందో, అదేవిధంగా ఉపవాసం కూడా మనిషిలో ఆత్మ నిగ్రహం, సహనం, స్థయిర్యం, దైవభీతి పెంపొందే శిక్షణనిస్తుంది.

దైవభీతి, ధార్మికస్పృహ ఉన్న ప్రతిముస్లిం రమజాన్ నెలవంక చూడగానే ఉపవాసాలు పాటించడానికి సిద్ధమవుతాడు. అది విశ్వప్రభువు నుండి అతనిపై మోపబడిన విధి. ఉపవాస వ్రతం ప్రతియుగంలోనూ దైవప్రవక్తల ద్వారా విశ్వాసులకు విధిగా నిర్ణయించబడుతూ వచ్చింది. ఖుర్ఆన్ ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇలా వివరించింది:

"విశ్వాసులారా! గతప్రవక్తల అనుయాయులకు ఏవిధంగా ఉపవాసాలు విధించబడ్డాయో అదేవిధంగా మీరు కూడా ఉపవాసాలు పాటించాలని నిర్ణయించాం. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది." (2:183)

దైవంపట్ల భయభక్తులు ఉన్నప్పుడే మనిషి చెడును వదలి మంచిని స్వీకరిస్తాడు. రమజాన్‌లో ప్రత్యేక దైవభీతి కలగడానికి కారణమయ్యే

ఉపవాసవ్రతాన్ని అరబీలో 'సౌమ్' అంటారు. సౌమ్ అంటే చేస్తున్న పని నుండి ఆగిపోవడం. దాన్ని విడనాడటం అని అర్థం. షరీఅత్ పరిభాషలో వేకువజాము నుండి సూర్యాస్తమయం వరకు తినడం, త్రాగడం, సంభోగించడం వంటి అవసరాలను మానుకోవడాన్నే 'సౌమ్' అంటారు.

ప్రతి మనిషీ తర కర్మలకు పరలోకంలో దేవుని ముందు సమాధానం ఇచ్చుకోవలసి ఉంది. వాటి ప్రకారం ప్రతిఫలం అనుభవించవలసి వస్తుంది. విశ్వాసి మదిలో నిరంతరం మెదిలే ఈ భావనే దైవభీతి. సరైన దైవభీతి ఉన్న మనిషి చెడులకు, పాపాలకు, దూరంగాఉంటూ సదాచార సంపన్నుడై సదా పవిత్రజీవితం గడుపుతాడు. రమజాన్ నెల ప్రారంభంకాగానే దైవాజ్ఞ, ప్రవక్త హితవుల ప్రకారం అతను ఉపవాసవ్రతాలు కూడా పాటిస్తాడు.

పైసూక్తిలో రమజాన్ ఉపవాసాల లక్ష్యం 'దైవభీతి' అని తెలియ జేయబడింది. అంటే రమజాన్ నెలంతా పాటించే ఉపవాసాలు మనిషిలో దైవభీతిని జనింపజేసే, దాన్ని పటిష్ఠవంతం చేసే శిక్షణ ఇస్తాయన్న మాట.

సాధారణంగా నేరం చేసే మనిషి నేరం చేస్తున్నప్పుడు తనను శిక్షించే, తనకు వ్యతిరేకంగా సాక్షమిచ్చేవారు ఎవరైనా చూస్తున్నారా అని భావిస్తూ, అలాంటి వాళ్ళు ఎవరైనా లేరని నిర్ధారణ చేసుకున్నప్పుడే అతనా నేరానికి పాల్పడతాడు. అలాంటివాళ్ళు ఎవరైనా తనను చూస్తున్నారని పసికడ్తే మాత్రం నేరం చేయడానికి సాహసించలేడు. అయితే ఈ నేరభీతి ప్రపంచానికి సంబంధించిన నేరభీతి కంటే పరలోకానికి సంబంధించిన నేరభీతి తీవ్రంగా ఉంటుంది. పరలోకజవాబుదారీ విశ్వాసం కలిగిన ఇస్లాం ధర్మాన్ని దృఢంగా విశ్వసించిన మనిషి తనను మనుషులు ఎవరూ చూడక పోయినా, దేవుడు మాత్రం తప్పకుండా చూస్తున్నాడని నమ్ముతాడు. అంచేత నేరం చేయడానికి సాహసించలేడు. ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు చూడండి:

❀ "గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు." (2:233)

❀ "పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచు కోండి." (4:34)



❀ "వీరు తమ చేష్టల్ని ప్రజల కంటబడకుండా దాచగలరుగాని దేవుని కంటబడకుండా దాచలేరు...." (4:108)

❀ "వారు ఎంతో రహస్యంగా ఉంచామనుకున్న విషయాలు కూడా దేవునికి తెలుసు." (5:61)

❀ "ఆయన (మానవుల) హృదయాల్లో మెదిలే రహస్య విషయాలు సయితం ఎరిగివాడు." (8:43)

దైవభీతి పరాయణతను ఇస్లాం 'తఖ్వా' అంటుంది. అంటే భయము, భీతి అని శాబ్దికభావం. ఇక్కడ తఖ్వా అంటే దైవభీతి. సృష్టికర్త చేయమన్న పనులు చేయడం, ఆయన వారించిన పనులు మానేయడమే దైవభీతి పరాయణత. రమజాన్ ఉపవాసాల లక్ష్యం కూడా దైవభీతే. ఇస్లాంను కేవలం విశ్వసించినంతమాత్రాన ముస్లింల విశ్వాసం పరిపూర్ణమవదు. ఆచరణలేని విశ్వాసం నిరర్థకం అంటోంది ఇస్లాం. అందుకే దైవాజ్ఞల్ని పూర్తిగా పాటించని ముస్లింలను ఖుర్ఆన్ ఇలా హెచ్చరిస్తోంది:

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. (నిజమైన) ముస్లింలుగా వున్నస్థితిలో తప్ప చనిపోకండి." (3:102)

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతోశ్రేష్ఠమైనవి. ....మీరు విషయం గ్రహిస్తారని (ఇలా తెలుపుతున్నాం)". (7:26)

"హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు ప్రయాణసామగ్రి వెంట తీసి కెళ్ళండి. అన్నిటికంటే శ్రేష్ఠమయిన ప్రయాణ సామగ్రి దైవభీతే. కనుక విజ్ఞులారా! నా పట్ల భయభక్తులు కలిగివుండండి." (2:197)

'దైవభీతి' హృదయంలో జనించి ఆచరణలో వ్యక్యమయ్యే విషయం. విశ్వాసి మనసులో నిజంగా దైవభీతి ఉంటే దైవేతరుల ఆజ్ఞల సమక్షంలో దేవుని ఆజ్ఞల్ని మాత్రమే అతను పాటించాలి. వాటికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అతని దైవభీతి ఆచరణలో వ్యక్తం కాలేదన్న మాట. ఆచరణలో

వ్యక్తంకాని దైవభీతికి దేవుని దృష్టిలో ఎలాంటి విలువ ఉండదు. ఖుర్‌ఆన్ లో సృష్టికర్త తన దాసుల మేలు కోరి అనేక ఆదేశాలు, ఉపదేశాలిస్తూ ఆ వెనువెంటనే "దేవునికి భయపడండి, ఆయన మీ చర్యల్ని గమనిస్తున్నాడని తెలుసుకోండి' అని కూడా చెబుతున్నాడు.

అనేక ఆరాధనలలో ఉపవాసవ్రతానికి ఓ ప్రత్యేకత ఉంది. ఎలాంటి ప్రదర్శనాబుద్ధి లేకుండా కేవలం దేవుని ప్రసన్నత, ఆయన విధేయతలను కోరుకునే మనిషి మాత్రమే ఉపవాసం పాటించగల్గుతాడు. దీనిక్కారణం ఒక్కటే. ఇతర ఆరాధనల సంగతి నలుగురికీ తెలుస్తుంది. ప్రజల కంట బడకుండా వాటిని రహస్యంగా ఆచరిండం సాధ్యం కాదు. కాని ఫలానా వ్యక్తి ఉపవాసం ఉన్నాడా లేదా అనే సంగతి జనానికి తెలియదు. ఒకవేళ అతను ఎవరి కంటబడకుండా తింటూ, తాగుతూ నేను ఉపవాసం ఉన్నానని అంటే జనం నిజమే అనుకుంటారు.

ఒక వ్యక్తి సామూహిక నమాజ్ చేస్తుంటే అనేకమంది అతడ్ని చూస్తుంటారు. అయితే ఇక్కడ అతను దేవుని ప్రసన్నత కోసం గాకుండా ఇతరుల మెప్పు కోసమో లేదా మరేదైనా ప్రాపంచిక ప్రయోజనం ఆశించో నమాజ్ చేయవచ్చు. హజ్‌యాత్రలో తోటియాత్రికులు అతని వెంట ఉంటారు. అతను హజ్‌నియమాలు పాటిస్తుంటే వారు చూస్తారు. వారి దృష్టి నుండి అతను తప్పించుకోలేడు. జకాత్, ఇతర దానధర్మాల సంగతి చాలా మందికి తెలియకపోయినా వాటిని స్వీకరించేవారికి మాత్రం తెలుస్తుంది. అలాగే యుద్ధరంగంలో ముజాహిద్ చేసే పోరాటాన్ని ఎందరో చూస్తారు. ధర్మవేత్తలు తమ జ్ఞానసంపదను గుప్తంగా ఉంచలేరు. సంఘసేవ, ఇస్లామీయ పరిపాలనా కార్యకలాపాలు మొదలైన సత్కార్యాల పరిస్థితి కూడా ఇంతే. వాటిని ప్రజల దృష్టి పడకుండా ఆచరించడం కష్టం.

హాజీ అన్పించుకోవాలన్న లేదా మరేదైనా ప్రాపంచిక ప్రయోజనం పొందాలన్న ఉద్దేశ్యం ఒక వ్యక్తిని హజ్ చేయడానికి ప్రేరేపించవచ్చు. దాతగా ఖ్యాతిచెందాలన్న కోరిక జకాత్ ఇవ్వడానికి, దానధర్మాలు చేయడానికి పురిగొల్పవచ్చు. వీరాధివీరుడిగా జనంలో వెలిగిపోవాలన్న దుర్బుద్ధి గాని, సమరసొత్తు పొందాలన్న పేరాశగాని యుద్ధమైదానానికి గొనిపోవచ్చు. ప్రజల గౌరవాభిమానాలు-పేరుప్రఖ్యాతలు పొందవచ్చని భావించి మంచి రచనలు, ప్రసంగాలు చేయవచ్చు. ఇలా ఇతర అనేక సత్కార్యాల విషయంలోనూ ఇలాంటి దురుద్దేశ్యాలు, దుష్టసంకల్పాలు ఉండవచ్చు.



కాని ఉపవాస విషయం దీనికి భిన్నంగా ఉంది. మనిషి ఉపవాసం పాటిస్తున్న సంగతి దేవునికి తప్ప మరెవరికీ తెలియదు. ఎవరు ఉపవాసం ఉన్నారు, ఎవరు లేరు అనే విషయం దేవునికి మాత్రమే తెలుసు. అంచేత మనిషి కేవలం దైవప్రసన్నత కోసం ఉపవాసం పాటించవలసి ఉంటుంది. దైవప్రసన్నత, నరకశిక్ష నుండి విముక్తి కోరుకునే మనిషి మాత్రమే ఉపవాసం పాటించగలుగుతాడు.

ఉపవాసవ్రతం కేవలం దైవప్రసన్నత కోసం ఆచరించబడే దైవారాధన. కనుక ఇది మనిషి హృదయంలో దైవభీతి కలిగిస్తుంది. హృదయంలో ప్రదర్శనాభావం, పేరుప్రతిష్ఠల కోరికలు లేకుండా దాన్ని ప్రక్షాళనం చేస్తుంది. పరలోక జవాబుదారీ భావాన్ని జనింపజేస్తుంది. బాహ్య సంస్కరణకు ముందు అంతర్‌సంస్కరణ చేస్తుంది.

రమజాన్ మాసంలో నెల రోజులపాటు ఉపవాసాలు పాటించడం వల్ల మనిషి హృదయంలో దైవభీతి పరాయణత్వం వేళ్ళూనుతుంది. ఆ దైవభీతి పరాయణత జీవితంలోని వివిధరంగాల్లో బహిర్గతమవుతుంది. దాని ఫలపుష్పాలు కన్పించనారంభిస్తాయి. హృదయంలో దైవభీతి దృఢంగా నాటుకోబడిన వ్యక్తి రహస్యంగా కూడా పాపానికి పాల్పడలేడు. అతను అబద్ధమాడలేడు. నమ్మకద్రోహం చేయలేడు. దొంగతనం, మద్యపానం, వ్యభిచారం వంటి ఘోరనేరాలకు ఒడిగట్టలేడు.

తనను ఇతరులు చూస్తున్నా చూడకపోయినా దేవుడు మాత్రం గమనిస్తూనే ఉన్నాడన్న నమ్మకం అతని మనస్సులో నాటుకుంటుంది. దైవభీతి పరాయణత్వం అతడ్ని హెచ్చరిస్తూ "నీవు ఇహలోక చట్టం పట్టు నుండి తప్పించుకుంటే తప్పించుకో గలవుకాని, పరలోక శిక్ష నుండి మాత్రం ఎన్నటికీ తప్పించుకోలేవు" అని అంటుంది.

షైతాన్ ప్రయోగించే ఖడ్గం నుండి కాపాడుకోవడానికి ఉపవాసం మనిషికి డాలు వంటిది. దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ఉపవాసం డాలు వంటిది. మీలో ఎవరైనా ఉపవాసం పాటిస్తే అతను ఉపవాసంనోటితో అశ్లీలమైన పలుకులు పలకరాదు. అల్లరి పనులు చేయరాదు. ఇతరులెవరైనా తనను దూషించినా, తనతో జగడానికి దిగినా, తాను ఉపవాసం ఉన్నానని అతను గుర్తుంచుకోవాలి." (మిష్కాత్)

'(ఉపవాసముండి కూడా) అసత్యం పలకడాన్ని, అసత్యాన్ని ఆచరించడాన్ని మానివేయని వ్యక్తి ఆకలి దప్పులతో పడుండటం పట్ల దేవునికి ఏ మాత్రం ఆసక్తిలేదు" అన్నారు దైవప్రవక్త (స) ఒక సందర్భంలో." (బుఖారి)

మరొక సందర్భంలో "రోజా పాటించే ఎందరో వ్యక్తులకు తమ రోజా వ్రతం ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు" అన్నారు.

"ఉపవాసం పాటిస్తున్న ఇద్దరు వ్యక్తులు జుహర్, అస్ర్ నమాజులు చేశారు. వారి నమాజులు ముగిసిన తరువాత దైవప్రక్త (స) వారిని ఉద్దేశించి, "మీరిద్దరు మళ్ళీ ఉజూ చేసి నమాజు చేయండి. మీ ఉపవాసాన్ని కూడా పూర్తిచేసి మరునాడు దాని ఖజా పాటించండి" అన్నారు. వారు "ఎందుకు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) మీరు ఫలానా వ్యక్తిని అతని పరోక్షంలో నిందించారు" అని అన్నారు. (బైహఖి)

ఉపవాస లక్ష్యం మనిషి ఆకలిదప్పులతో ఉండటం కాదు. ఉపవాసం పాటిస్తున్నప్పుడు అతను దేవుని విధేయతా పరిధిలో మరింత స్థిరంగా ఉండి ఆయన నిషేధించిన చెడులన్నిటిని పూర్తిగా మానివేయాలి.

రమజాన్ నెలలో ముస్లింలు సంతోషంగా ఉపవాసాలుంటారు. బాగానే ఉంది. అయితే పొద్దస్తమానం ఆకలిదప్పులతో గడిపాం కదా, ఇక రాత్రికి సుష్టుగా తిని మస్తుగా పడుకుందామంటే కుదరదు. అసలు ఆరాధన రాత్రి వేళే మొదలవుతుంది. దాసుడు దేవుని పట్ల తన సంబంధాన్ని పటిష్ఠవంతం చేసుకోవడానికి సరయిన అదను రాత్రివేళే. దీనికోసం ఇస్లాం రోజూ చేసే అయిదు పూటల నమాజులేగాక రమజాన్ నెలలో అదనంగా 'తరావీహ్' నమాజులను నిర్ణయించింది.



నమాజ్‌లో ముస్లింలు ఖుర్‌ఆన్‌ని పఠనం ద్వారా ఇస్లాం బోధనలను మాటిమాటికి మననం చేసుకుంటారు. ఆవిధంగా వారు జీవిత సమస్త రంగాల్లో దేవుని ఆదేశాలు, ఉపదేశాల ప్రకారం నడుచుకోవడానికి వీలు కలుగుతుంది. అయితే తరావీహ్ నమాజ్ ఇంకా ఎక్కువగా ఖుర్‌ఆన్ పఠించడానికి లేదా వినడానికి అవకాశం కల్పిస్తుంది; తద్వారా మనిషి తన జీవితాన్ని మరింత తీర్చిదిద్దుకో గలుగుతాడు.

## హజ్‌యాత్ర

దైవారాధనా విధుల్లో హజ్‌యాత్ర నాల్గవ విధిగా నిర్ణయించబడింది. స్తోమత ఉన్న ముస్లిం జీవితంలో కనీసం ఒకసారి విధిగా హజ్‌యాత్ర జరపాల్సి ఉంటుంది. 'హజ్' అంటే సందర్శనాసంకల్పం అని అర్థం. షరీఅత్ పరిభాషలో కాబా వెళ్ళి ప్రత్యేక నియమాలతో చేసే ఆరాధన అని అర్థం. ఇది జిల్‌హజ్ నెలలో నిర్ణీత దినాలలో నెరవేర్చాలి. ముస్లింలు దైవాలయాన్ని సందర్శిస్తామని సంకల్పించుకుంటారు గనక దీన్ని హజ్ అన్నారు. హజ్‌సీజన్‌లో కాకుండా వేరే సమయంలో చేసే కాబాయాత్రను ఉమ్రా అంటారు.

"మానవుల కోసం నిర్మించిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది. అందులో (కళ్ళున్నవారికి) అనేక సూచనలున్నాయి. ఆ సూచనల్లో ఇబ్రాహీం (ప్రార్థనకోసం నిలబడే) చోటొకటి. అందులో(కాబాలో) ప్రవేశించే ప్రతివ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు." (ఖుర్‌ఆన్–3:96)

"అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (హజ్ చేయాలి) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞను శిరసావహించడానికి నిరాకరించేవాడు దేవుడు నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి." (ఖు–3:97)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఒకతని దగ్గర హజ్ కోసం ప్రయాణ సామగ్రి, వాహనంతోపాటు కాబా వెళ్ళే శక్తిఉన్నా హజ్ చేయకపోతే, అలాంటివాడు యూదుడై చనిపోయినా క్రైస్తవుడై చనిపోయినా ఒకటే; భేదమేమీ లేదు. ఎందుకంటే 'దైవగృహానికి చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. ఇది ప్రజలపై దేవునికున్న హక్కు'ని ఖుర్‌ఆన్‌లో ఉంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "దేవుడు ఇస్లాంలో నాల్గు విషయాల్ని విధిగా నిర్ణయించాడు. ఈ నాల్గింటిలో ఎవరైనా మూడింటిని మాత్రమే పాటిస్తే, నాల్గవదాన్ని పాటించనంత వరకూ ఈ మూడింటి వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆ నాలుగు ఇవి: నమాజ్, జకాత్, రమజాన్ ఉపవాసాలు, హజ్‌యాత్ర." (మిష్కాత్)

కాబా గర్భగుడి వెలుపలి గోడలో ఓ మూలన 6' ఎత్తున అమర్చబడిన నల్లరాయినే 'హజ్రెఅస్వద్' అంటారు. ఇది దైవప్రవక్త (స) తన శుభహస్తంతో, పెదవులతో స్పర్శించిన పవిత్రశిల. అంచేత హాజీలు కాబాప్రదక్షిణ చేసే ప్రతిసారి దీన్ని ముద్దాడుతారు లేదా చేత్తో తాకుతారు. చేత్తో తాకలేనంత దూరంలోఉంటే చేత్తో సైగచేసి ఆ చేతిని ముద్దాడుతారు. ఇలా చేయడం హజ్, ఉమ్రాల నియమాల్లో ఒక నియమం. దీన్ని 'ఇస్తిలాం' అంటారు. దీనికి అంతకుమించి ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి హజ్రెఅస్వద్‌తో "నీవు ఎలాంటి లాభనష్టాలు కల్గించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (స) గనక నిన్ను ముద్దాడటాన్ని చూడకపోయివుంటే నేను నిన్ను ఎన్నటికీ ముద్దాడను" అని అన్నారు. (బుఖారి)

సాధారణంగా ప్రజలు మతవ్యవహారాల్లో బాహ్యవిషయాలకే ప్రాధాన్యమిస్తారు. అంతర్విషయాల్ని గురించి అంతగా పట్టించుకోరు. 'హజ్' అనగానే ఓ ప్రత్యేక వస్త్రధారణతో మక్కా వెళ్ళడం, కాబాప్రదక్షిణ చేయడం, సఫా-మర్వా కొండల మధ్య తిరగడం, అరఫాత్, ముజ్దల్ఫాలకు వెళ్ళిరావడం వంటి విషయాలే వారి హృదయాల్లో మెదలుతాయి. కాని హజ్ అసలుధ్యేయం ఏమిటో, అది మనిషిని ఎలా తీర్చిదిద్దదలచిందో ఆలోచించరు. హజ్ ఆశయాలేమిటో దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

"మీ రక్తం, ధనం, మానమర్యాదలు మీకీ పట్నంలో ఎలా నిషేధించబడ్డాయో అదేవిధంగా (ఇకనుంచి) మీమధ్య నిషేధించబడ్డాయి. జాగ్రత్త! ఎవరైనా దౌర్జన్యపరుడు దౌర్జన్యం చేస్తున్నాడంటే తనపై తానే దౌర్జన్యం చేసుకుంటున్నాడు (అని గ్రహించండి). జాగ్రత్త! ఏతండ్రీ తన సంతానంపై, ఏసంతానం తన తండ్రిపై దౌర్జన్యం చేయకూడదు...." (ఇబ్నెమాజ)



హజ్‌సీజన్‌లో ప్రజలు మక్కాలో రక్తపాతం జరుపుకోవడం, దోచుకోవడం, అవమానించుకోవడం నిషిద్ధం. అలాగే ఇస్లామీయ సమాజంలో రక్తపాతం, దోపిడీలు, అగౌరవాలు జరగకూడదని, ప్రజలు పరస్పరం సఖ్యతతో, ఒకరి హక్కులు ఒకరు గౌరవించుకుంటూ శాంతియుతంగా మెలగాలని దైవప్రవక్త (స) ఈ హదీసులో అనుచరులకు బోధించారు. అదీగాక, ముస్లిం సముదాయంలో సమైక్యతా, సౌభాతృత్వాలను గురించి కూడా ఈ హదీసు పరోక్షంగా మనల్ని ఉపదేశిస్తోంది.

హజ్రత్ ఉసామా బిన్ షరీక్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స)తో కలసి హజ్ చేయడానికి బయలుదేరాను. అప్పుడు ప్రజలు (హజ్ ఆచారాలు తెలుసుకోవడానికి) ఆయన సన్నిధికి వస్తుంటారు. వారు వచ్చి 'దైవప్రవక్తా! కాబాప్రదక్షిణ చేయకముందు నేను 'సయీ' (సఫా, మర్వా కొండలు ఎక్కిదిగే పని) చేశాను. లేదా (మొదట చేయవలసిన) పని తర్వాత చేశాను. లేదా (తర్వాత చేయవలసిన పని) మొదట్లో చేశాను' అని అంటారు. దైవప్రవక్త (స) ప్రతి మనిషికీ 'పర్వాలేదు. (అందులో నష్టమేమీ లేదు). కాని ఎవరైనా దౌర్జన్యంగా ఒక ముస్లిం పరువుప్రతిష్ఠలకు భంగంకలిగిస్తే మాత్రం నష్టమే. కనుక అలాంటి మనిషి నష్టపోయి హతమయ్యాడు (అని తెలుసుకోండి)' అని చెప్పేవారు." (అబూదావూద్)

"ఎలాంటి అశ్లీలకార్యానికి, మరే పాపకార్యానికి పాల్పడకుండా ఈ గృహాన్ని సందర్శించిన మనిషి తనతల్లి గర్భం నుండి (అప్పుడే) పుట్టిన వాడిలా (పరమపవిత్రుడిగా హజ్ నుండి) మరలిపోతాడు." (ముస్లిం)

మనిషి హృదయంలో నిజమైన భయభక్తులుంటే అతను ఏచెడునూ దరికి చేరనివ్వడు. హజ్ సమయంలోనైతే మనసులోకి చెడు తలంపును కూడా రానివ్వకుండా దైవగృహాన్ని సందర్శించాలన్న అకుంఠిత దీక్షతో ఆయన్ని స్మరిస్తూ తన ఉనికినే మరచిపోతాడు. ఇలాంటి భక్తుడ్ని గురించి దేవుడు ఎలా వర్ణించాడో దైవప్రవక్త (స) పేర్కొన్న ఈ హితోక్తి చూడండి:

దైవప్రవక్త (స) హితోక్తి: "హజ్ చేసేవారు అరఫాత్‌లో ఆగి దేవుడ్ని ప్రార్థించడంలో, (దైవభీతితో) దుఃఖించడంలో నిమగ్నులై ఉన్నప్పుడు

దేవుడు ఇహలోక ఆకాశానికి వచ్చి దైవదూతలతో ఇలా అంటాడు- 'నాఈ దాసుల్ని చూడండి. చెదరిన శిరోజాలతో, దుమ్ము ధూళితో ఉన్న స్థితిలో వీరు నా దగ్గరికి వచ్చారు చూడండి.'' (మిష్కాత్)

నీటుగా, టిప్‌టాప్‌గా ఉండాలిగాని, ఇదేమిటీ దేవుడు దుమ్ము ధూళి కొట్టుకున్నవారిని పొగడుతున్నాడు! అని కొందరు ఆశ్చర్యపడవచ్చు. కాని మనిషి ఏదైనా ముఖ్యమైన పని దీక్షగా చేస్తున్నప్పుడు జుట్టు చెదిరిపోతే దువ్వుకోవాలని ఆలోచిస్తాడా? చెమట, దుమ్ము పడ్తుంటే మాటిమాటికి టాయ్‌లెట్ అవుతూ బట్టలు మార్చుకుంటాడా? అలా ఎన్నటికీ చేయడు. తలపెట్టిన పని ముగిసేదాకా అతనికి మరోపని మీద ధ్యాసేఉండదు. హాజీ పరిస్థితి కూడా ఇలాగే ఉండాలని ఈహదీసు వివరిస్తోంది.

మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరీ 10-10-1980 న కువైట్ రేడియోలో ప్రసంగిస్తూ 'మబ్రూర్ హజ్' గురించి ఇలా వివరించారు:

''....హజ్ (యాత్ర) నిర్వహణలో మన శరీరంతోపాటు ఆత్మ కూడా పాల్గొంటుంది. మనస్సు దైవప్రేమలో లీనమైపోతుంది. బుద్ధిజ్ఞానాలు దైవసన్నిధిలో మోకరిల్లుతాయి. కళ్ళ నుండి అప్రయత్నంగా అశ్రుధారలు ప్రవహిస్తాయి. నోరు దైవనామం, పాపమన్నింపు వచనం జపిస్తుంటుంది. పాపాలను తలచుకొని మనిషి సిగ్గుతో కుంచించుకుపోతాడు. తన బద్ధకం, ఏమరుపాటుల పట్ల పశ్చాత్తాపం చెందుతాడు. పాపాలు మన్నిం చమని దేవుడ్ని దీనాతిదీనంగా వేడుకుంటాడు. ఇతరుల హక్కులు ఏవైనా హరించివుంటే వాటిని తిరిగి ఇచ్చేస్తానని వాగ్దానం చేస్తాడు. దైవ ధర్మాన్ని ప్రచారం చేస్తానని, దాని ఉన్నతి కోసం తన సుఖం, సమయం, సంపద, చివరికి ప్రాణాన్ని సైతం త్యాగం చేస్తానని ప్రమాణం చేస్తాడు. అతని అంతరంగంలో విశ్వాస చైతన్యం ఉరకలు వేస్తుంది. హృదయంలో ఇస్లాం గురించిన నూతన ఉత్తేజం ఉప్పొంగుతుంది. ఇదీ చిత్తశుద్ధితో కూడిన హజ్ (మబ్రూర్‌హజ్) అంటే. ఇవేమీ లేని హజ్ ప్రాణంలేని దేహం వంటిది. అలాంటి మృత ప్రాయమైన హజ్ జీవితంలో ఎలాంటి పరివర్తన కలగజేయదు. అతని ఆలోచనలను సైతం మార్చలేదు. తల్లిగర్భం నుండి



అప్పుడే పుట్టిన బిడ్డలా మనిషి పాపాలను పూర్తిగా పరిహరింపజేసి పరమ పవిత్రుడ్ని చేసేది 'మబ్రూర్ హజ్' మాత్రమే. ఇలాంటి హజ్ చేయడానికే మనిషి ప్రయత్నించాలి.''

## అంతర్జాతీయ సమానత్వం,

హజ్‌యాత్ర లక్షల సంఖ్యలో ఒకేచోట ఒకే సమయంలో వివిధ ప్రాంతాల, విభిన్న జాతుల ప్రజల సమీకరణ. అంతర్జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాలకు ఏకైక ప్రతీక. అంతర్జాతీయ ముస్లిం సౌభ్రాతృత్వానికి సరైన అర్థం ఏమిటో, దాని వాస్తవస్వరూపం ఏమిటో తెలుసుకో దలచిన వారు జిల్‌హజ్జ 9,10 తేదీలలో అరఫాత్, ముజ్దల్ఫాలకు వచ్చి చూడ వచ్చు. ఇక్కడ ఎలాంటి అరుపులు, అలజడులు మచ్చుకైనా కన్పించవు. ఒకేసారి, ఒకేచోట 40 నుంచి 50 లక్షలమంది హాజీలు గుమికూడిన ఈ మానవ మహాసాగారం ఏ విధమైన పోలీసు బందోబస్తు లేకుండా ఎంత ప్రశాంతంగా, నిశ్చింతగా ఉంటుందో ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తుంది.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టిం చాము. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఖుర్ఆన్-49:13)

ఒకే రోజు, ఒకే చోట అంతమందిని, అన్ని దేశాల, జాతుల ప్రజలను, ఒకరి భాష మరొకరికి తెలియని ఆ మహా జనసంద్రాన్ని ఒక్క గొడుకు క్రిందకు చేర్చగలిగిన ఆ మహత్తర శక్తి ఏమిటీ? అదే 'దివ్యఖుర్ఆన్'- అది ఇచ్చే మానవీయ విలువలతో కూడిన ఏకదైవారాధనా సందేశం! ''లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలుల్లాహ్'' (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ ఆయన ప్రవక్త) అనే సద్వచనం పఠించ గానే మనిషి విశ్వప్రభువు సైన్యంలో భర్తీ అయిపోతాడు.

ఆ పరమప్రభువు ఆదేశంతోనే ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చిన ఈ 'సైనికులు' మక్కా నుండి మినాకు, మినా నుండి అరఫాత్‌కు, అరఫాత్ నుండి ముజ్దల్ఫాకు, ముజ్దల్ఫా నుండి మళ్ళీ మినాకు, మినా

నుండి కాబాకు, కాబా నుండి తిరిగి మినాకు, మినా నుండి మక్కాలోని తమ తమ స్థావరాలకు 'మార్చ్' చేస్తున్నారు. ఈ హజ్‌యాత్ర నమాజ్, రోజా, జకాత్‌ల మాదిరిగానే ఒకవిధమైన శిక్షణ లాంటిది. అన్యాయం, అక్రమాలతో సమాజంలో అశాంతి, అలజడులు రేకెత్తించే దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఇస్తున్న సైనిక శిక్షణ ఇది.

ముస్లింల అసలు లక్ష్యం అయిన 'ధర్మసంస్థాపన' కోసం హాజీలకు ఈ హజ్ **'సైనిక శిక్షణా శిబిరం'** లాంటిది. సైనికులు మారు మాట్లాడకుండా సేనాపతి ఆజ్ఞలు శిరసావహిస్తారు. అలాగే హాజీలు విశ్వప్రభువు ఆజ్ఞలను శిరోధార్యలుగా భావిస్తూ ఎక్కడ ఏపని చేయమంటే తక్షణమే అక్కడ ఆ పని చేస్తారు. ఉదాహరణకు- "మీరక్కడ ఉన్నంతకాలం భయభక్తులతో ఉండాలి" (2:203) అనే దైవాజ్ఞను శిరసావహిస్తూ హాజీలు అరఫాత్, ముజ్దల్ఫాలలో భయభక్తులతో హజ్ నియమాలు పాటిస్తారు.

వారిలో ప్రతి ఒక్కరూ నేరుగా ప్రధాన సైన్యాధ్యక్షుడయిన సృష్టికర్త ఆజ్ఞలనే పాటిస్తారు. మధ్యలో దళనాయకులు, వింగ్‌కమాండర్లు ఎవరూ ఉండరు. వారిలో ఒకరిపైనొకరికి ఎలాంటి ఆధిక్యతా భావం లేదు. జాతి వివక్షతలు, పదవీహోదాలు లేవు. ధనిక-పేద తారతమ్యాలు అంతకన్నా లేవు. వారి భాషలు వేరయినా చిరునవ్వుతో కూడిన పరస్పర పరిచయం కోసం అందరికీ తెలిసిన ఓ కోడ్‌వర్డ్ ఉంది. దాంతోనే వారు పరస్పరం పరిచయం చేసుకుంటారు; కళ్ళతోనే పలకరించుకుంటారు; ఆలింగనం చేసుకుంటారు. అదే "అస్సలాము అలైకుం."

## 16. దుష్టశిక్షణ-శిష్టరక్షణ

'దుష్టశిక్షణ-శిష్టరక్షణ'నే ఇస్లాం 'ధర్మరక్షణ' అంటుంది. ధర్మరక్షణ ఇస్లాం మూలస్తంభాలలో లేకపోయినా ఇది ముస్లింలు నిర్వహించవలసిన విధులలో ఒక ముఖ్యమైన విధి. ఖుర్‌ఆన్, హదీసుల్లో దీనికి చాలా ప్రాముఖ్యం ఇవ్వబడింది.

ఇస్లాం అంటే విధేయత అని, ముస్లిం అంటే విధేయుడని, దేవుని ఆజ్ఞల్ని శిరసావహించేవాడని మనం గతపేజీలలో తెలుసుకున్నాం. ఇస్లాం



అంటే మరోఅర్థం శాంతి అని కూడా తెలుసుకున్నాం. ప్రపంచంలోని వివిధ జీవరాసులన్నీ ప్రశాంతంగా మనుగడ సాగిస్తున్నాయి. వివిధరకాల జంతువులు, పక్షులు, పురుగులు, కీటకాలు, చేపలు ఏవీ పరస్పరం పోట్లాడుకోవడం లేదు. సమస్త భూచరాలు, జలచరాలు తమతమ నిర్దేశిత విధానల ప్రకారం ప్రశాంతగా జీవయాత్ర సాగిస్తున్నాయి.

కాని ఒక్క మానవజాతిలోనే ఈ ప్రశాంతత కానరావడం లేదు. కారణం వారిలో కొందరు స్వార్థపరులు దైవమిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగిస్తూ తోటిమానవుల హక్కుల్ని కొల్లగొట్టే దుష్టచర్యలతో అశాంతి, అలజడులు సృష్టిస్తున్నారు. మారణహోమాలు, రక్తపుటేరులతో మానవత్వాన్ని మంట గలుపుతున్నారు. కడవెడు పాలలో ఒక్క విషబిందువు కలిస్తే మొత్తం పాలు పాడయిపోతాయి. అదేవిధంగా ఈ సంఘవిద్రోహులు, శాంతివిఘాతకులు కొందరే అయినప్పటికీ సమాజాన్ని, దేశాన్ని, చివరికి ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తారు. ఆ వినాశం యుద్ధాల కారణంగానైనా కావచ్చు, ప్రకృతివైపరీత్యాల వల్లనైనా కావచ్చు. ఆ యుద్ధాలు, ప్రకృతివైపరీత్యాల బారి నుండి ఒక్కోసారి మంచివాళ్ళు కూడా తప్పించుకోలేరు.

"మీలో పాపాలు చేసినవారికే పరిమితమైపోని ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దేవుడు కఠినంగా శిక్షించేవాడని తెలుసుకోండి." (ఖుర్‌ఆన్-8:25)

ఇలాంటి పరిస్థితే ఒక రాజ్యానికి ఎదురైనప్పుడు ఆ రాజ్యం చేతులు ముడుచుకొని కూర్చోవదు. విద్రోహశక్తులు స్వదేశీశక్తులైనా, విదేశీశక్తులైనా వాటిని ఉక్కుపాదంతో అణచివేస్తుంది. ఒకవేళ వేరే దేశం రాజ్యహింసకు పాల్పడితే దానికి బుద్ధి చెప్పేందుకు సర్వశక్తులతో సాయుధపోరాటానికి దిగవలసివస్తుంది. ఇస్లామీయరాజ్యం కూడా అంతే.

"వారు (ప్రపంచంలో) యుద్ధజ్వాలలు రగిల్చినప్పుడల్లా దేవుడు వాటిని చల్లార్చవలసి వస్తున్నది. వారు ఎల్లప్పుడూ ధరణిపై ఏదోఒక ఉపద్రవం సృష్టించడానికే ప్రయత్నిస్తుంటారు. దేవుడు ఇలాంటి కలహకారుల్ని ఎన్నటికీ ప్రేమించడు." (ఖుర్‌ఆన్-5:64)

"దేవుడు కొందరి ద్వారా కొందరిని నిర్మూలించకపోతే ప్రపంచం అరాచకం, అల్లకల్లోలాలతో నిండిపోతుంది. దేవుడు ప్రపంచ మానవుల పట్ల ఎంతో దయామయుడు. (అందుకే ఆయన అశాంతి, అరాచకాలు నిర్మూలించే ఏర్పాట్లు చేస్తుంటాడు.)" (ఖుర్‌ఆన్–2:251)

"విశ్వాసులు దైవమార్గంలో పోరాడుతారు. అవిశ్వాసులు షైతాన్ మార్గంలో పోరాడుతారు. కనుక మీరు షైతాన్ అనుచరమూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలన్నీ చాలా బలహీనమైనవని తెలుసుకోండి" (ఖు–4:76)

"దిక్కులేకపోవడం చూసి అణచివేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికితీసి కాపాడు. మాకు రక్షణకల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీ వైపునుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టు కుంటున్నారే! అలాంటి పీడితుల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?" (ఖుర్‌ఆన్–4:75)

దుర్మార్గం, దౌర్జన్యాలను ఎదిరించి పీడితులను రక్షించడానికి, శాంతి నెలకొల్పడానికి అంతిమ సాధనం సాయుధపోరాటమేనని పైసూక్తుల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. దీన్నే ఇస్లామీయ పరిభాషలో 'జిహాద్' అంటారు.

అయితే దుష్టశక్తులు, శాంతివిఘాతకులు, మతదురభిమానులు ఇస్లాం ఖడ్గం ద్వారా వ్యాపించిందని, ముస్లింలు టెర్రరిస్టులని దుష్ప్రచారం చేస్తు న్నారు. ముస్లింలపై అపనిందలు మోపి, ఆ సాకుతో ఇస్లాంను నిందించి దాన్ని అంతమొందించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. కారణం ఇస్లాం వ్యాప్తిలో వారి స్వార్థప్రయోజనాలకు కాలం చెల్లే సూచనలు కన్పించడమే.

శాంతికి పర్యాయపదమైన ఇస్లాం ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుంది. అన్యాయం, దౌర్జన్యాలను అంతంచేసి, శాంతిభద్రతలు నెలకొల్పడం జరిగినప్పుడు ప్రజలు ప్రశాంతంగా ఆలోచించి మంచేదో చెడేదో, సత్యమేదో అసత్యమేదో నిర్ణయించుకోగలుగుతారు. అలాటి వాతావరణంలో ప్రజలు సహజంగానే ప్రకృతి ధర్మమయిన ఇస్లాం వైపు దృష్టి సారిస్తారు. ఇక్కడే మతదురభిమానులకు, స్వార్థపరులకు ప్రమాదం కన్పిస్తుంది.



అంచేత అలాంటి వాతావరణం ఏర్పడకుండా అశాంతి-అస్థిరతల అగ్ని జ్వాలలు ఎల్లప్పుడూ ప్రజ్వరిల్లేలా వారు ముస్లింజగత్తులో తరచుగా ఏదో ఒక ఉపద్రవం రేకెత్తిస్తూనే ఉంటారు. నేడు అపార అణ్వాయుధాలతో బలుపెక్కిన అప్రాచ్యులు చేస్తున్న పని ఇదే. ఇస్లాం గురించి అపార్థాలు సృష్టించడం, దౌర్జన్యం-దోపిడీ ధోరణులకు వ్యతిరేకంగా గళంవిప్పే ముస్లిం లను టెర్రరిస్టులగా చిత్రించి ప్రచారం చేయడం వారి నిత్యకృత్యాలు. అప్పటికీ ఈ ప్రయత్నాలు ఫలించకపోతే ప్రపంచానికి మాటిమాటికి టెర్రరిజం బూచీచూపిస్తూ ముస్లిందేశాలపై విరుచుకుపడి వాటిని సర్వనాశనం చేస్తారు.

వాస్తవం ఎల్లకాలం దాగివుండదు. శాంతికాముకులు, న్యాయప్రియులు వారి విధ్వంసకాండలు, స్టేట్‌టెర్రరిజాలు గమనిస్తూనే ఉన్నారు. హద్దుమీరిన వారి హింసాదౌర్జన్యాలను అర్థంచేసుకున్న జనసామాన్యం కూడా విసిగెత్తి పోతున్నారు. కాని వారి వినాశకారీతనానికి వ్యతిరేకంగా నోరువిప్పడానికి సాహసించలేకపోతున్నారు. ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందని, టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుందని నమ్మేరోజులు క్రమంగా అంతరిస్తున్నాయి. ఇలాంటి దుష్ప్రచారంతో ముస్లిం దేశాలలో విధ్వంసానికి పాల్పడిన పాశ్చాత్య దేశాల లోనే ప్రజలు ఇప్పుడు ఇస్లాం గరించి ప్రశాంతంగా ఆలోచిస్తున్నారు. అంతే కాదు ఇప్పుడు పాశ్చాత్యదేశాలలోనే ఇస్లాం అత్యధికంగా విస్తరిస్తోంది.

"వారు తమనోటితో దేవుని జ్యోతి(సత్యధర్మం) ఆర్పివేయగోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగుచెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు." (ఖుర్‌ఆన్–9:32)

"ధర్మస్వీకరణలో ఎలాంటి బలాత్కారం లేదు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరుచేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే." (ఖుర్‌ఆన్–2:256)

"ప్రవక్తా! నీవు మటుకు హితబోధ చేస్తూనే ఉండు. నీ పని హితబోధ చేయడమేగాని, వారిని బలవంతంగా దారికి తెచ్చే బాధ్యత నీమీద లేదు." (ఖుర్‌ఆన్–88:21,22)

# 17. ధర్మం (దీన్)-ధర్మశాస్త్రం( షరీఅత్)

మనం గత పేజీలలో తొలి దైవప్రవక్త ఆదం (అలై) నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) వరకు దైవప్రవక్తలంతా ఇస్లాం ధర్మం గురించే ప్రజలకు బోధించారని తెలుసుకున్నాం. దైవప్రవక్తలు బోధించినట్లు దేవుని గుణగణాలు-శక్తిసామర్థ్యాలపై, పరలోకంలో జరిగే కర్మ విచారణపై విశ్వాసం కలిగివుండటంతో పాటు, దైవప్రవక్తలకు పూర్తిగా విధేయులయి వారి ద్వారా అవతరించిన దివ్యగ్రంథాలను అనుసరిస్తూ ఏకదైవారాధన చేస్తుండాలి. ఈ విశ్వాసం, ఆరాధనా తీరుల పేరే ఇస్లాం. ఇది యావన్మంది దైవప్రవక్తల బోధనల్లోని సమిష్టి సారాంశం, ఉమ్మడి విషయం. దీన్నే 'దీన్' (ధర్మం) అంటారు.

పోతే ఈ దీన్‌కు సంబంధించిన వివరాలను ధర్మశాస్త్రం (షరీఅత్) అంటారు. అంటే ఆరాధనాపద్ధతులు, సామాజికసూత్రాలు, ధర్మాధర్మాలు, మంచీచెడులు, ప్రజలు పరస్పర సంబంధాలకు, వారి వ్యవహారాలకు అవసరమైన చట్టాలు మొదలైన విషయాలకు సంబంధించిన హద్దులు, పరిమితులన్న మాట. ప్రారంభంలో దేవుడు వీటికి సంబంధించి విభిన్న భాషలు, విభిన్న జాతుల స్థితిగతుల దృష్ట్యా తన ప్రవక్తల ద్వారా విభిన్న ధర్మశాస్త్రాలను పంపాడు. ఇలా దేవుడు వేర్వేరు కాలాల్లో, వేర్వేరు జాతులకు తన ప్రవక్తల ద్వారా వేర్వేరు ధర్మశాస్త్రాలు పంపి ఆయా జాతులకు నైతికనియమాలు, సభ్యతా-సంస్కారాలు బోధిస్తూ ఆ జాతుల ప్రజల్ని ఓ మహత్తర శాసనాంగం అనుసరించగలిగేలా వారిని తయారు చేస్తుండేవాడు.

ఈ పని ముగిసిన తరువాత చివర్లో ఆయన మహనీయ ముహమ్మద్ (సల్లం)కు ఆ మహత్తర శాసనాంగం ఇచ్చి పంపాడు. ఇందులోని అధికరణలన్నీ ప్రపంచ మానవులందరికీ వర్తిస్తాయి. ఈ మహా శాసనాంగం రాకతో గత ధర్మశాస్త్రాలన్నీ (షరీఅత్‌లన్నీ) రద్దయిపోయాయి. అయితే పైపేరాలో పేర్కొన్నట్లు 'దీన్' (ధర్మం) మాత్రం గత ప్రవక్తలు బోధించినటువంటిదే. అందులో ఎలాంటి మార్పులేదు. అవే విశ్వాసాలు, అదే ఏకదైవోపాసన.



## జ్ఞానార్జనకు మూలాధారాలు

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మనకు అందజేసిన షరీఅత్ (ధర్మశాస్త్రం)కు మూలాధారాలు రెండున్నాయి. ఒకటి, ఖుర్‌ఆన్; రెండు, హదీస్ (దైవప్రవక్త మాటలు, చేతలు). ఖుర్‌ఆన్ గురించి అది పూర్తిగా దైవవాణి అని, తన అవతరణకాలం నుంచి నేటివరకూ ఎలాంటి మార్పులకు, చేర్పులకు గరికాలేదని మనం ఇంతకుముందు తెలుసుకున్నాం. ఇప్పుడు హదీస్ గురించి తెలుసుకుందాం.

దైవప్రవక్త (స) దగ్గర నుండి మన దాకా చేరిన ఉల్లేఖనాలనే హదీస్ అంటారు. ఖుర్‌ఆన్ సిద్ధాంతం (Theory) అయితే, హదీస్ దాని క్రియాత్మక వివరణ (Practice) అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే హదీస్ రూపంలో ఉన్న దైవప్రవక్త (స) జీవితం ఖుర్‌ఆన్‌కు నిలువుటద్దం.

దైవప్రవక్త (స) ఆచరణ గురించి అంటే ఆయన జీవనసరళి గురించి తెలుసుకోవడానికి కొందరు అనుచరులు ఆయన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు వెళ్ళి "అమ్మా! దైవప్రవక్త (స) ఆచరణ ఏవిధంగా ఉంటుంది?" అని అడిగారు. దానికి హజ్రత్ ఆయిషా (రజి) "ఏమిటీ! మీరు ఖుర్‌ఆన్ చదవడం లేదా? (ఖుర్‌ఆన్ ప్రకారమే ఆయన ఆచరణ ఉంటోంది.)" అని అన్నారు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా నియమించబడిన నాటి నుండి 23 సంవత్సరాల వరకు అనుక్షణం విద్యాబోధన, ఉపదేశాలలో నిమగ్నులయి ఉండేవారు. ఆయన తన మాటల ద్వారా, చేతల ద్వారా దైవాభీష్టం ప్రకారం జీవితం గడపవలసిన విధానం ఏమిటో ప్రజలకు తెలియజేస్తుండేవారు. ఆయన అనుచరులు, భార్యలు, బంధుమిత్రులు ఆయన మాటలను, చేతలను శ్రద్ధగా ఆలకించేవారు, గమనించేవారు. ప్రతి వ్యవహారంలోనూ ఎదురయ్యే సమస్యల్ని గురించి దైవాభీష్టం ఏమిటో వారాయన్ని అడిగి తెలుసుకునేవారు. ఏ పని చేయాలో, ఏ పని చేయకూడదో, ఏది ధర్మసమ్మతమో, ఏది నిషిద్ధమో ఆయన అనుచరులకు తెలియజేస్తుండేవారు.

దైవప్రవక్త (స) మాటలను, చేతలను విన్నవారు, చూసినవారు వాటిని గుర్తుంచుకునేవారు, కొందరు వ్రాసుకునేవారు. వారా ఆ మాటలను, చేతలను విననివారికి, చూడనివారికి చేరవేసేవారు. వారా విషయాలను కంఠస్థం చేసుకొని లేదా గ్రంథస్థం చేసుకొని మరికొందరికి అందజేసేవారు. వారు ఇతరులకు అందజేసేవారు. ఈవిధంగా హదీసుల సేకరణ జరిగి గ్రంథాలుగా రూపొందాయి. వాటిలో ఇమామ్ మాలిక్, ఇమామ్ బుఖారి, ఇమామ్ ముస్లిం, ఇమామ్ తిర్మిజి, ఇమామ్ అబూదావూద్, ఇమామ్ నసాయి, ఇమామ్ ఇబ్నెమాజ (రహ్మలై)లు సేకరించి తయారుచేసిన హదీసు గ్రంథాలు అత్యంత ప్రామాణికమైనవిగా ప్రసిద్ధిచెందాయి.

## ధర్మావగాహన శాస్త్రం (ఫిఖహ్)

అయితే సామాన్య ప్రజలు షరీఅత్ ఆదేశాలకు సంబంధించిన సూక్ష్మ విషయాలను నేరుగా ఖుర్ఆన్, హదీసుల నుండి గ్రహించలేరు. అంచేత ఖుర్ఆన్, హదీసులను ఏళ్ళతరబడి పరిశోధించి ప్రావీణ్యం సంపాదించిన కొందరు మహానుభావులు వారికోసం సవివరమైన శాసనావళి రూపొందించారు. దాన్ని 'ఫిఖహ్' (ధర్మావగాహన శాస్త్రం) అంటారు. ఆనాటి వారి శ్రమ ఫలితమే ఈనాడు కోట్లాది ముస్లింలు ఎలాంటి శ్రమ లేకుండా ఇస్లాం ధర్మశాస్త్రాన్ని సులభంగా అనుసరించగలుగుతున్నారు.

ప్రారంభంలో అనేకమంది మహనీయులు అనేక రకాల ధర్మావగాహన శాస్త్రాలు రూపొందించారు. అయితే ఈ సంఖ్య క్రమేణా తగ్గుతూ నేడు యావత్ప్రపంచంలో నాల్గు ధర్మావగాహన (ఫిఖా) శాస్త్రాలు ఉండిపోయాయి. ఈనాడు అధికసంఖ్యాక ముస్లింలు వీటినే అనుసరిస్తున్నారు.

1- ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) ఫిఖా శాస్త్రం: దీని రూపకల్పనలో ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మలై), ఇమామ్ ముహమ్మద్ (రహ్మలై), ఇమామ్ జుఫర్ (రహ్మలై), మరికొందరు ప్రముఖ ధర్మవేత్తల సలహాలు కూడా ఉన్నాయి. దీన్ని 'హనఫీ ఫిఖా' అంటారు.

2- ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఫిఖాశాస్త్రం: దీన్ని మాలికీ ఫిఖా అంటారు



3- ఇమామ్ షాఫయి (రహ్మ) ఫిఖాశాస్త్రం: దీన్ని షాఫయి ఫిఖా అంటారు.

4- ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) ఫిఖాశాస్త్రం: ఇది హంబలీ ఫిఖా పేరుతో ప్రసిద్ధిచెందింది.

ఈ నాలుగు ధర్మావగాహన శాస్త్రాలు దైవప్రవక్త (సల్లం) తదనంతరం రెండు వందల సంవత్సరాల లోపుగా రూపొందాయి. వాటిలోని భేదాభిప్రాయాలు అంతగా పట్టించుకోవలసినవి కావు. అవి సహజసిద్ధమైన భేదాభిప్రాయాలే. కొందరు వ్యక్తులు విడివిడిగా ఏదైనా వ్యవహారాన్ని పరిశోధించినప్పుడు లేదా ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు వారి పరిశోధన, అవగాహనల్లో కొద్దిగొప్పొ తేడా ఉండటం సహజమే. అయితే ఈ మహనీయులందరూ సత్యప్రియులు, చిత్తశుద్ధి కలవారు, ముస్లింజన శ్రేయోభిలాషులు. కనుక ముస్లింలందరూ ఈ నాల్గు ధర్మావగాహన శాస్త్రాలను సత్యమైనవిగా ఆమోదించారు.

అయితే ధర్మవేత్తలు ఈ నాల్గు ఫిఖా శాస్త్రాలలో ఏదో ఒక విధానాన్నే మాత్రమే ప్రజలు అనుసరించాలని అన్నారు. ఇది సహజమే. ఒక వ్యవహారంలో నాలుగు విభిన్న పద్ధతులు అనుసరించడం అసాధ్యం కూడా. పోతే ధర్మవేత్తలకు చెందిన ఒక వర్గం ప్రత్యేకంగా ఏ ఫిఖా విధానాన్ని అనుసరించవలసిన అవసరం లేదని, షరీఅత్ విద్య తెలిసిన ప్రతిమనిషీ నేరుగా ఖుర్ఆన్, హదీసుల నుండి ఇస్లాం ఆదేశాలను తెలుసుకోవాలని అన్నది. షరీఅత్‌విద్య తెలియనివారు మాత్రం తాము విశ్వసనీయుడని భావించిన ధర్మవేత్తను అనుసరించవచ్చని అన్నది. ఈ ఆలోచనా సరళి గలవారిని 'అహ్లెహదీస్' అంటారు. పైన పేర్కొన్న నాలుగు వర్గాలతో పాటు ఈ వర్గం కూడా సత్యపథంలో ఉంది.

## ఆధ్యాత్మికత (తసవ్వుఫ్)

ఫిఖా (ధర్మావగాహన) శాస్త్రానికి మనిషి బాహ్యాచరణతో మాత్రమే సంబంధం ఉంటుంది. ఒక పని ఎప్పుడు ఏవిధంగా చేయాలని ఆజ్ఞాపించబడిందో అప్పుడు ఆవిధంగా ఆ పని జరిగిందా లేదా అని మాత్రమే ఫిఖా చూస్తుంది. ఆవిధంగానే జరిగితే అదిక మనిషి చిత్తశుద్ధి, మానసిక

పరిస్థితుల్ని గురించి పట్టించుకోదు. చిత్తశుద్ధి, మానసిక పరిస్థితుల్ని పరిశీలించే శాస్త్రాన్నే 'తసవ్వుఫ్' (ఆధ్యాత్మికత) అంటారు.

ఉదాహరణకు నమాజ్ విషయాన్నే తీసుకుందాం. నమాజ్ చేయడానికి ముందు మనిషి సరిగా ఉజూ చేశాడా లేదా, కాబాకు అభిముఖంగా నిల బడ్డాడా లేదా, నమాజ్‌లో ఏ సమయంలో ఏ విషయాలు ఎన్ని రకాతులు పఠించాలో ఆ సమయంలో ఆ విషయాలు అన్ని రకాతులు పఠించాడా లేదా వగైరా బాహ్యవిషయాలను మాత్రమే ఫిఖా పరిశీలిస్తుంది. అవి సరిగా జరిగితే ఫిఖా దృష్టిలో నమాజ్ విధి నెరవేరినట్లే.

'తసవ్వుఫ్' ఈ ఆరాధన విషయమై మనిషి హృదయంలో మెదిలే విషయాల్ని గమనిస్తుంది. నమాజ్ చేస్తున్న మనిషి దేవుని వైపే దృష్టి సారించాడా లేక ప్రాపంచిక విషయాలపై అతని మనసు మళ్ళిందా, అతని అంతరంగంలో దైవప్రసన్నత పొందే ఉద్దేశం ఉందా లేక మరేదైనా దురుద్దేశం ఉందా, అతని మనసులో దైవభీతి, పరలోక చింతనలే ఉన్నాయా లేక దైవేతరుల్ని గురించిన భయప్రలోభాలు-పేరుప్రతిష్ఠలు ఉన్నాయా, అతని నమాజ్ అతని ఆధ్యాత్మిక వికాసానికి, నీతినడవడిక లకు ఏమేరకు పాటుపడింది అనే విషయాలను తసవ్వుఫ్ గమనిస్తుంది.

తసవ్వుఫ్‌కు సంబంధించిన ఈ విషయాలే మన నమాజ్‌కు పరిపూర్ణత, పరిపక్వతలు చేకూర్చుతాయి. ఇదే విధంగా షరీఅత్‌కు సంబంధించిన ఇతర ఆజ్ఞల విషయంలో కూడా తసవ్వుఫ్ పరిశీలిస్తుంది. ఫిఖా, తసవ్వుఫ్ లకున్న తేడా ఒక ఉదాహరణ ద్వారా మనం సులభంగా గ్రహించగలం.

ఏదైనా వ్యవహారం గురించి మనల్ని ఎవరైనా కలుసుకోవడానికి వస్తే మనం అతడ్ని రెండు దృక్కోణాలతో చూస్తాం. ఒకటి- అతను ఆరోగ్య వంతుడా లేక అంగవైకల్పికుడా, అందగాడా కురూపియా, అతను మంచి తలకట్టు, మంచిదుస్తులతో ఉన్నాడా లేక చింపిరితల, మాసినబట్టలతో ఉన్నాడా అని పరిశీలిస్తాం. రెండు- అతని గుణగణాలు-నీతి నడవడికలు ఎలా ఉన్నాయి, అతను బుద్ధిమంతుడా లేక బుద్ధిహీనుడా, పండితుడా పామరుడా, సంస్కారవంతుడా సంస్కారహీనుడా, అతని అలవాట్లు



అభిరుచులు ఏమిటీ అనే విషయాల్ని గురించి ఆరా తీస్తాము. మైత్రి, బంధుత్వాల కోసం ఈరెండు దృక్కోణాలతో చూడవలసిన అవసరముంది.

వీటిలో మొదటి దృక్కోణం ఫిఖాకు సంబంధించినది. రెండవ దృక్కోణం తసవ్వుఫ్‌కు సంబంధించినది. మన దగ్గరకు వచ్చిన ఆ వ్యక్తిని ఈ రెండు దృక్కోణాలతో చూసి సంతృప్తిచెందితే అప్పుడు మనం అతనికి స్నేహహస్తం అందించడానికి లేక బంధుత్వం కలుపుకోవడానికి ముందు కొస్తాము. అంటే అతని అంతర్‌బాహ్యాలు రెండూ బాగున్నప్పుడే మనం అతనితో సంబంధం పెట్టుకోవడానికి సిద్ధమవుతామన్న మాట.

అదేవిధంగా షరీఅత్ ఆజ్ఞల్ని పాటించే విషయంలో కూడా మనిషి అంతర్‌బాహ్యాలు రెండూ బాగుండాలని, పవిత్రంగా ఉండాలని ఇస్లాం చెబుతోంది. బాహ్య విషయాల్లో అమిత శ్రద్ధవహించి, అంతర్ విషయాల్ని గురించి పట్టించుకోని దైవదాసుడు ఇస్లాం దృష్టిలో అందమైన శవం లాంటివాడు. ఒకవేళ అతని ఆచరణలో అంతర్ విషయాలన్నీ సమంజసం గా, పవిత్రంగా ఉండి బాహ్య విధేయత సరిగా లేకపోతే అతను పరమ పుణ్యాత్ముడైన కురూపి లాంటివాడని చెప్పవచ్చు. దీన్నిబట్టి మనం ఫిఖా, తసవ్వుఫ్‌ల సంబంధం ఏమిటో సులభంగా అర్థం చేసుకోగలుగుతాం.

అయితే కాలక్రమంలో జ్ఞానం, నైతికతల పతనంతో చోటుచేసుకున్న అనేక చెడు విషయాలతో పాటు తసవ్వుఫ్‌లోని ఈ సద్భావనకు కూడా చీడపురుగులు పట్టాయి. ముస్లిమేతర జాతుల్లోని ఇస్లాంవ్యతిరేక తాత్విక విచారవలయంలో చిక్కుకున్న కొందరు ముస్లింలు ఆ తాత్విక చింతన లకు తసవ్వుఫ్ పేరిచ్చి వాటిని ఇస్లాంలో జొప్పించారు. ఈ ఆలోచనా ధోరణికి ఖుర్‌ఆన్, హదీసుల్లో ఏమైనా ఆధారాలు ఉన్నాయా లేవా అనే విషయం గురించి వారు ఏమాత్రం పట్టించుకోకుండా తమ చిత్ర విచిత్ర నమ్మకాలకు, పద్ధతులకు తసవ్వుఫ్ పేరు తగిలించారు. అంతటితో వారి ఆధ్యాత్మిక వికాస భావన ఆగిపోలేదు. 'తసవ్వుఫ్' షరీఅత్‌లో ఒక భాగమై నప్పటికీ వారు షరీఅత్ ఆజ్ఞలను, ఆంక్షలను తుంగలో తొక్కి తసవ్వుఫ్‌కు షరీఅత్‌తో ఎలాంటి సంబంధం లేదని కూడా వాదనకు దిగారు.

# 18. హక్కులు-బాధ్యతలు

మానవుల ప్రశాంత మనుగడకు ఇస్లాం సూచించిన జీవనవ్యవస్థలో రెండు విధాల హక్కులున్నాయి. ఒకటి, దేవుని హక్కులు. ఇవి 15వ,16వ అధ్యాయాలలో పేర్కొనబడ్డాయి. రెండు, దాసుల హక్కులు. ఇందులో మానవ హక్కులతో పాటు మూగజీవాలు, ఇతర సృష్టిరాసుల హక్కులు కూడా చేరివున్నాయి.

## ఆత్మహక్కులు

మానవ హక్కుల్లో మొట్టమొదటిది ఆత్మహక్కులు. ఏ మనిషికీ ఎట్టి పరిస్థితిలోనూ తననుతాను చంపుకునే హక్కులేదు. ఇస్లాంలో ఆత్మహత్య ఘోరపాపం. ఆత్మ దేవుని సొత్తు. మానవుని సమస్తకర్మల నిర్వహణకోసం అతని దేహానికి ఇవ్వబడిన "పవర్‌హౌస్." దేవుడు ఏ మానవుడిపై కూడా అతను మోయలేని భారం వేయడని ఖుర్‌ఆన్ పేర్కొన్నది. కనుక మనిషి ఏఆపద వచ్చినా దాన్ని సహనంతో ఎదుర్కోవాలేగాని తొందరపడి ఆత్మ హత్యకు పాల్పడకూడదు. ఆత్మహత్య పరిస్థితుల్ని ఎదిరించలేని పిరికి చర్య. అందుకే ఇస్లాం ఆత్మహత్యను నిషేధించింది.

దైవప్రవక్త (స) హితోక్తి: "కొండపై నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నవాడు నరకానికి పోతాడు. కొండ పైనుంచి పడుతూలేస్తూ అక్కడే శాశ్వతంగా ఉంటాడు. విషం తిని ఆత్మహత్య చేసుకున్న వాడు నరకాగ్నిలో పడి చేతిలో విషం పట్టుకొని ఎల్లప్పుడూ తింటుంటాడు. లోహపు వస్తువుతో ఆత్మహత్య చేసుకున్నవాడు చేతిలో ఆ వస్తువు పట్టుకొని మాటిమాటికి కడుపులో పొడుచుకుంటూ శాశ్వతంగా నరకాగ్నిలో కాలిపోతుంటాడు." (బుఖారి)

మనిషి ఆరోగ్యానికి, ఆస్తిపాస్తులకు హాని కలిగించే విషయాల్ని కూడా ఇస్లాం నిషేధించింది. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం– ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది." (5:90)



"విశ్వాసులారా! మీరు దేవుడ్ని మాత్రమే ఆరాధించేవారైతే మేము ప్రసాదించిన పరిశుద్ధ పదార్థాలనే తిని కృతజ్ఞులైఉండండి. ఆయన మీకు చచ్చిన పశువుల్ని, రక్తాన్ని, పందిమాంసాన్ని, దైవేతరులకు నైవేద్యం పెట్టిన పదార్థాలను, (అక్కడి మాంసాహారాన్ని) నిషేధించాడు. అయితే దైవాజ్ఞలు ఉల్లంఘించే ఉద్దేశ్యం లేకుండా, హద్దుమీరకుండా గత్యంతరంలేని పరిస్థితిలో మాత్రం (ఈ నిషేధితాలు) తినవచ్చు." (2:172,173)

ఇస్లాం వైరాగ్యభావనను కూడా నిషేధించింది. దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త (స) బోధనలకు మాత్రమే అనుగుణంగా నడచుకోవాలని, వాటిని అతిక్రమించి కల్పిత విధానాలను పాటించకూడదని పేర్కొన్నది. ఇస్లాంలో సర్వసంగపరిత్యాగం లేదని దైవప్రవక్త (స) అన్నారు (అహ్మద్). "దైవమార్గంలో (దుష్టశక్తులతో) పోరాడటమే ముస్లింసమాజం అవలం బించే సర్వసంగ పరిత్యాగ"మని ఆయన తెలిపారు. (అహ్మద్).

ఇస్లాం లైంగికేచ్ఛను అణచివేసే వైరాగ్యాన్ని, దాన్ని తీర్చుకునే వ్యభిచా రాన్ని, అసహజ విధానాలను నిషేధించి, లైంగికశక్తిని సద్వినియోగించే వివాహవ్యవస్థను ధర్మసమ్మతం చేసింది. అలాగే పొట్టపోషణ కోసం అక్రమమార్గాలు వదలి నీతిమార్గాన కష్టపడి సంపాదించాలని చెప్పింది.

## దాసుల హక్కులు

ఇస్లాం సాటి మనుషుల హక్కులకు భంగం కలిగించే నీతిరాహిత్యాన్ని, ఇతర అక్రమాలన్నిటినీ నిషేధించింది. ఉదా//కు:- హత్య, దౌర్జన్యం, కల్లోలం, అబద్ధం, అపనింద, అశ్లీలం, దొంగతనం, లంచగొండితనం, నమ్మకద్రోహం, వడ్డీ, జూదం, లాటరీ, అక్రమ వ్యాపార పద్ధతులు. ఈ చెడుల వల్ల తోటి దైవదాసులకు నష్టం వాటిల్లుతుంది గనుక వీటికి దైవ భక్తులు దూరంగా ఉండాలని ఇస్లాం కట్టడి చేసింది.

మానవ జీవితనౌక సవ్యంగా సాగడానికి, లైంగిక తృప్తికి, సంతతి వ్యాప్తికి ఇస్లాం వివాహవ్యవస్థను ప్రతిపాదించడంతో పాటు వివాహనిషిద్ధ స్త్రీలజాబితా తెలియజేసి, ఆ జాబితాలోకి రాని స్త్రీలను మాత్రమే వివాహ మాడాలని ఇస్లాం ఆదేశించింది. అలాగే పచ్చని సంసారాల్లో చిచ్చురగిల్చే

అశ్లీలచేష్టల్ని అడ్డుకోవడానికి ఇస్లాం పరదావ్యవస్థను ప్రవేశపెట్టింది. జాతి నైతికతను పరిరక్షించడానికి పురుషుడు నాభి, మోకాళ్ళ మధ్య ఉండే శరీర భాగాన్ని తన దగ్గరి బంధువుల ముందు కూడా బహిర్గతం చేయకూడదు. స్త్రీ అయితే ముఖం, చేతులు తప్ప మిగతా దేహాన్ని ఏ పరపురుషుని ముందూ బహిర్గతం చేయకూడదు; కన్నతండ్రి, సొంత సోదరుడైనా సరే.

అదేవిధంగా పొట్టపోషణ కోసం అక్రమార్జనా పద్ధతులను నిషేధించడం తోపాటు ఆర్థికవ్యవస్థలో జకాత్‌విధానం, ఆస్తిపంపిణీ పద్ధతులు కూడా ప్రవేశపెట్టింది. ధనికుడు ప్రతిఏటా తన మిగులు ధనంపై 2.5% జకాత్ తీసి పేదలకు పంచాలి. జకాత్‌వ్యవస్థ ద్వారా ఇస్లాం ముస్లిం హృదయం నుంచి ప్రాపంచికవ్యామోహాన్ని, దాని విషవృక్షాలను నిర్మూలించి సమాజం లో ప్రజలకు ఆర్థికన్యాయం చేకూర్చదలచింది.

## తల్లిదండ్రుల హక్కులు

దాసుల హక్కులలో మొట్టమొదటిది తల్లిదండ్రుల హక్కేనని చెప్ప వచ్చు. పురుషునిపై అందరికంటే ఎక్కువగా అతని తల్లిదండ్రులకే హక్కుంది. స్త్రీపై అందరికంటే ఆమె భర్తకే హక్కుంది.

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అనికూడా విసుక్కోకండి. కసురు కుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగామాట్లాడండి; దయార్ద్ర హృదయంతో, వినయంతో వారిముందు తలవంచి ఉండండి. 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచిపోషించారో అలా నీవు వీరిని కరుణించు' అని ప్రార్థించండి." (ఖుర్‌ఆన్-17:23,24)

"నాపట్ల కృతజ్ఞుడై ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతాభావం తో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే రావలసిఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడిచేస్తే మటుకు నీవు వారి మాట వినకు. ప్రపంచంలో వారి పట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగిరావలసి ఉంది." (ఖుర్‌ఆన్-31:15)



దైవప్రవక్త అనుచరులలో ఒకతను దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటి కన్నా ఎక్కువ ఇష్టమైన సదాచరణ ఏద"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "వేళకు నమాజు చేయడం"అని చెప్పారు. "ఆ తరువాత ఏద"ని అడిగాడు అనుచరుడు. "తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండటం" అన్నారు దైవప్రవక్త (స). "ఆ తరువాత ఏద"ని ప్రశ్నించాడతను. "దైవ మార్గంలో పోరాడటం" అన్నారు దైవప్రవక్త (స)." (బుఖారి, ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నేను (ధర్మస్థాపన కోసం) హిజ్రత్ (వలస) చేస్తానని, జిహాద్‌లో పాల్గొంటానని ప్రమాణం చేసి మీతో అంటున్నాను. దీనివల్ల నాకు దైవం నుండి పుణ్యం లభించాలని కోరు కుంటున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లి దండ్రులలో ఎవరైనా జీవించివున్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "ఉన్నారు, ఇద్దరూ జీవించే ఉన్నారు" అని చెప్పాడు. "నువ్వు నిజంగానే దేవుడు నీకు పుణ్యం ప్రసాదించాలని కోరుకుంటున్నావా?" అని అడిగారు దైవప్రవక్త (స) మళ్ళీ. ఆ వ్యక్తి ఔనన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అలాగైతే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరకు తిరిగివెళ్ళిపో. వారిద్దరికీ బాగా సేవ చెయ్యి. (అందులో నీకు హిజ్రత్, జిహాద్‌ల కంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది.)" అని ఉపదేశించారు. (బుఖారి, ముస్లిం)

ఒకతను వచ్చి "నేను జిహాద్‌లో పాల్గొనాలని అనుకుంటున్నాను. మీ సలహా ఏమిట"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) నీ తల్లి బ్రతికే ఉందా?" అని అడిగారు. అతను "నా తల్లి బ్రతికే ఉంది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నువ్వామెకు సేవ చేస్తూఉండు. ఆమె పాదాల క్రింద (నీ) స్వర్గం ఉంది" అని చెప్పారు. (నసాయి)

ఒకసారి దైవప్రవక్త (స) దగ్గరకు కూర్చొని బనూసలమా తెగకు చెందిన ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు చనిపోయిన తరువాత కూడా నేను వారికి చేయవలసిన సేవ ఏదైనా ఉందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "ఉంది. వారి శ్రేయస్సు మన్నింపుల కోసం దైవాన్ని వేడుకోవాలి: వారు చేసిపోయిన ప్రమాణాలను నెరవేర్చాలి; కేవలం వారి

ద్వారానే కలిసే బంధుత్వాలను కలపాలి; వారి స్నేహితుల్ని గౌరవించాలి" అని చెప్పారు. (అబూదావూద్)

అబూబకర్ (రజి) కుమార్తె అస్మా (రజి) దైవప్రవక్త (స)ను "దైవప్రవక్తా! నా తల్లి నన్ను చూడటానికి వచ్చింది. ఆమె అవిశ్వాసి. మరి నేనామె పట్ల మంచిగానే ప్రవర్తించాలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నీవు నీతల్లి హక్కు కూడా నిర్వహిస్తూఉండాలి" అని చెప్పారు. ( బుఖారి)

## సంతానం హక్కులు

సంతానశిక్షణ విషయమయి ఖుర్ఆన్‌లో హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) తన కుమారునికి హితోపదేశం చేస్తూ ఇలా చెబుతారు:

"కుమారా! నీవు నమాజ్ వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాల నుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవెంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసి పడేవాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడిలో మధ్యేమార్గాన్ని అవలంబించు. నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాలకంటే గాడిద స్వరం అత్యంత కఠోరమైనది." (ఖుర్ఆన్–31:16–19)

"పిల్లవాడు పుట్టిన వెంటనే అతని చెవుల్లో దేవుని స్తుతి, దైవప్రవక్త (స) ప్రస్తావన పడగానే షైతాన్ అక్కడ్నుంచి పారిపోతాడు. పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతనికి పేరుపెట్టాలి. (తప్పుడు అర్థంవచ్చే పేరు కాకుండా మంచిపేరు పెట్టాలి.) తరువాత తలవెంట్రుకలు గొరిగించి 'అఖీఖా' (జన్మ దినోత్సవం) చేయాలి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) పిల్లలను అమితంగా ప్రేమించేవారు. "మన పెద్దలను గౌరవించని, మన పిన్నలపట్ల వాత్సల్యం చూపనివాడు మనలోనివాడు కాదు" అన్నారాయన. (హదీసు).

"తండ్రి తన సంతానాని కిచ్చే కానుకలలో మంచి విద్యాబుద్ధులు గరపడమే గొప్పకానుక. దానికి మించిన శ్రేష్ఠమైన కానుక మరేదీ లేదు."



(తిర్మిజి) "తండ్రి తన కొడుకుకు విద్యాబుద్ధులు గరపడం కంటే మించిన గొప్ప ఉపకారం అతని నుండి మరేదీ లేదు." (తిర్మిజి)

ప్రళయదినాన మనిషితో అందరికన్నా ముందు జగడమాడేవారు అతని సంతానమే. వారు దేవునితో "దేవా! ఇతడ్ని గురించి మా ఫిర్యాదు తీసుకో. ఇతను మమ్మల్ని అక్రమసంపాదనతో పోషించాడు. మాకు విధిగా నేర్ప వలసిన విషయాలు మాకు నేర్పలేదు. అందువల్ల మేము అజ్ఞానులుగా ఉండిపోయాము" అని అంటారు. (తిర్మిజి)

"దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమి స్తున్నాం, మీకూ ఇస్తున్నాం. వారిని చంపడం ఘోరపాపం." (ఖురాన్–17:31)

"ఒక వ్యక్తికి ఓ కూతురుండి, అతనామెను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి బాధలకు, అవమానాలకు గురిచేయకుండా, ఆమెపై కొడుక్కు ప్రాధాన్యమివ్వకుండా పోషించేవానికి దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు." (అబూదావూద్)

"ఏ దాసుని లేక దాసిపై దేవుడు కుమార్తెల బాధ్యత మోపినప్పుడు అతను లేక ఆమె కుమార్తెల పట్ల మంచిగా ప్రవర్తిస్తారో, ఆ బాలికలు అతడ్ని లేక ఆమెను నరకంనుండి కాపాడే సాధనాలవుతారు." (బుఖారి)

దైవప్రవక్త (స) హితోపదేశం చేస్తూ "(నరకంనుండి కాపాడే) దానాలలో గొప్పదానం (సదఖా) ఏమిటో చెప్పనా?" అన్నారు. "తప్పకుండా చెప్పండి దైవప్రవక్తా!" అన్నారు అనుచరులు. అప్పుడాయన ఇలా చెప్పారు: "(విడాకులివ్వబడటం వల్లగాని, వితంతువైనందు వల్లగాని) నీ దగ్గరకు తిప్పిపంపబడిన నీ కుమార్తెకు నువ్వు తప్ప మరెవరూ సంపాదించి పెట్టే వారు లేనప్పుడు నువ్వామెకు మేలు చేయాలి." (ఇబ్నెమాజ)

## భర్త హక్కులు

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపద స్త్రీలకోసం ఖర్చుపెడ్తున్నందువల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయతచూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు." (ఖుర్ఆన్–4:34)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్త్రీ తనభర్త ఇంట్లో అతని అనుమతి లేకుండా ఏ వస్తువు కూడా దానం చేయకూడదు. ఒకవేళ భర్త అనుమతి లేకుండా దానంచేస్తే దాని పుణ్యఫలం భర్తకు పోతుంది, ఆమెకు పాపం మిగులుతుంది." (బుఖారి)

"భర్త అనుమతిలేనిదే భార్య అతనిఇంటి నుండి బయలుదేరకూడదు." (భర్త వద్దన్నా అతని ఆజ్ఞను ధిక్కరించి బయటికిపోకూడదు.)- (మిష్కాత్)

"భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా రమజాన్ ఉపవాసాలు తప్ప ఆమె ఇతర ఇచ్ఛిక ఉపవాసాలు పాటించకూడదు." (ముస్లిం)

"ఒక స్త్రీ దగ్గర (హజ్‌యాత్ర చేయగలిగినంత) ధనం ఉన్నప్పటికీ ఆమె భర్త హజ్‌యాత్ర జరిపే అనుమతి ఇవ్వకపోతే, అతని అనుమతి లేకుండా ఆమె హజ్‌యాత్ర జరపలేదు." (దారుల్ ఖుత్ని)

"మహిళల్లారా! మేలు చేసినవారికి మీరు ఎల్లప్పుడూ కృతజ్ఞులయి ఉండండి. మీలో ఎవరైనా ఒకరు తమ తల్లిదండ్రుల దగ్గర కాలం గడుపుతూ ఉంటారు. తరువాత దేవుడు ఆమెకు భర్తను అనుగ్రహిస్తాడు. ఆ తరువాత ఆమెకు సంతానభాగ్యం కూడా కలిగిస్తాడు. కాని ఎప్పుడయినా భర్తతో ఏదైనా చిన్న గొడవ వస్తే చాలు, 'నీ వల్ల నేనెప్పుడు సుఖపడ్డానని' అంటారు స్త్రీలు (లోగడ చేసిన మేళ్ళన్నీ మరచిపోయి)." (బుఖారి)

"రెండు రకాల మనుషులున్నారు. వారు చేసే నమాజులు వారి శిరస్సుల ఎత్తుకు మించి పైకి పోలేవు. ఒకటి, తన యజమానిని వదలి పారిపోయి తిరిగిరాని బానిస చేసే నమాజు. రెండు, తన భర్త ఆజ్ఞలను ధిక్కరించి ఇక ఎన్నటికీ దారికిరాని భార్య చేసే నమాజ్." (హదీసు)

"నేనెవరికైనా ఇతరులకు సజ్దా చేయమని ఆజ్ఞాపించి నట్లయితే తన భర్త ముందు సజ్దా చేయమని స్త్రీకి ఆదేశించి ఉండేవాణ్ణి" (తిర్మిజీ)

"నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ఏ స్త్రీ అయినా తన భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఆమె తన



ప్రభువు (దేవుని) హక్కుల్ని కూడా నెరవేర్చనట్టే." (హదీసు); "భర్త హక్కుల్ని నెరవేర్చనంతవరకు ఏస్త్రీ విశ్వాసమాధుర్యం ఆస్వాదించలేదు." (మిష్కాత్)

"స్త్రీ తనభర్త పడకవదలి అతనినుండి వేరై రాత్రిగడిపితే, ఆమె అతని దగ్గరకు తిరిగిరానంతవరకు దైవదూతలు ఆమెను శపిస్తుంటారు." (బుఖారి)

"భర్త తన పట్ల ప్రసన్నుడిగా ఉన్న స్థితిలో మరణించే స్త్రీ స్వర్గానికి పోతుంది." (తిర్మిజ)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను "దైవప్రవక్తా! స్త్రీ మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని అడిగాను. దానికాయన "ఆమె భర్తకు ఉంది" అన్నారు. మళ్ళీ నేను "పురుషుని మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని ప్రశ్నించాను. ఆయన "అతని తల్లికి ఉంది" అని చెప్పారు. (ముస్తద్‌రక్ హాకిమ్)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు (ప్రయాణం నుంచి) తిరిగొస్తే, వచ్చే ముందు మీరాక గురించి కబురుపంపండి. దానివల్ల మీభార్యలు అలంకరించుకొని మీ కోసం ఎదురుచూడటానికి సిద్ధంగా ఉంటారు." (ముస్లిం)

"స్త్రీ (రోజా) అయిదు వేళలా నమాజ్ చేస్తూ, రమజాన్‌నెల ఉపవాసాలు పాటిస్తూ, తన శీలాన్ని కాపాడుకుంటూ భర్త పట్ల వినయంతో మసలుకుంటూవుంటే ఆమె పరలోకాన స్వర్గద్వారాల్లో తనకు నచ్చిన ద్వారం గుండా ప్రవేశించవచ్చు." (మిష్కాత్)

## భార్య హక్కులు

పురుషుడు వివాహసందర్భంలో ఏదైనా కారణం వల్ల మహర్ చెల్లించలేకపోతే, వివాహం తరువాత వీలైనంత త్వరగా చెల్లించాలి. ఇది భార్య హక్కు. తర్వాత అతను స్తోమతనుబట్టి ఆమె పోషణఖర్చులు భరించాలి.

"ధనికుడు తన ఆర్థిక స్తోమతనుబట్టి ఈ పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడినవాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి." (ఖుర్ఆన్–65:7)

దైవప్రవక్త (స) హితోక్తి: “ఒక ముస్లిం పుణ్యఫలాపేక్షతో తన భార్యాపిల్లల కోసం ఖర్చుపెడ్తుంటే అదంతా అతని పాలిట దానం(సదఖా) చేసే పుణ్యం తో సమానమవు తుంది.” (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: “మీరు దైవప్రసన్నత కోసం ఏపని చేసినా దాని పుణ్యఫలం మీకు తప్పక లభిస్తుంది. చివరికి మీరు మీభార్య నోటికి ఒక అన్నంముద్ద అందించినా దానికీ పుణ్యఫలం లభిస్తుంది.” (బుఖారి, ముస్లిం)

“మనిషి ఒకరి అన్నపానీయాలకు బాధ్యుడై తన బాధ్యతను నిర్లక్ష్యం చేయటం చాలు, అతను పాపాత్ముడని చెప్పడానికి.” (అబూదావూద్)

ఒకతను దైవప్రవక్త (స)ను “మామీద భార్యకున్న హక్కేమిట?”ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) “నీవు తినగలిగే ఆహారం ఆమెకు పెట్టాలి. నీవు ధరించగలిగే వస్త్రాలు ఆమెకివ్వాలి. (నీపట్ల అవిధేయతకు పాల్పడి నపుడు) నీవామె ముఖంపై కొట్టకూడదు. ఇంట్లో తప్ప మరెక్కడా ఆమెను వదలిపెట్టకూడదు” అని అన్నారు. (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఒకసారి మంచి భర్తను గురించి చెబుతూ “తనభార్య కోసం ఉత్తముడైనవాడే మీలో ఉత్తముడు” అని అన్నారు. (ఇబ్నెమాజ)

భార్యవిధేయులైన భర్తలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “భార్యలకు విధేయులయ్యే భర్తలు నాశనమవుతారు.” (ముస్తదరక్ హాకమ్)

దైవప్రవక్త (స)“దేవుని దాసీలను కొట్టకండని హితబోధ చేశారు. ఆయనీ హితోపదేశం చేసిన కొంతకాలానికి ఉమర్ (రజి) ఆయన దగ్గరికి వచ్చి “స్త్రీలు తమ భర్తలకు ఎదురుతిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) భార్యల్ని కొట్టేందుకు అనుమతిచ్చారు. (ఆ తర్వాత కొంత కాలానికి) ఎంతోమంది స్త్రీలు దైవప్రవక్త (స) భార్యల దగ్గరికి వచ్చి తమ భర్తలు తమల్ని కొడుతున్నారని ఫిర్యాదు చేయసాగారు.

అప్పుడు దైవప్రవక్త (స) “చాలామంది స్త్రీలు ముహమ్మద్ ఇంటి దగ్గర గుమిగూడి తమ భర్తల్ని గురించి ఫిర్యాదు చేస్తున్నారు. మీలో తమ భార్యల్ని వేధించేవారు మంచివారు కాదు, జాగ్రత్త!” అన్నారు. (అబూదావూద్)



“వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు.” (ఖుర్ఆన్–4:19)

“స్త్రీ ప్రక్కటెముకతో సృజించబడింది. అది ఏవిధంగానూ తిన్నగా కాదు. కనుక నీవు ఆమెనుండి ప్రయోజనం పొందాలనుకుంటే వంకరగా ఉన్నప్పుడు కూడా ప్రయోజనం పొందగలవు. నీవామెను తిన్నగా చేయటానికి ప్రయత్నిస్తే ఆమెను విరగ్గొడతావు. ఆమెను విరవటమంటే విడాకులివ్వటమే.” (ముస్లిం)

మహాప్రవక్త (స) మహితోక్తి: “మీలో ప్రతి మనిషీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతను తన సంరక్షణలో ఉండేవారిని గురించి ప్రశ్నించ బడతాడు. పాలకుడు పాలితప్రజల సంరక్షకుడు. అతను తన ప్రజల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది.” (బుఖారి)

## బంధువుల హక్కులు

సామాజికవ్యవస్థలో బంధువులతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యమైన విషయం. రక్తసంబంధీకులతో, సన్నిహిత బంధువులతోనే సంబంధాలు విచ్ఛిన్నం చేసుకునే మనిషి సమాజంలోని ఇతర మానవులపట్ల చిత్తశుద్ధితో సత్సంబంధాలు కలిగివుంటాడని ఆశించలేము.

“రక్తసంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి.” (ఖుర్ఆన్–4:1)

మనిషి ఆంతర్యంలో నిజమైన బంధుప్రేమ ఉంటేనే బంధువులతో సత్సంబంధాలు కలిగివుంటాడు. ఇలాంటి బంధుప్రేమను ఇస్లాంలో ‘సిలారహ్మి’ అంటారు. బంధుత్వాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం, ఆస్తి అంతస్తులు చూసుకొని మిడిసిపడుతూ పేదబంధువులకు దూరంగా మసలుకోవడం, వారి హక్కులు కాలరాయడం బంధుప్రేమ అన్పించుకోదు.

దేవుడు సమస్త సృష్టిరాసుల్ని సృజించిన తర్వాత 'బంధుప్రేమ' లేచి నిలబడి "(దేవా!) నేను బంధుత్వాల తెగతెంపుల బారి నుండి నీ శరణు కోరుతున్నాను" అన్నది. దేవుడు దానిమాట విని "అయితే నీపట్ల సత్సంబంధాలు కలిగివుండే వాడిపట్ల నేనూ సత్సంబంధాలు కలిగివుంటాను. నీతో సంబంధాలు తెగతెంపులు చేసుకునేవాడితో నేనూ సంబంధాలు తెగతెంపులు చేసుకుంటాను. ఇది నీకిష్టమేనా?" అని అన్నాడు. దానికి బంధుప్రేమ "ఇష్టమే ప్రభూ!" అన్నది. అప్పుడు దేవుడు "సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది" అని చెప్పాడు.

బంధుత్వం దైవసింహాసనానికి వ్రేలాడబడి "నాతో సత్సంబంధాలు కలిగివున్న వాడితో దేవుడు కూడా సత్సంబంధాలు కలిగివుండుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని దేవుడు కూడా విచ్ఛిన్నం చేయుగాక!"అని ప్రార్థిస్తూ ఉంటుంది. (బుఖారి, ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నన్ను నరకం నుండి దూరం చేసి, స్వర్గానికి గొనిపోయే ఆచరణ గురించి నాకు తెలియజేయండి" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకు. నమాజ్ వ్యవస్థ నెలగొల్పు. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూఉండు. బంధువులతో సత్సంబంధాలు కలిగివుండు." (బుఖారి, ముస్లిం)

"ఎవరైనా తన ఉపాధిలో సమృద్ధి, ఆయుష్షులో పెరుగుదల కోరుకుంటే అతను తన బంధువులపట్ల సత్ప్రవర్తన కలిగివుండాలి" (బుఖారి)

"ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి ప్రత్యుపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాడు. బంధువులు తనతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే (నిజమైన) బంధుప్రియుడు." (బుఖారి)

ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. నేను వారితో సత్సంబంధాలు కొనసాగించాలని ఎంత ప్రయత్నిస్తున్నా వారు



మాత్రం నాతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలనే చూస్తున్నారు. నేను వారిపట్ల మంచిగా వ్యవహరిస్తుంటే వారు నాకు కీడు తలపెడుతున్నారు. నేను వారిపట్ల మృదువైఖరి అనుసరిస్తుంటే వారు నాపట్ల కఠినంగా ప్రవర్తిస్తున్నారు" అంటూ తన గోడు వెళ్ళబుచ్చున్నాడు. దైవప్రవక్త (స) అతని మాటలు విని "నువ్వు చెప్పింది నిజమేఅయితే నువ్వు వారి నోళ్ళలో వేడిబూడిద పోస్తున్నావనుకో. నువ్వు వారిపట్ల ఇలాగే సత్ప్రవర్తనతో మెలుగుతున్నంత కాలం దేవుని తరపున వారికి వ్యతిరేకంగా ఒక సహాయకుడు నీవెంట ఉంటాడు" అని అన్నారు. (ముస్లిం)

"బంధుత్వాన్ని త్రెంచివేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు." (బుఖారి)

## ముస్లింల పరస్పర సంబంధాలు

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటివారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలు నెలకొల్పండి. దేవునికి భయపడండి, మీరు కరుణించబడతారు."(ఖుర్ఆన్-49:10)

"వారు విశ్వాసుల పట్ల మృదువుగా, అవిశ్వాసుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తారు." (ఖుర్ఆన్-5:54)

ముస్లింల పరస్పర సంబంధాలను గురించి ఎన్నో విషయాలు ఉపదేశించారు. వాటిలో కొన్నిటిని ఇక్కడ పేర్కొంటున్నాను:

"(ముస్లింలారా!) పరస్పరం పగబట్టకండి. అసూయ చెందకండి. ఎడమొహం పెడమొహంతో ఉండకండి. సంబంధాలు త్రెంచుకోకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ములుగా ఉండండి. ఒకముస్లిం తోటి(ముస్లిం) సోదరునితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు." (బుఖారీ, ముస్లిం)

"ఒక ముస్లిం తన సాటి ముస్లిం సోదరుడ్ని అవిశ్వాసి (కాఫిర్) అని పిలిస్తే వారిద్దరిలో ఒకడు తప్పకుండా అవిశ్వాసి అయిపోతాడు." (బుఖారి)

"ముస్లిం తోటి ముస్లింని దూషించడం దుర్మార్గం. అతనితో యుద్ధం చేయడం అవిశ్వాసం (కుఫ్ర్)తో సమానం." (బుఖారి)

"నీవు నీ(ముస్లిం) సోదరుని కష్టాలపట్ల సంతోషించకు. అలా చేశావంటే దేవుడు అతడ్ని కనికరించి నిన్ను కష్టాల పాలుచేస్తాడు." (మిష్కాత్)

"ఒక మనిషి తన తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడని చెప్పటానికి. ఒక ముస్లింకు తోటి ముస్లిం ధనమాన ప్రాణాలు నిషిద్ధం. (అంటే తోటిముస్లిం ధనమానప్రాణాలకు నష్టం కలిగించ కూడదు.) దేవుడు మీ శరీరాలను, ముఖాలను చూడడు. ఆయన మీ ఆంతర్యాల్ని, ఆచరణల్ని మాత్రమే చూస్తాడు." (బుఖారి, ముస్లిం)

"ఒకరి మీద ఒకరు అసూయ చెందకండి. పగ పెంచుకోండి. కూపీలు తీయకండి. ఇతరుల తప్పులు ఎత్తిచూపకండి. ఇతరుల్ని మోసగించే ఉద్దేశ్యంతో బేరం మీద బేరం చేయకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ముల్లా జీవించండి. (బుఖారి, ముస్లిం)

"ఒక ముస్లిం మరొక ముస్లింకు అద్దం లాంటివాడు. ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుడు. అతను తన ముస్లింసోదరుడ్ని వినాశం నుండి రక్షిస్తాడు. అతనికి (సదా) మద్దతునిస్తూ కాపాడుతుంటాడు." (బుఖారీ)

"మీరు ముగ్గురు ఉన్నప్పుడు మూడోవాడ్ని వదలి మిగతా ఇద్దరు రహస్యాలు మాట్లాడుకోకండి. ఈ వైఖరి వల్ల ఆ మూడో వ్యక్తికి బాధ కలగవచ్చు. అయితే మీరు మరికొందరితో కలిసిపోతే అప్పుడు ఫర్వాలేదు." (బుఖారీ, ముస్లిం)

"సోమ, గురు వారాల్లో స్వర్గద్వారాలు తెరువబడతాయి. ఆరోజు అల్లాహ్ దైవత్వంలో ఇతరులకు సాటి కల్పించని ప్రతిఒక్కరి పాపాలు మన్నించబడ తాయి. అయితే తనకూ తన (ముస్లిం)సోదరునికి మధ్య శత్రుత్వం ఉన్న వాడి పాపాలు మాత్రం మన్నించబడవు. వారిని గురించి "వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగు పరచుకునే దాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునే దాకా గడువు ఇవ్వండి" అని అనటం జరుగుతుంది. (ముస్లిం)

"నీవు నీ ముస్లింసోదరుడ్ని కలుసుకున్నప్పుడు (ముందుగా) అతనికి సలాం చెయ్యి. అతను విందుభోజనానికి ఆహ్వానిస్తే దాన్ని స్వీకరించు. అతను నీద్వారా ఏదయినా సహాయం కోరితే సహాయం చెయ్యి. అతను తుమ్మి 'అల్‌హమ్దులిల్లాహ్' (సకల ప్రశంసలకు దేవుడే అర్హుడు) అనంటే, నీవు 'యర్‌రహ్మకుల్లాహ్' (దేవుడు నిన్ను కరుణించుగాక) అని బదులు పలుకు. అతడు జబ్బుపడితే వెళ్ళి పరామర్శించు. చనిపోతే అతని శవానికి తోడుగా వెళ్ళు." (ముస్లిం)



"నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుడి సాక్షి! తన కోసం ఇష్టపడినదాన్నే తన (ముస్లిం)సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ ఏవ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు." (బుఖారి, ముస్లిం)

"ఒక ముస్లిం తోటిముస్లింకు సోదరుడు (లాంటివాడు). ఒక సోదరుడు తన సోదరునిపై (ఎన్నటికీ) దౌర్జన్యం చేయడు; అతడ్ని దౌర్జన్యపరునికి అప్పగించడు కూడా. ఎవరు తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో నిమగ్నుడై ఉంటాడో, దేవుడు అతని అవసరాలు తీర్చే బాధ్యత తీసుకుం టాడు. ఎవరు (తోటి)ముస్లింకు వచ్చిన కష్టాల్లో ఒక కష్టాన్ని దూరంచేస్తాడో ప్రళయదినాన దేవుడు అతని కష్టాలలో ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. మరెవరు (తోటి)ముస్లిం పొరపాట్లు కప్పిపుచ్చుతాడో, ప్రళయదినాన దేవుడు అతని పొరపాట్లు కప్పిపుచ్చుతాడు." (బుఖారి, ముస్లిం)

"విశ్వాసులు పరస్పరం అభిమానించుకోవడంలో, కనికరించుకోవడం లో, ప్రేమతో మెలగడంలో దేహం లాంటివారు. దేహంలో ఒక అవయవా నికి బాధ కల్గినప్పుడు దేహమంతా బాధతో మూలుగుతుంది. (అదేవిధం గా ఒక ముస్లింకు ఏదైనా కష్టం వచ్చిపడితే తోటి ముస్లింలు ఆ కష్టంలో పాలుపంచుకుంటారు)- (బుఖారీ)

'కేవలం నోటితో ఇస్లాం స్వీకరించిన ప్రజలారా! మీ హృదయాల్లో విశ్వాసం ఇంకా చోటుచేసుకో లేదు. మీరు (తోటి)ముస్లింలను బాధించ కండి. వారిని కించపరచకండి. వారి తప్పుల వెంట పడకండి. ఎవరు తమ తోటిముస్లింల తప్పుల వెంటపడతారో దేవుడు వారి తప్పుల వెంట పడతాడు. దేవుడు ఏ మనిషి తప్పుల వెంటపడతాడో ఇంట్లో కూర్చున్నా సరే అతడ్ని పరాభవం పాల్జేసిగాని వదలిపెట్టడు." (తిర్మిజి)

## కలసివుంటేనే కలదు సుఖం

"మీరంతా కలసి దైవత్రాటిని (దైవధర్మాన్ని) దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడిచీలిపోకండి. దేవుడు చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసుకోండి." (దివ్య ఖుర్ఆన్-3:103)

"మీరు పరస్పరం కలహించుకోకండి. అలాచేస్తే మీలో పిరికితనం, బలహీనతలు చోటుచేసుకుంటాయి; మీ ప్రాబల్యం పోతుంది." (ఖుర్ఆన్-8:46)

"స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్పటికీ పరస్పరం విభేదించుకొని విభిన్నవర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి. అలాంటి వారికి ఘోరమైన యాతనలు కాచుకొని ఉన్నాయి." (ఖుర్ఆన్-3:105)

"అవిశ్వాసులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండి కూడా) పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది." (ఖుర్ఆన్-8:73)

ఒకప్పుడు విభిన్నవర్గాలుగా, తెగలుగా, కులాలుగా చీలిపోయి అనైక్యత, అంతఃకలహాలతో సతమతమవుతుండిన అరబ్బుల్ని ఇస్లాం సమైక్య పరచింది. కులం, గోత్రం, జాతి, ప్రాంతం, వర్ణం, వర్గం లాంటి కృత్రిమ విచక్షణ గోడలను కూలగొట్టి దేవుని ఏకత్వం, దైవప్రవక్త (స) విధేయతల ప్రాతిపదికలపై వారందర్నీ ఒక గొడుగు క్రిందికి చేర్చింది. అందువల్ల ముస్లింలు ఇస్లాం సేవలో నిమగ్నులయి ఉండాలి. అదే వారి జీవనధ్యేయం. ఈ ధ్యేయాన్ని విస్మరించి ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాల్ని గురించి వాదించుకోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి పోతుంది.

దైవప్రవక్త (స) హితోక్తి: "జాగ్రత్త! మీరు ముస్లిములై ఉండి కూడా నా తదనంతరం మెడలు నరుక్కునే అవిశ్వాసులుగా మారకండి." (బుఖారి)

ఒక పార్టీకి బయటి దాడులకన్నా అంతర్గత కలహాలే చాలా ప్రమాదకరమైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ఆ పార్టీ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ



కార్యకర్తలకు తమ పార్టీ నిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యం పట్ల శ్రద్ధాసక్తులు, కార్యకర్తల్లో పరస్పర ప్రేమాభిమానాలు ఉండాలి.

దేవుడ్ని, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను విశ్వసించినవారి పార్టీ 'ఇస్లాం.' వారి పార్టీ నిబంధనావళి 'ఖుర్ఆన్.' దాని కార్యాచరణ విధానం 'హదీస్.' పార్టీ లక్ష్యం 'ధర్మసంస్థాపనం', తద్వారా దైవప్రసన్నత, పరలోకసాఫల్యం పొందడం దాని ప్రేరణ. ఈ ఉన్నత లక్ష్యం కోసం పని చేసేవారి భావాలు కూడా ఉన్నతంగా ఉండాలని, పార్టీలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాలపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాలదృక్పథం అలవరచుకోవాలని ఇస్లాం ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెలియజేస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణ విధానాన్ని, ఆశయాల్ని ఎంతగట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.

"మీలో ఒకవర్గం మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడుపనుల నుండి వారించేవారు తప్పక ఉండాలి. అలాంటివారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు." (ఖుర్ఆన్-3:104)

ఈ సూక్తిని బట్టి ప్రతి ముస్లిం తన శక్తి సామర్థ్యాల మేరకు సమాజంలో ప్రబలివున్న చెడుగుల్ని అరికడ్తూ మంచిని వ్యాపింపజేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషి చేయాలని అర్థమవుతోంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విధంగా హితోపదేశం చేశారు: "మీలో ఎవరయినా సమాజంలో ఏదయినా చెడ్డ పని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు చెడుకు వ్యతిరేకంగా గళం విప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడా ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి నిరోధించే శక్తి కూడా లేనివాడు కనీసం మనసులోనైనా ఆ చెడును ద్వేషిస్తే అతను కూడా జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ (చివరి) వైఖరి అన్నిటికంటే అత్యల్ప స్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది." (నిసాయి)

## మానవ హక్కులు

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా తెలియజేశారు:

"దేవుడు తన గ్రంథంలో 'మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. (49:13)' అని అన్నాడు. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి; తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు కలిగివుండటమే." (మిష్కాత్)

"ప్రజలారా! మీప్రభువు ఒక్కడే. తండ్రి కూడా ఒక్కడే. మీరంతా ఆదం (అలై) సంతానం. ఆదం మట్టితో సృజించబడ్డాడు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరికంటే ఉత్తముడు. కనుక ఆధిక్యతా ఔన్నత్యాలకు సంబంధించిన యావత్తు ప్రగల్భాలు, ధన ప్రాణాల ప్రతీకారాలకు సంబంధించిన మొత్తం డిమాండ్లు ఇప్పుడు నాకాళ్ళ కింద తొక్కివేయబడ్డాయి. (అంటే నిషేధించబడ్డాయి.) కాబా సంరక్షణ బాధ్యత, హజ్‌యాత్రికులకు నీటిసరఫరా సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి." (హజ్‌వీడ్కోలు ప్రసంగం-పాక్షికం: ముస్లిం)

"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించి నందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్-5:32)

దైవప్రవక్త (సల్లం) మానవహక్కుల్ని గురించి ఇలా తెలిపారు:

"నోటితో లేక కాలితో బాధించడం, కొట్టడం, తిట్టడం, పరోక్షనిందకు పాల్పడటం ముస్లిం విషయంలో ఎలా నిషిద్ధమో అలా ముస్లిమేతరుని విషయంలోనూ నిషిద్ధమే." (దుర్రెముఖ్తార్)



"ముస్లిం ఎవరైనా జిమ్మీకు చెందిన సారాయిని, పందిని సైతం నష్టపరచినా దానికీ ఆ ముస్లిం నష్టపరిహారం ఇచ్చుకోవాల్సిందే."-

"ఏ ముస్లిమైనా ఒడంబడికదారునిపై (ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుపై) దౌర్జన్యంచేస్తే లేదా అతని హక్కులు తగ్గిస్తే లేదా అతనిపై శక్తికి మించిన బరువుమోపితే లేదా అతని వస్తువేదైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటే ప్రళయదినాన నేనా ముస్లింకు వ్యతిరేకంగా వకీలునయి (దేవుని ముందు) వాదిస్తాను." (అబూదావూద్)

"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారుడ్ని (అంటే ముస్లిమేతరుడ్ని) చంపడం జరిగితే అతను స్వర్గసువాసన ఆఘ్రాణించే అదృష్టానికి కూడా నోచుకోలేడు. స్వర్గసువాసన నలభై ఏండ్లు ప్రయాణం చేసినంత దూరం దాకా వ్యాపిస్తుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ప్రళయదినాన దేవుడు, "నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య)ఛాయ తప్ప మరే ఛాయా లభించని ఆరోజు నేను వారికి నా నీడపట్టున ఆశ్రయం కల్పిస్తాను" అని అంటాడు. (ముస్లిం)

"ఒకతను కొందరిని అభిమానిస్తున్నాడు. కాని సత్కార్యాలు చేయడంలో అతను వారి స్థాయికి చేరుకోలేకపోతున్నాడు (దీనిపై మీ అభిప్రాయం)?" అని దైవప్రవక్త (స)ను ఎవరో అడిగాడు. దానికాయన "మనిషి తాను అభిమానించిన వారితోపాటే ఉంటాడు" అన్నారు. (బుఖారీ)

"ఎవరైనా రోగిని పరామర్శించడానికి లేదా దేవుని కోసం తన సోదరుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు (దేవుని తరఫున) ఒక ప్రకటనకర్త "నీకు అభినందనలు. నీ నడక సార్థకమవుగాక! నీకు స్వర్గంలో స్థానం లభించుగాక!" అని ఎలుగెత్తి ప్రార్థిస్తాడు. (తిర్మిజీ)

"ఏ యువకుడైనా ఒక వృద్ధుడ్ని అతని వృద్ధాప్యం చూసి గౌరవిస్తే దేవుడు అతని వృద్ధాప్యంలో అతడ్ని గౌరవించేవారిని పుట్టిస్తాడు." (తిర్మిజీ)

**(-సమాప్తం-)**